# చిలుకూరు తిరుగుబాటు



726.1
రంగ-చిలు
93119

సి.ఎస్. రంగరాజన్

# చిలుకూరు తిరుగుబాటు



సి.ఎస్. రంగరాజన్

చిలుకూరు తిరుగుబాటు

- సి.ఎన్. రంగరాజన్

726.1
రంగ.చిలు.

తొలి ప్రచురణ: ఫిబ్రవరి 2005

కాపీలు : 500

వెల : రూ. 20/-

C. 12422

A C. No. 93119
500 044.

ప్రతులకు :

"వాక్"
2-2-647/77/డి, శ్రీనివాస నగర్ కాలనీ,
బాగ్ అంబర్‌పేట,
హైద్రాబాద్ - 500 013.
ఫోన్ : 27425640

ముద్రణ :

వాగ్దేవి ప్రింటర్స్
నల్లకుంట
హైద్రాబాద్ - 500 044.
ఫోన్ : 30912541, 27673772

చిలుకూరు బాలాజీ స్వామి సేవలో

తమ జీవితాన్ని అంకితం చేసిన

మా నాయనమ్మ (పాట్టి)

**కోమలమ్మకు,**

మా చిన నాయనమ్మ (చిన్నపాట్టి)

**కళ్యాణమ్మకు**

ఈ పుస్తకం

భక్తిపూర్వకంగా అంకితం

# ముందుమాట

అది నవంబర్ 2001, 28వ తారీఖు బుధవారం. నేను ఆలయ గర్భగుడి తలుపులు మూసివేయడానికి ఉపక్రమించాను. ఇంతలో అక్కడి పోస్టుమాస్టరు ఒక రిజిస్టరు ఉత్తరం నాకు తెచ్చి ఇచ్చారు. ఆ ఉత్తరాన్ని యధాలాపంగా అందుకుని అది తెరిచి చూసే ప్రయత్నం చేయకుండా, దేవాలయం మూసే పనిలో మునిగిపోయాను. ఆలయంలో నాపని పూర్తి చేసుకుని నేను ఆ ప్రాంగణంలోనే ఉన్న నా గృహానికి చేరుకుని తీరికగా నాకు అందిన ఉత్తరం తెరచి విషయం చదివాను.

యాదగిరి గుట్ట, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి హైకోర్టులో దాఖలు చేసిన కేవీయట్ యొక్క నకలు. అది పంపబడిన తేది 27th నవంబరు. పంపిన ఒక్క రోజులోనే, నాకు దాని యొక్క నకలు, అదీ రిజిస్టరు పోస్టు ద్వారా అందటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఉత్తరం యొక్క శీఘ్ర గమనం నాకు ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తే దాని సారాంశం అత్యంతాశ్చర్యాన్ని కలిగించింది. ఉత్తరం సారాంశం ఏమనగా, ఎండోమెంట్స్ శాఖ కమిషనరుగారు, చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని, యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి, దత్తత ఇస్తున్నట్టుగా ప్రకటించారు. ప్రస్తుత యాజమాన్యం (అంటే మేము) చిలుకూరు దేవాలయాన్ని అభివృద్ధి చేయలేకపోవడమే ఈ దత్తత ఇవ్వడానికి కారణంగా వారు లేఖలో పేర్కొన్నారు. పైన జరిపిన చర్య మొత్తం దేవాదాయ చట్టంలోని 145 సెక్షన్ క్రింద రాగలదు. ఈ కెవీయట్ ద్వారా దేవాదాయశాఖ న్యాయస్థానానికి వివరించింది ఏమనగా, ప్రస్తుత దేవాలయ యాజమాన్యం (అంటే మేము) కనక కోర్టును ఆశ్రయిస్తే దేవాదాయశాఖను అడగకుండా స్టే ఉత్తర్వులు ఇవ్వవద్దని ప్రార్థిస్తూ, అలాంటి ఉత్తర్వులు కనక ఇవ్వబడితే దేవాలయానికి తీరని అన్యాయం జరుగుతుంది, అని కూడా వివరించడం జరిగింది.. ఎంత దారుణం?! అంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించే స్వేచ్ఛకూడ మాకు లేకుండా చేసే పన్నాగం. లేఖ చదివిన నాకు ఇక ఆ రాత్రి కంటిమీదికి కునుకు రాలేదు.

యాదగిరిగుట్ట, ఆంధ్రప్రదేశ్ లో నల్గొండా జిల్లాలో ఉండగా, చిలుకూరు బాలాజీ దేవాలయం, రంగారెడ్డి జిల్లాలో కలదు. రెండు దేవాలయాల మధ్యదూరం సుమారు 95కి.మీ. ఈ రెండు దేవాలయాల మధ్య దూరంలో కొన్ని వందల దేవాలయాలు దీనావస్థలో, జీర్ణదశలో పట్టించుకునే నాథుడే లేకుండా ఉన్నాయి. ఇలా జీర్ణదశలో ఉన్న ఆలయాలలోనే ఎన్నో లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు తమను సానుభూతితో చేయూతనిచ్చి అభివృద్ధి చేయగలగే సంస్థల కొరకై ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరి ఇన్ని జీర్ణ దేవాలయాలు ఉండగా యాదగిరి

లక్ష్మీనరసింహస్వామికి చిలుకూరు దేవాలయాన్ని దత్తత తీసుకోవాలనే ఆలోచన ఎందుకు వచ్చిందో నాకు అర్థం కాలేదు. ఈ ప్రశ్నకు జవాబు నాకు 29వ తేదినాడు లభించింది. **సమాధానం డబ్బు. అవును కేవలం డబ్బుమాత్రమే.**

29వ తారీఖు నాడు నేను భగవంతునికి నిత్యపూజలు నిర్వహిస్తున్నాను. ఆ సమయంలో ఇంట్లో నేను, నాభార్య, మా చిన్నాన్న శ్రీనివాసరాఘవాచార్యులు మరియు నా చెల్లెలైన సీత మాత్రమే ఉన్నాము.

ప్రొద్దున 10 గంటల సమయం, ఆలయంలో సుమారు 100మంది భక్తులు ఉన్నారు. ముఖ్యంగా కార్తీకమాసం మూలాన స్త్రీల సంఖ్య అధికంగా ఉండింది. నేను వారందరికి ఆలయ స్థలపురాణం చేస్తూ ఉండగా, నేను దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగారెడ్డి జిల్లా, ఇద్దరు మనుషులతో సహా రావడం చూసాను. ఆ అధికారి నన్ను తన దగ్గరకు పిలిచి, ఆలయాన్ని యాదగిరి గుట్ట దేవాలయ స్వాధీనంలోకి ఇవ్వడం జరిగిందని, కాబట్టి తక్షణం ఆలయాన్ని వాళ్ళకు అప్ప జెప్పాలనీ చెప్పారు. ఎదురుచూడని ఈ పరిస్థితికి నేను ఉక్కిరి బిక్కిరి అయ్యాను, కాని వెంటనే తేరుకుని ఉత్తర్వు యొక్క ప్రతి చూపించమని అడిగాను. ఉత్తర్వులు త్వరలో ఇవ్వబడతాయని ఆ అధికారి చెప్పారు. అతని నిర్లక్ష్య వైఖరి నాకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఇలాంటి విపరీత ధోరణి సరికాదని, జరిగినదంతా అక్కడి భక్తులకు చెప్తానని నేను ఆయనను బెదిరించాను. ఆ అధికారి దీనికి ఒప్పుకోక పోయినప్పటికి నేను జరిగినదంతా అక్కడ ఉన్న భక్తులకు వివరించాను.

ఒక గంట తరువాత, నేను నా ఇంటికి బయలుదేరాను. ఈ అధికారులంతా నన్ను అనుసరిస్తు వచ్చి, కమీషనరుగారి నిర్ణయానుసారం, దేవాలయాన్ని యాదగిరిగుట్టనుండి వచ్చిన అధికారులకు అప్పగించమని నాకు సలహా ఇచ్చారు. యాదగిరి గుట్ట నుండి వచ్చిన అధికారులు తమతో గుడి అజమాయషీకి కావలసిన సరంజామాతో సహా అంటే హుండి, టిక్కెట్లు వగైరాలతో సిద్ధంగా వచ్చారని కూడా చెప్పారు. నేను జవాబు చెప్పకుండా వారిని ఇంటికి వచ్చి మా చిన్నాన్న గారితో మాట్లాడమని ఆహ్వానించాను. అందరితో వెళ్ళి మా చిన్నాయన గారికి పరిస్థితిని వివరించాను. ఆ తరువాత మా కుటుంబ సభ్యులను ఆ అధికారులకు పరిచయం చేసాను. రెండు చేతులా చక్కగా సంపాదిస్తున్న కొడుకులున్నప్పటికి నాతో పాటు కష్టపడుతున్న నాభార్యను ఆ అధికారులకు పరిచయం చేసాను. ఇంకా చెప్పాలంటే, తన ఆరోగ్యపరిస్థితిని లెఖ్ఖ చెయ్యకుండా (అప్పటికే నాభార్యకు మూడు పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలు జరిగాయి) 3 కిలోల పులిహోర చేసింది నాభార్య. ఆవిడని చూపించి ఆధికారులతో ప్రశ్నించాను. "నాకు మీరు నెలజీతం ఇచ్చిన ఎడల ఈవిడకి మీరు ఎంత జీతం ఇస్తారు? అంటూ ప్రశ్నించాను. ఆతరువాత ఆలయం కోసం తన జీవితాన్నంతా త్యాగం చేసిన నాచెల్లెలు సీతను పరిచయం చేస్తూ, మరి ఈమె ఆలయానికి చేసిన సేవలకు ఎటువంటి ప్రతిఫలం ఇవ్వగలరని అడిగాను. ఆ అధికారులతో తను కూడా మాట్లాడాలని

నా చెల్లెలు ఏదో మాట్లాడ బోయింది. కాని అధికారి ఆమెను మాట్లాడనివ్వలేదు. నా అభ్యర్థన తరువాత నా చెల్లెలికి మాట్లాడే అవకాశం లభించింది. ఆమె మాట్లాడిన మాటలు లోపలి పేజీల్లో పాఠకులు చదువగలరు. నేను చివరకు నా తుది నిర్ణయాన్ని వారికి వినిపించాను.

దేవాదాయ శాఖకు దేవాలయాన్ని అప్పగించాలంటే, 1) ఉత్తర్వుల ప్రతి నాకివ్వాలి 2) మా వాదనను వినిపించడానికి కమిషనరుగారు అవకాశం ఇవ్వాలి. పై రెండూ జరుగుతేనే తదుపరి చర్యలు సాధ్యం, అని తేల్చి చెప్పేశాను.

వచ్చిన అధికారులు నన్ను న్యాయస్థానాన్ని ఆశ్రయించండని చెప్పారు. 30/87 దేవాదాయ చట్టం ఎంత రాక్షసత్వమైనదో మీకు తెలియదా? నేను కోర్టును ఆశ్రయిస్తే న్యాయం జరుగదు అని మీకు తెలియదా అన్న సూటి ప్రశ్నకు వారు జవాబు చెప్పలేక పోయారు. మెల్లిగా ఇంటినుంచి వాళ్ళు దేవాలయానికి వెళ్ళిపోయారు.


నేను భోజనాన్ని ముగించుకొని దేవాలయానికి వెళితే, ఆ అధికారులు ఇంకా అక్కడే ఉండడం చూశాను. నాకు చెప్పలేనంత ఆగ్రహం, ఆవేశం ఎక్కడ్నుంచి వచ్చిందో తెలియదు. అంతవరకు ఎంతో సుముఖంగా మాట్లాడిన నేను ఎలా అంత ఆవేశపడ్డానో ఇప్పటి వరకు అర్థం కాలేదు.

నేను హుటాహుటిని వాళ్ళ దగ్గరకు వెళ్ళి, ఇలా ఆలయం తాళాలు ఇవ్వమని పట్టుబడితే నేను ఆ తాళాలు చేతిలో పెట్టుకుని అగ్నికి నన్ను అహుతి చేసుకుంటానని ఆ తరువాత నా చితాభస్మం నుంచి తాళాల గుత్తి పొందవచ్చని ఆవేశంగా హెచ్చరించాను. నా ఆవేశం చూసి వచ్చిన వారు కొంచం తగ్గి తిరిగి వెళ్ళిపోసాగారు. నేను వారిని ఆపి దైవదర్శనం చేసుకుని వెళ్ళమని చెప్పాను. వారు అలాగే చేసారు. వారినందరిని పూలదండలతో ప్రసాదంతో సత్కరించాను. వెళ్లేటప్పుడు వారు తమని మన్నించకోరుతూ, జరిగిన దాంట్లో తమ తప్పేమీ లేదని, పై అధికారుల ఆదేశం మేరకు తమ బాధ్యతను నిర్వహించామని తెలిపారు. నేను వారిని అర్థం చేసుకోగలిగాను. వారు ఆరోజు 3గంటల ప్రాంతంలో ఆలయ ప్రాంగణం నుండి వెళ్ళి పోయారు.

నేను వెంటనే, ఏదో పనిమీద హైదరాబాదుకు వెళ్ళిన నా తమ్ముడు సి.యస్. గోపాలకృష్ణను పిలిపించాను. అలాగే నా కుమారుడు సి.యస్. రంగరాజన్‌ను కూడా పిలిపించి జరిగిన విషయం వివరించాను. మేమందరం కలిసి కూర్చుని ఇకపై మేము తీసుకోవలసిన చర్యల గురించి చర్చించుకున్నాము.

ఆ భగవంతుని అర్చించుకోవడానికే తరతరాలనుండి మా కుటుంబంలో ప్రతి ఒక్కరు జన్మించారని మా కుటుంబ సభ్యుల గట్టి నమ్మకం. ఆలయాన్ని యాదగిరిగుట్టకు అప్పగించాలన్న దేవాదాయశాఖ యొక్క ఉత్తర్వు, తరతరాల మా కుటుంబం యొక్క మూల విశ్వాసాన్ని ఊచకోత కోసింది. ఇంకొక మాటలో చెప్పాలంటే, మా కుటుంబానికే ప్రధముదుగా ఎంచుకునే ఆ భగవంతునినుండి మమ్మల్ని వేరుచేసే ప్రయత్నం జరిగింది. ఆ భగవంతునికి

నవంబర్ 29, 2001 చిలుకూరులో దేవాదాయ శాఖ అధికారులతో,
యాదగిరి గుట్ట దేవస్థానం దత్తత ఉత్తర్వును ప్రతిఘటిస్తున్న అర్చకులు



నైవేద్యంపెట్టకుండా ఒక్క ముద్దకూడా ముట్టుకోని మాకు ఈ వార్త నిజంగా ఒక చావు కబురు లా మారింది. ఇక మాకు మిగిలినవి రెండు మార్గాలు. లొంగిపోవడం లేక పోతే ఎదిరించడం, ఏదైనా చెయ్యడమో లేక చావడమో, వెన్నుచూసి పారిపోవడమో లేక గుండెధైర్యంతో ఎదురొడ్డి పోరాడటమో. మేము రెండవ మార్గమును ఎన్నుకున్నాము.

భగవంతుని సేవించే భాగ్యం కొరకు మేము పోరాడ నిశ్చయించాము. మరుసటి రోజు అర్చకుల, భక్తుల ఆత్మావలోకనం దినంగా ప్రకటించబడింది. ఈ రోజు అర్చకులు, భక్తులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఒక్క ఆలయాన్ని ఈ పైశాచిక చట్టం మొక్క కబంధ హస్తం నుండి తప్పించడానికై తమ వంతు కర్తవ్యము, పాత్ర ఏమిటి అని ఆత్మావలోకనం చేసుకొనే సుదినం, ఈ ఆత్మావలోకన దినం. దేవాదాయ శాఖ యాజమాన్యం చేసిన ఈ దౌర్జన్యపు వైఖరిని భక్తుల ముందు పెట్టడానికి ఇది ఒక సువర్ణ అవకాశంగా మాకు తోచింది. ఆ రాత్రంతా కూర్చుని మేము ప్రెస్ నోటును తయారు చేసాము. ఎన్నో వాద ప్రతివాదనల తరువాత చివరి draft తెల్లవారు ఝాము 3 గంటలకు తయారయింది. ఆ తరువాత ఒక గంటపాటు పడుకుని నా కుమారుడు హైదరాబాద్ బయలుదేరి వెళ్ళిపోయాడు. నేను, నా తమ్ముడు ఆత్మావలోకనానికి – మమ్మల్ని మేము ఆయత్తపరచుకోడంలో నిమగ్నులమయ్యాము. నాకుమారుడు రంగూ (ఇంట్లోపిలిచే పేరు) తన భార్యచేత ప్రెస్‌నోట్ తెలుగులోకి తర్జుమా చేయించుకుని దాన్నే ప్రింట్ చేసుకుని తిరిగి 10.30కి (ప్రెస్ వాళ్ళతో) సహా చిలుకూరు చేరుకున్నాడు. ఆ రోజు చిలుకూరులో 500 మంది భక్తులు ఉన్నారు. ఆ రోజు ఏమి జరిగిందో దినపత్రికలలో వచ్చింది. అది వివరంగా లోపల పేజీల్లో చదవవచ్చు.

* * *

అది డిసంబరు 1st శనివారం మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో దేవాదాయ శాఖ కమిషనరు గారిచే ఇవ్వబడిన ఉత్తరువు యొక్క ప్రతి ఇన్‌స్పెక్టరు ద్వారా నాకు చేరింది. దాని ప్రకారం చిలుకూరు దేవాలయం యాదగిరి గుట్ట దేవాలయానికి అనుబంధ ఆలయంగా నిర్ణయించబడింది. ఈ ఆర్డరు మీది తేది 31-10-2001 గా ఉండింది. అది నాకు చేరడానికి 32 రోజులు పట్టినది. ఒక తాబేలు వీపుకి ఈ ఉత్తరాన్ని అంటిస్తే కూడ నాలుగు రోజుల్లో చిలుకూరు చేరేది. లేదా పాదయాత్రగా ఎవరైనా పట్టుకొని వస్తే ఒకే రోజుల్లో చిలుకూరులో మాకు అందేది. మరి 32 రోజులు ఈ ఉత్తరం నత్తనడకన చేరడానికి కారణాలు హైటెక్ అధికారులు చెప్పగలరా?

కమిషనరు గారి దగ్గర అపాయింట్‌మెంట్ డిసంబరు 3 వ తేది 3 గంటలకు దొరికింది, అని అసిస్టెంట్ కమిషనరు ఫోను ద్వారా చెప్పారు. మీటింగు గురించి చెప్పి ఆయన, యాదగిరి గుట్ట అధికారులు చిలుకూరు స్వాధీనానికి వచ్చేస్తారని మీటింగుకూ, ఈ చర్యకు సంబంధం లేదని కూడా చెప్పారు. ఈ వ్యవహారము నాకు చిర్రెత్తించింది.

చిలుకూరు పైన జరగబోయే దాడిని ఎలాగైనా ఆపాలని ఎంతోమంది భక్తులు, శ్రేయోభిలాషులు ప్రయత్నించారు. డిసెంబరు 3, 2001 నాడు యాదగిరిగుట్ట అధికారులు

మళ్ళీ వచ్చి దేవాలయాన్ని స్వాధీనం చేసుకుంటారని తెలిసి ఒక ఐఏఎస్ అధికారి తీసుకున్న చొరవ ఎంతో శ్లాఘనీయం. 3వ తారీఖు తెల్లవారుఝామున ఆ IAS అధికారి ద్వారా, కమిషనరుగారితో చర్చ ముగిసే వరకు ఆలయాన్ని అప్పగించను అనే నా నిర్ణయాన్ని, కమీషనరుగారికి అందచేసాను. కానీ ఆయన నా నిర్ణయాన్ని అంగీకరించ కుండా ఆయనతో చర్చకు, అధికారుల ఆలయ స్వాధీనానికి సంబంధం లేదని చెప్పేసారు. పోనీ కనీసం కమీషనరు గారితో నేను కలిసి మాట్లాడే వరకు యాదగిరి గుట్ట అధికారులు చిలుకూరుకు రావద్దని నేను అభ్యర్థించాను. దీనికీ ఆయన అంగీకరించలేదు.

ఇక ఆ రోజు ప్రొద్దున 10 గంటలకు పోలీసు అధికారులు వచ్చి నేను ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి కారణాలు వివరించమని నన్ను అడిగారు. నేను వారికి జరిగిన విషయమంతా పూసగుచ్చినట్టు వివరించి, ఎటువంటి పరిస్థితుల్లో ఇటువంటి నిర్ణయం తీసుకో వలసివచ్చిందో తెలియజెప్పాను. ఇటువంటి పరిస్థితుల్లో ఆలయంలో ఆందోళన సృష్టించడం మంచిది కాదని, అందులోనూ నేను కమిషనరుగారి నిర్ణయానికి పూర్తిగా కట్టుబడి వుంటానని, చెప్పిన తరువాత కూడా ఈ దౌర్జన్యము, దురాక్రమణ అనవసరం అని అన్నాను. ఇక ఆరోజు అధికారులు రావడం గురించిన ఎటువంటి వార్త దేవాదాయ శాఖనుండి నాకు అందలేదు. ఆ తరువాత తెలిసిందేమంటే పోలీసువర్గాలు ముఖ్యమంత్రిగారి కార్యాలయానికి సమాచారాన్ని అందిస్తూ చిలుకూరుకు ఒక వేళ యాదగిరి గుట్ట అధికారులు వెళ్తే అక్కడ భక్తుల ఆందోళనలు, జరుగుతాయని శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతుందని చెప్పారని విశ్వసనీయుల ద్వారా తెలిసింది. కాబట్టి, కమిషనరుగారితో నా మీటుంగు ముగిసే వారకు ఈ విషయంలో ఏవిధమైన చొరవ ప్రదర్శించకూడదనీ ముఖ్యమంత్రి గారి పేశీనుండి ఆదేశం అందినట్లు తెలిసింది. (పై సంఘటనలోని నిర్ణయం విషయంలో అప్పటి హోమ్ శాఖ మంత్రి శ్రీ దేవేందర్ గౌడ్ గారి పాత్ర ఎంతైనా ఉంది. ఆయన చిలుకూరు బాలాజీ పై అచంచల భక్తి విశ్వాసాలు కల వ్యక్తి. దేవాదాయ శాఖాధికారులు చేసిన ప్రతి కుట్రను, కుయుక్తులను ఆయన అడుగడుగునా తన ప్రమేయంతో ఆపేయగలిగారు. భక్తులంతా చిలుకూరు దేవాలయంపట్ల ఆయన చూపిన చొరవకు ఎంతో కృతజ్ఞులుగా ఉన్నారు. "మేము అధికారంలో ఉన్నన్ని రోజులు చిలుకూరు ఆలయవ్యవహారాల్లో తలదూర్చము" అని ఆయన ఒక కాంగ్రెస్ MLA అయిన చల్లా రామకృష్ణారెడ్డి గారితో అన్న మాటలు ఇంకా నాకు గుర్తున్నాయి.)

ఆరోజు 3గంటలకు నేను దేవాదాయ కమిషనరు శ్రీ అజేయకల్లామ్ I.A.S.గారిని కలిశాను. ఆయన నీతి, నిజాయితి మూర్తీభవించిన ఒక అద్భుతమైన వ్యక్తి. పదిహేను నిమిషాలు మాత్రమే కేటాయించబడిన మా చర్చాసమయము ఒక గంట పాటు సాగింది. శాఖ అధికారుల సహాయంతో నిజాన్వేషణ కమిటిని పెట్టి సత్యశోధన చేయించాలని, ఆ రిపోర్టులో నిర్ధారించబడిన సత్యాన్ని బట్టి ఇటుపై ఎటువంటి నిర్ణయానికైనా నేను బద్ధుడిగా ఉంటానని, అప్పటి వరకు ఆలయాన్ని యాదగిరిగుట్టకు దత్తత ఇచ్చే నిర్ణయాన్ని దూరంగా ఉంచాలని అభ్యర్థించాను. కమిషనరుగారు సాభిప్రాయంతో అంతా విన్నారు, కానీ నాకు

ధైర్యం కలిగేలా ఎటువంటి హామీ ఇవ్వలేదు.

నేను కమీషనరుతో చర్చ ముగించుకుని గదిని వదిలి వెలుపలికి వచ్చాను. దేవాదాయశాఖ మొత్తం ఉద్విగ్నతతో కమిషనరుగారి గదిని చూస్తూ ఉండింది. నేను వెలుపలికి రాగానే యాదగిరిగుట్ట అధికారులు నాతో "చర్చలో ఏమి జరుగుతుందో అని పొద్దున నుండి ఎదురుచూస్తున్నామండి" అని నాతో చెప్పి కమిషనరుగారి గదివైపు నడిచారు. నేను ఏమీ జవాబివ్వకుండా దేవాదాయశాఖ కార్యాలయాన్ని విడిచి చిలుకూరు చేరాను. దీని తరువాత కమిషనరు కార్యాలయం నుంచి నాకు ఎటువంటి సమాచారం అందలేదు. కాలక్రమేణ నాకు తెలిసిందేమంటే, కమిషనరుగారు యాదగిరిగుట్ట ఇ.ఓ.ను కొంతకాలం వేచి వుండమని కోరారట.

పరిస్థితిని ఇంత చక్కగా కర్ర విరగకుండా పాము చావకుండా అన్నట్టుగా, ఇరుపక్షాలకు బాధ కలిగించకుండా వ్యవహరించిన కమిషనరు గారికి నేను ఎంతో కృతజ్ఞుడను.

* * *

అది డిసంబరు 8వ తారీఖు, శనివారం ప్రొద్దున 6 గంటలకు, నేను పూజకై అన్ని సిద్ధం చేసుకుంటున్నాను. పనిచేసుకుంటూనే నేను ఆలోచించసాగాను. మనసు పరిపరి విధాల ఆలోచించింది. కమిషనరుగారిని ఒక ఇబ్బంది పెట్టగూడదు. అని అనిపించింది. ఈ ఆలోచన కార్యరూపంలో పెట్టాలంటే, ఆ రోజునుండి హారతి పళ్లెం భక్తుల దగ్గరకు తీసుకు వెళ్ళకుండడం మరియు హుండిని తీసెయ్యడం ద్వారా చెయ్యాలని నా మనసు చెప్పింది. నా మనసులోని మాట శ్రీ రత్నప్రసాద్ అనే భక్తుని ద్వారా దేవాలయంలో ఉన్న భక్తులకు చెప్పబడింది. భక్తులు రత్నప్రసాద్‌గారు చెప్పినదంతా నిశ్శబ్దంగా, ఆసక్తితో విన్నారు. అంతే హుండీని అప్పుడే తొలగించాం. ఆరోజు 9గంటల నుండి వందల సంఖ్యలో భక్తులు ఆలయానికి రావడం మొదలుపెట్టారు. ఆలయ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ముఖద్వారాన్నే మూసివేసి ప్రక్కనే ఉన్న ఇంకొక తులుపుద్వారా భక్తులను లోపలికి పంపవలసి వచ్చింది. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని భక్తులకు తెలిపిన మూడుగంటల వ్యవధిలోనే ఎందుకింత జన సందోహం? ఎక్కడి నుండి వచ్చారు వీళ్ళంతా? వీరికి ఆలయాన్ని దర్శించాలనే స్ఫూర్తి ఎవరిచ్చారు? దీనికి సమాధానం నాకు తెలియదు, భక్తులు వివరించలేరు. ఆ జన సందోహాన్ని చూస్తుంటే ఈ నిర్ణయానికీ అధిక సంఖ్యలో భక్తుల రాకకు ఏదో ఒక దైవీక సంబంధం ఉందనిపించింది. ఈ నిర్ణయానికి, దేవుడు చూపిన హర్షమే ఈ భక్తజన ప్రవాహం. ఇది నా నమ్మకమే కాదు విశ్వాసం.

డిసెంబర్ 12వ తేది, నిజాన్వేషణ కమిటి, అదనపు కమీషనరు శ్రీ కృష్ణారెడ్డి గారి సారధ్యంలో చిలుకూరుకు వచ్చింది. ఈ కమిటిలో ఇంకా యాదగిరిగుట్ట ఇ.ఓ, రీజనల్ జాయింట్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ రంగారెడ్డి జిల్లా, ఇన్స్పెక్టర్లు కూడా ఉన్నారు. చర్చలు కూలంకషంగా జరిగాయి. ఇందులో మా చిన్నాన్న శ్రీనివాస రాఘవాచార్యులు గారు కూడా ఉన్నారు. ఈ చర్చానంతరం వీరి రిపోర్టు ఆధారంగా రెండు ఉత్తర్వులు జారీ

చేసారు. 1. చిలుకూరు ఆలయాన్ని యాదగిరిగుట్టకు అనుబంధంగా మార్చాలని తీసుకున్న నిర్ణయాన్ని మానుకోవడం 2. ఆలయానికి సంబంధించి రెండు కమిటీలు ఉంటాయి. ఒకటి మేనేజ్‌మెంట్ కమిటీ రెండవది డెవలప్‌మెంట్ కమిటీ. మేనేజ్‌మెంట్ కమిటిలో సభ్యులుగా నన్ను, నా తమ్ముడు సి.ఎస్. గోపాలకృష్ణను, అడిషనల్ కమీషనర్, రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమీషనర్‌లను తీసుకోవడం జరిగింది. డెవలప్‌మెంట్ కమిటీలో ఇద్దరు అడిషనల్ కమీషనర్లు మరియు నేను, నా తమ్ముడు ఉన్నాం. ఈ కమిటీలు 1st మే 2002 వరకు సజావుగా కర్తవ్యాన్ని నిర్వర్తించాయి.

## భూరి 'పథకం'తో భారీ వసూళ్లు!

**గుళ్ల పేరిట దాతల పర్సులు గుల్ల–మాకేమీ సంబంధం లేదు : దేవాదాయ శాఖ**

(న్యూస్‌టుడే, హైదరాబాద్) : మానవులను సేవిస్తే మాధవుడిని సేవించినట్లేననేది నాడు. *మానవులను మోసగించటానికి మాధవుడి పేరునే వినియోగించుకోవడం కొందరి బాట నేడు! జిల్లాకో ఆలయాన్ని, ఒక్కో ఊరినీ ఉద్ధరిస్తాం. భూరి విరాళాలు ఇచ్చి తరించండంటూ ఓ మహానుభావుడు జనంపై పడితే... దేవాదాయ శాఖ ఎక్కడ అప్రతిష్ఠపాలవుతుందోననే భయంతో అతడితో తమకేమీ సంబంధం లేదని ఆ శాఖ పత్రికా ప్రకటనలను జారీ చేస్తున్నది.* చిన్నతరహా పరిశ్రమల సంఘానికి నేతనని చెప్పుకుంటారాయన. బాసర, అమరావతి, కాళేశ్వరం, చిలుకూరు వంటి దేవాలయాలను పేర్కొన్న ఆ బ్రోచర్లలో... తమ సంస్థ ఇలాంటి 23 ఆలయాలను అన్ని రకాలుగా అభివృద్ధిచేస్తుందని అంటారు. ఒకటి కాదు, రెండు కాదు... తాగునీటి సౌకర్యం, వేద పాఠశాలలు, విద్య, వైద్యం, అప్రోచ్ రోడ్లు, రోడ్ల విస్తరణ, డ్రైనేజీ, పార్కులు, సత్రాలు, అతిథి గృహాలు, వృద్ధుల ఆశ్రమాలు, వృత్తి విద్య సౌకర్యాలు, స్వతంత్రోపాధికల్పన కేంద్రాలు, చివరకు ఆలయాల్లో క్యూ కాంప్లెక్సులను తామే నిర్మిస్తామని బ్రోచర్లలో పేర్కొన్నారు. ఇటీవల దేవాదాయశాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జోగులాంబ అమ్మవారి దేవస్థానమూ ఇదే జాబితాలో ఉంది. మహారాజ పోషకులైతే రూ. లక్ష, రాజపోషకులైతే రూ.50 వేలు, పోషకులైతే రూ.25 వేలు, మామూలు దాతలైతే రూ. 10వేల చొప్పున చెల్లించాలని 'జాతి నిర్మాణం'లో పాల్గొనాలని పిలుపును ఇచ్చారు. దేవాదాయ శాఖ అధికారులు సహా వీవీఐపీల పేర్లు చెబుతూ రాష్ట్రవ్యాప్తంగా చందాలను వసూలు చేస్తుండటం, లక్షలు వసూలవుతున్న ఈ వ్యవహారంలో చివరకు తమను బద్నాం చేసే ప్రమాదం ఉందని దేవాదాయశాఖ గ్రహించింది. ఆ కార్యకలాపాలు పూర్తిగా చట్టవిరుద్ధమని, అనధికారికమని దేవాదాయశాఖ కమిషనర్ ఓ పత్రిక ప్రకటన జారీ చేశారు. చందాలు ఇచ్చేవారు అనక దేవాదాయశాఖను గానీ, ప్రభుత్వాన్ని గానీ నిందించి ప్రయోజనం లేదనీ స్పష్టం చేశారు. కొంతకాలం కింద చిలుకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి ఈ సంస్థ ప్రతినిధులు ఇదే రకమైన సమగ్ర అభివృద్ధి నినాదాన్ని వినిపిస్తే, అక్కడి అర్చకులు, భక్తులు వెళ్లగొట్టారని తెలిసింది. ఇప్పటివరకూ వివిధ ఆలయాల పేరిట ఎంత వసూలు చేశారో విచారణ జరిపించాలనే డిమాండులు పెరుగుతున్నాయి. (ఈనాడు 7-6-2002)

పైన వివరించిన సంఘటన పూర్వాపరాలు పాఠకులు తెలుసుకోవాలి. 2002లోని ఉత్సవాల సమయంలోనే ఈ మోసగాడి పన్నాగం జరిగింది. ఈ సమయంలోనే జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ కాసాని జ్ఞానేశ్వర్‌గారు రంగప్రవేశం చేసారు. ఈయన, శాఖలోని అవినీతి అధికారులందరిని హెచ్చరించారు. తెరవెనక ఉంటూ ఈ మోసగాడిని ఎవరైతే ప్రోత్సహిస్తున్నారో వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. స్థానిక ఎం.ఎల్.ఏ. అయిన శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిగారు, దేవాలయ యాజమాన్యంలో మాకు పూర్తి స్వేచ్ఛను కల్పించారు. చిలుకూరు ఆలయానికి కావలసిన కనీస సౌకర్యాలు అంటే రోడ్లు, త్రాగునీటి వ్యవస్థను మెరుగు పరచడంలో శ్రీ కాసాని జ్ఞానేశ్వర్ గారు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు మాకెంతగానో సహాయం చేసారు. గ్రామ ప్రజలు మరియు సర్పంచ్ నక్షత్రం గారి ఆధ్వర్యంలోని చిలుకూరు గ్రామ పంచాయతీ సభ్యులందరు దేవాలయం పట్ల తమ బాధ్యతను ఎన్నడూ విస్మరించలేదు. పరిస్థితి అంతా అదుపులో ఉండగా, ఎటువంటి గొడవలు లేని సమయంలో ఈ ట్రస్ట్ బోర్డు నియామకం యొక్క నిర్ణయం పెద్ద చావు దెబ్బ. 22వ తేది ఏప్రిల్ మాసం చిలుకూరులో ఉత్సవ సమయం దేవాదాయశాఖ కార్యాలయంలో మ్యానేజిమెంటు కమిటి సమావేశమయింది. ఉత్సవాలను జరిపించవలసిన పద్ధతి గురించిన చర్చలు ఎంతో శాంతియుతంగా, సజావుగా జరిగాయి.

ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో జరిపిన తరువాత అకస్మాత్తుగా ట్రస్టు బోర్డును నియమించాలని దేవాదాయ శాఖ చేసిన నిర్ణయం మాకొక వెన్నుపోటు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా రాజకీయ వ్యక్తుల యొక్క ఆలయ ప్రవేశం, యాదగిరి గుట్ట దత్తత నిర్ణయం కంటే ప్రమాదకరమైనది.

ఇక మేము గట్టిగా ఒక నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమైనదని గ్రహించాము. ఆలయ నిర్వహణలో దేవాదాయ శాఖను ఇకపై మేము గుర్తించబోమని అందరికి తెలియజేసాము. ఈ అంశంపై మేము ఏమి చేసామన్నది లోపల పేజీల్లో చదవవచ్చు. ఇది మా ఆఖరి పోరాటంగానే భావించాం.

పరిస్థితి ఇలా మారడానికి కారణం ఏమిటి? మేము చేసిన అపరాధం ఏమిటి? ఏ కారణంచేత చిలుకూరు బలిపశువు కావింపబడింది?

రాష్ట్రంలో 24,888 ఇతర దేవాలయాలతో బాటు చిలుకూరు "స్వయంప్రతిపత్తిగల ఆలయంలాగా" ప్రభుత్వం గుర్తిస్తే సుప్రీం కోర్టు కూడ ధృవీకరించడం జరిగింది. దీని ప్రకారం పై ఆలయాలన్నీ దేవాదాయశాఖ పరిధిలో ఉండీ, అదే సమయంలో తమ స్వతంత్ర పాలనతో (అంటే స్వీయ యాజమాన్యంతో) వ్యవహరిస్తాయని అర్థం. మా కృషి ఫలితంగా

ఆలయం అభివృద్ధి చెందితే, ఆ భగవంతుని ఆశీస్సులతో, భక్తుల సంఖ్య పెరిగితే, దేవాదాయ శాఖ హఠాత్తుగా కళ్ళు తెరిచి, నిజం గ్రహించి మాకు కష్టాలను సృష్టించడం న్యాయమా?

పైన జరిగినదంతా చూస్తే తేలేదేమంటే, శాఖవారి లక్ష్యం ఆలయాల పురోగతి కాదని వాటి తిరోగతి మరియు అధోగతి సాధించడమని. ఇంకొక విషయం కూడా మనం తెలుసుకోవాలి. వాళ్ళు అభివృద్ధి చెందిన ఆలయాలను నాశనం చెయ్యడమే కానీ నాశనం అయిన ఆలయాలకు కొత్త ఊపిరి పోయరు. పైగా అభివృద్ధి చెందిన ఆలయాలను తమకు లాభసాటిగా మారే వ్యాపార కేంద్రాలుగా మార్చుకోవడానికి సిద్ధంగా ఉంటారు.

భక్తులు రాని ఆలయాలను గుర్తించరు సరికదా పట్టించుకోరు, కానీ అదే ఆలయం ప్రజల గుర్తింపుకు నోచుకుంటే హఠాత్తుగా వారి కర్తవ్యం గుర్తుకొచ్చి రంగంలోకి దూకి, అధికారం చెలాయిస్తారు.

ఎందుకీ ద్వంద్వ ప్రవృత్తి? ఎవరిని మోసగించడానికి? భగవంతుడినా లేక భక్తులనా? సర్వాంతర్యామిని మనం మోసగించగలమా? మనకు సాధ్యమా? పోనీ భక్తులను అనుకుంటే.... భక్తులు మునుపటిలాగా లేరు. పరిస్థితిని బాగా అర్థం చేసుకున్నారు. న్యాయాన్యాయ విచక్షణతో దేవాదాయశాఖ యాజమాన్యం యొక్క ఆలోచనలను అర్థం చేసుకుంటున్నారు. అందుకే వారు చిలుకూరులో మా వెనుక నిలబడి ఈ ఉద్యమంలో మాకు సహకరించారు.

ఆఖరిగా నా విన్నపం ఏమంటే, ఆలయాలు అభివృద్ధి పొందాలంటే వాటికి పూర్వ వైభవం తిరిగి రావాలంటే, దేవాదాయశాఖ యొక్క ఆలోచనా సరళిలో మార్పు రావాలి. వీరికి సర్వాధికారాలిచ్చిన ఆ వినాశకారి 30/87 ఎండోమెంట్సు చట్టం పోవాలి.

30/87 చట్టం అనే ఒక విషవృక్షాన్ని వేళ్ళనుండి పెరికి వేసే వరకు మా ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఈ పోరాటంలో మేము ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాము, ఉంటాము.

ఇదే మా నిశ్చయం..... నిర్ణయం.

పైన జరిగిన కొన్ని విషయాలు నన్ను దేవాదాయశాఖ యొక్క విరోధిగా చిత్రించవచ్చు, నేను దేవాదాయ శాఖకు విరోధిని ఎంతమాత్రము కాను నేను కేవలం ఆ శాఖ పనిచేసే తీరును మాత్రమే విరోధిస్తున్నాను. దేవాదాయ శాఖ రక్షించే శాఖగా ఉండాలి

కానీ భక్షించే శాఖగా ఉండకూడదని విశ్వసించే అర్చకుడిని.

ఆలయాల్లో రాజకీయజోక్యం ఉండబోదని మాట ఇచ్చిన ప్రభుత్వం తన మాట నిలుపుకోని కారణంగా ఇప్పుడు చిలుకూరు బాలాజీ ఆలయం 1987 చట్టానికి, పక్కలో బల్లెంలా తయారయ్యింది.

స్వామివారు నడిపిస్తున్న ఈ తిరుగుబాటులో అర్చక వంశంలోని మేము, కోట్లాది మంది భక్తులు, భాగస్వాములమైనందుకు ఎంతో గర్విస్తున్నాము.

''नित्यं निश्पराधेषु कैंकर्येषु नियुङक्ष्व माम्''

"నిత్యం నిరపరాధేషు కైంకర్యేషు నియుంక్ష్వమామ్"

స్వామి! మమ్ములను ప్రతినిత్యం నీవే నీకైంకర్యంలో నియమించి అట్టి కైంకర్యాలలో ఎటువంటి తప్పిదాలు మాచే జరగకుండా చూడు!!

మనమందరం ఈ ఉద్యమం మన స్వామికోసం అనే భావనతో కృషిచేసి ఇంకా ఎన్నెన్నో విజయాలను సాధించవలసి ఉంది.

ఇట్లు

తేది 25-02-2005 భవదీయుడు

**ఎం.వి. సౌందరరాజన్**

## తిరుగుబాటులో భాగంగా...


1. స్థలపురాణం ... 1
2. చిలుకూరు, కొన్ని నిజాలు ... 5
3. ఆది నుండి ఇంతే... ... 7
4. ఈ జన్మ స్వామి సేవ కొరకే ... 10
5. పోరాటం సాగింది ఇలా... ... 15
6. అర్చకులపై వేధింపు చర్యలు ... 23
7. చిలుకూరు తిరుగుబాటు ... 28
8. ఇదే ఆఖరి పోరు... ... 35
9. స్వామి లీలల్లో కొన్ని... ... 44

ఒక ప్రసిద్ధ టి.వి. ఛానెల్ కార్యాలయం....

లైబ్రరీ గదిలో ఒక చిన్న బృందం.

కంప్యూటర్ ముందు, మోనిటర్‌ని తదేకంగా చూస్తూ కూర్చున్నాడు ఒక మధ్యవయస్కుడు. పత్రికా ప్రపంచంలోని ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకున్న ధైర్యవంతుడు. తోటివాళ్ళు భీష్ముడని పిలిచే స్థాయికి ఎదిగాడు. అతని పేరు ఉజ్వల్ చటర్జీ, కాని, పత్రికా రంగంలో అతనిని అందరు 'గురు' అనే పిలుస్తుంటారు.

"సార్, మీరు చెప్పినట్లే, చిలుకూరు గురించి అన్ని వివరాలు, పత్రికలలో వచ్చిన వార్తలు, ఇతర వివరాలు సేకరించాం." అంటూ ఒక పెద్ద ఫైలుని చూపించింది పల్లవి. ఒక నెలగా పడిన శ్రమకి 'గురు' ఏమంటారో అన్న ఉత్సుకతతో పల్లవి, మహేందర్ ఇంకా ఇర్ఫాన్. వీళ్ళందరూ చిలుకూరులోని బాలాజీ దేవాలయంపై ఒక కథనాన్ని రూపొందించడానికి ఏర్పడిన ఒక టీమ్. ఆ 'టీమ్' లైబ్రరీ గదిలో కూర్చుని ఉన్నారు. బృందంగా ఏర్పడిన వీరు పత్రికల్లో వెలువడిన వార్తలను క్రోడీకరించి, గ్రామస్థులను, భక్తులను, విశేషంగా దేవాలయంలోని అర్చకులను కూడ కలిసి వారి అభిప్రాయాన్ని సేకరించాలన్న దృఢ సంకల్పంతో ఈ మహత్కార్యాన్ని మొదలెట్టారు.

"సార్, చిలుకూరు దేవాలయం గురించి చెప్పాలంటే..." మొదలెట్టాడు ఇర్ఫాన్.

I

## స్థల పురాణం

మానస సరోవరాన్ని గుర్తుకు తెచ్చే అద్భుతమైన సరస్సు 'ఉస్మాన్‌సాగర్'. ఆకాశమంత విశాలమైన ఆ సరస్సే హైదరాబాదు నగరానికి మంచి నీరు సరఫరా చేస్తుంది. ఆ సరస్సు మధ్యలో ఒక లంకమీద ఉన్న ఒక చిన్న కుగ్రామం చిలుకూరు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణా ప్రాంతంలోని రంగారెడ్డి జిల్లాలో ఈ గ్రామం ఉంది. 'ఉస్మాన్‌సాగర్' జలాలలో సారవంతమూ, సుప్రసిద్ధమైన హైద్రాబాదు ద్రాక్ష తోటలతో మధురమూ అయిన ఆ గ్రామం ఎక్కడ చూసినా వ్రేలాడుతూ కనిపించే ద్రాక్ష గుత్తులతో చూపరులకు కనువిందు చేస్తుంది.

చాలాకాలం క్రితం ఆ గ్రామంలో ఒక గొప్ప వేంకటేశ్వర స్వామి భక్తుడు గుణాల మాధవరెడ్డి ఉండేవాడు. ప్రతి ఏటా పంట చేతికి రాగానే ఆయన తిరుపతి ప్రయాణం కట్టేవాడు. చేలో పండిన ధాన్యం కొంత స్వామికి అర్పించేవాడు. స్వామికి కళ్యాణోత్సవం చేయించేవాడు. స్వామి దర్శనం చేసుకుని తిరిగి వచ్చేవాడు.

ఏడాదికి ఒక్కసారి చేసుకునే ఆ దర్శనమే మళ్ళీ పంటల రోజులు వచ్చే వరకూ ఆయన మనుగడకు సరిపోయేది.

'ఏడుకొండలవాడా!' అంటూ చేలో విత్తనాలు వెదజల్లేవాడు. 'గోవిందా! గోవిందా!' అంటూ చేలకు నీరు పెట్టేవాడు. 'బాలాజీ! బాలాజీ! అంటూ చేలో కలుపు తీసేవాడు. 'వెంకన్న తండ్రీ! వెంకన్న తండ్రీ!' అంటూ చేలు నూర్చేవాడు.

తిరుపతి వేంకటేశ్వరుడంటే ఆయన భక్తి ఎంత ప్రగాఢమైనదంటే ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో స్వామి పేరే వినిపించేది.

కొన్నేళ్లు అలా గడిచాయి. క్రమంగా కొన్నాళ్లకు ఆ భక్తుడు ముసలివాడు అయ్యాడు. అయితే ఏటేటా ఆయన తిరుపతి యాత్ర మాత్రం నిర్విఘ్నంగా కొనసాగుతూనే వచ్చింది.

ఆ ఏడాది కోతల రోజులు వచ్చాయి. ఆ వృద్ధ భక్తుడు కళ్లపోటు పొడుచుకుంటూ చేలో నుంచుని పంట చూసుకున్నాడు. అయినా ఆయన బాగా దిగులుగా ఉన్నాడు. తన శరీరం తెలంగాణా నుంచి తిరుపతిదాకా ప్రయాణానికి తట్టుకునే స్థితిలో లేదు. ఊళ్లో నలుగురూ ఆ వయస్సులో తిరుపతి వెళ్ళి ఏడుకొండలూ కాలినడకన ఎక్కే ప్రయత్నం మానుకోమని ఆయనకు సలహా ఇచ్చారు.

ఆ ఏడు బాలాజీ దర్శనం, కళ్యాణోత్సవం చేయించే అదృష్టం తనకు లేదేమో అని అతడు బెంగపెట్టుకున్నాడు.

రోజురోజుకూ ఆ ముసలివాని ఆవేదన అధికమైంది. ఆహారం నోటికి పోవడం లేదు. ఎవ్వరితోనూ అతడు మాట్లాడడం లేదు.

ఏదో గొప్ప నిధిని పోగొట్టుకున్నవానిలాగా అతడు కనిపించేవాడు. ఉన్నట్టుండి వెక్కివెక్కి ఏడ్చేవాడు. తనలో తనే ఏదో గొణుక్కునేవాడు. తిరుపతి ఉన్న దిక్కువైపు తిరిగి దండాలు పెట్టేవాడు.

"తండ్రీ! బాలాజీ! ఎంత నిర్దయాత్ముడవయ్యా నీవు! ఈ ఏడాది ఎందుకు నాకు నీ దర్శనం లేకుండా చేస్తున్నావు?"

కళ్ళవెంట అశ్రువులు ధారాపాతంగా కారేవి. గ్రామంలో కొందరు అతని బాధ అర్థం చేసుకున్నారు. అతని మీద సానుభూతి చూపించారు. మరి కొందరు వెఱ్ఱివాడని నవ్వారు.

ఆ ముసలి భక్తుడు మంచాన పడ్డాడు. కొన్ని రోజులు వరుసగా అతనికి కంటిమీద కునుకులేదు.

ఆ రాత్రి ఆలోచించి ఆలోచించి అలసిపోయి ఉన్న అతనికి తెల్లవారుజామున నిద్ర పట్టింది. ఒక గంటసేపు అలా నిద్ర పోయాడేమో! అంతలో ఎవరో అతనిని తట్టి లేపుతున్నట్లై మంచంమీద లేచి కూర్చున్నాడు.

"లేలే! తాతా!" మధురమైన, గంభీరమైన ఒక కంఠం అతనిని నిద్ర లేపుతూంది. ఆ వృద్ధుడు కళ్లు తెరచి చూచాడు. ఓహో! ఏమి అద్భుతమైన దృశ్యం! శ్రీదేవీ, భూదేవులతో సాక్షాత్తూ బాలాజీ ప్రభువే ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

అయన ఇలా అన్నాడు. "తాతా! తాతా! నేను వచ్చేశాను. తిరుపతి రావడం కోసం నీవింక ఆయాసపడనక్కరలేదు. నీ కోసం నేనే ఇక్కడకు వచ్చేశాను."

"ప్రభూ! ప్రభూ! నేను నిజంగానే నిన్ను చూస్తున్నానా? లేక ఇదంతా కేవలం స్వప్నమా?" అన్నాడు.

"తాతా! ఇది కలేగాని తెల్లవారుజామున వచ్చిన కలలు నిజం అవుతాయంటారు గదా! ఇప్పుడు నీవు నన్ను చూస్తున్న ఈ రూపంలోనే ఎప్పటికీ ఇకముందు ఈ చిలుకూరు గ్రామంలోనే నేను నీకు దర్శనమిస్తూ ఉంటాను. నీ చేలో ఒక శివలింగం ఉంది చూడు! ఆ లింగానికి దక్షిణంవైపున ఒక పాముపుట్ట భూమి అడుగున నేను ఉన్నాను. ఈ రహస్యం పరమశివుని కొక్కనికే తెలుసు. అయన నిధిని కావలికాసినట్లు నన్ను కాపాడుతున్నాడు. నన్ను అర్చిస్తున్నాడు. ఇంతవరకు నేను భూగర్భంలో నిధిగానే ఉన్నా ఇకముందు నీలాంటి భక్తులందరికి దర్శన మీయదలుచుకున్నాను. నీచేలో నేను చెప్పినచోట త్రవ్విచూడు! భూదేవీ, శ్రీదేవిలతో సహా ఒకే రాతిమీద వెంకటేశ్వరుని రూపంలో నేను నీకు దర్శనమిస్తాను."

స్పృహలోకి వచ్చిన మాధవరెడ్డి చుట్టుపక్కల వెదికి ఒక పొదలో పుట్ట కనిపించగానే తన మనుషులతో వచ్చి గడ్డపారతో తవ్వాడు. గడ్డపారకు రక్తపు మరకలు కనిపించడంతో బిత్తరపోయిన మాధవరెడ్డి పాలతో పుట్టను కరిగించాడు. పుట్ట కరిగిపోయి ఏకశిలలో వెంకటేశ్వరుడు, అలివేలు మంగమ్మ, పద్మావతి విగ్రహం కనిపించింది. అదేచోట మాధవరెడ్డి గుడి నిర్మించి పూజలు ప్రారంభించాడు. స్వామి మూల విరాట్టుకు ఎడమ కన్ను పైభాగం, ఛాతీ దగ్గర గడ్డపారతో గాయమైన

గుర్తులు నేటికీ కనిపిస్తాయి. తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టు జిల్లా మధురాంతకం గ్రామానికి చెందిన వెంకటాచారి కుటుంబం అప్పటి నుంచి ఇప్పటివరకు స్వామివారి సేవలో ఉన్నారు. ఇప్పుడు ఆరోతరం వారు వెంకన్న ఆలయం ఆలనాపాలనా చూస్తున్నారు.

ఈ గర్భగుడి చుట్టూ పదకొండు ప్రదక్షిణాలు చేసినవారి మనసులో ఉన్న కోరిక కొద్దిరోజుల్లోనే నేరవేరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోరిక నెరవేరిన వారు మళ్ళీ 108 ప్రదక్షిణాలు చేయాలి. ఈ స్వామి తమ కోరిక నెరవేరుస్తాడనే విశ్వాసంతో భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వస్తున్నారు. గర్భగుడిలో స్వామి విగ్రహానికి ఎడమవైపు గదిలోని అమ్మవారి విగ్రహం మూడుచేతుల్లో పద్మాలతో, వామహస్తం మోకాలి దగ్గర అన్చి భక్తులను ఆశీర్వదిస్తున్నట్లుగా వుంది.

వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కనే ఒక శివాలయం ఉంది. ఇదికూడా 500 సంవత్సరాల నాటిదే. పూర్వం ఒక బైరాగి ఇక్కడ శివుడి కోసం తపస్సు చేసి ప్రసన్నం చేసుకున్నాడని స్థలపురాణం. భక్తితో శివుడిని పూజించేవారి కోర్కెలు నెరవేరేలా ఆ బైరాగి వరం పొందినట్లు ఐతిహ్యం. శివుడిని భక్తితో కొలిచినవారి కోర్కెలు సిద్ధిస్తాయని ప్రజల అచంచల విశ్వాసం.

"సార్!......" "విష్ణు సహస్రనామంలో స్వామివారు సంభవాయ నమః! అనే పేరును సార్థకం చేసుకొనేట్టు చిలుకూరులో అవతరించాడేమో ...." అందుకుంది పల్లవి

"ఏమది..... కొంచం వివరిస్తావా? !"

అడిగారు అందరూ .

"స్థల పురాణం కన్నా మనం చదవవలసినది ఇది..... " చెప్పసాగింది పల్లవి.

"... కలియుగ నారదలో వెలువడిన ఈ ఆర్టికల్‌ని కూడ మీరు చూడాలి" అంటూ పల్లవి దగ్గర ఉన్న ఫైల్‌ని లాక్కున్నట్లే తీసుకున్నాడు ఇర్ఫాన్.

"ఇర్ఫాన్‌భాయి... యే క్యా హై...." అడిగింది పల్లవి అతని ఉత్సాహానికి ఆశ్చర్యపడుతూ.

"సార్, ఇక్కడ చూడండి..." చదవ సాగాడు ఇర్ఫాన్.

2

# చిలుకూరు, కొన్ని నిజాలు!!

★ ఈ ఆలయంలో హుండీ లేదు...

★ ఆర్జితం టిక్కెట్లు లేవు....

★ ప్రత్యేక దర్శన టిక్కెట్లు లేవు...

★ ఎంతటి వారైనా ఇక్కడ సామాన్యులతో పాటు క్యూలో రావాల్సిందే....

★ ఎన్నికలముందు వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కూడా ఆ ఆలయానికి దర్శనానికి వెళ్లారు. ఆయన కూడా అందరిలా క్యూలైన్లోనే వెళ్లి ఇక్కడి శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.. దేవేందర్‌గౌడ్ హోంమంత్రిగా వున్నప్పటికీ ఆయన కూడా క్యూలోనే దర్శనానికి వెళ్లేవారు. ఇలా ఎంతో మంది రాజకీయ నాయకులు అందరిలా క్యూలోనే వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు.

ఇక్కడ పటిష్టమైన క్యూలైన్లను, ఇనుపగ్రిల్‌లు ఏర్పాటు చేసి లేకపోగా కేవలం దారంతో ఏర్పాటు చేసిన క్యూలే వున్నాయి.

★ అయినా ఎవ్వరూ ఆ దారాల కింద నుంచి దాటుకుంటూ క్యూను అధిగమించాలని చూడరు. ఒకరు వెనుక ఒకరుగా క్రమశిక్షణతో భక్తి శ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకుంటున్నారు.

★ ఈ క్రమశిక్షణకు అక్కడ ఎవ్వరూ ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు కన్పించరు. ఆలయం వున్న గ్రామానికి వెళ్లే బస్సు ఎక్కే మెహదీపట్నం నుంచే ఈ క్రమశిక్షణ గురించి భక్తులే ఒకరికి ఒకరు చెప్పుకుంటారు. అంతేకాదు ఆలయం వద్ద కూడా ఒక భక్తుడిని చూసి మరో భక్తుడు నేర్చుకుంటాడు. అక్కడంతా మానసికంగా భక్తి భావం నిండిపోయి వుంటుంది.

భక్తులకు ఒక హెచ్చరికతో కూడిన సలహా ఇస్తారు. శ్రీవారిని దర్శించేది ఒక క్షణమే. ఆ క్షణం కళ్ళుమూసుకోకుండా, నయనానందకరంగా శ్రీవారిని దర్శించు కోండని సలహా ఇస్తుంటారు.

★ దర్శనం తర్వాత కూడా ప్రసాదాలు విక్రయించరు. కొంచెం కలకండ పెడతారు. అది కూడా భక్తులు సమర్పించినదే.

ఇక్కడ శ్రీవారి ఆలయం ఏర్పడి 500 సంవత్సరాలు అవుతోంది. అయితే 2001 వరకు రాష్ట్రంలోని మిగిలిన అన్ని ఆలయాల్లాగానే ఇక్కడ కూడా హుండీ వుండేది. ప్లేట్ కలెక్షన్ వుండేది. ఆదివారం దర్శనానికి ఇపుడు సుమారు 20 వేల మంది వస్తుండగా, సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం మాత్రం కేవలం 50 మంది లోపు భక్తులు వచ్చే వారు. వారిలో కూడా మార్వాడీలు, గుజరాతీలే ఎక్కువగా వుండేవారు. చూస్తుండగానే రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరిగి పోయింది. ఈ అనూహ్య ప్రజాస్పందనకు, వి.ఐ.పి.లను సైతం క్యూలో రమ్మనేంత ఆత్మస్థైర్యంతో ఆలయ నిర్వాహకులు వుండటానికి, హుండీ తీసివేయటానికి కారణం ఏమిటో తెలుసా? శ్రీవారి లీలలే...

హుండీ లేదు. సేవా టిక్కెట్లు లేవు. ఆదాయ వనరులు లేక పోయినా ప్రస్తుతం ఆలయ నిర్వహణ ఎలా జరుగుతున్నట్టు....సేవ చేయటానికి స్వచ్ఛంద కార్యకర్తలున్నారు. ఆ రోజు దర్శనానికి వచ్చిన వారు తాము శ్రీవారికి సేవ చేసుకుంటామని కోరి, భక్తులకు సహాయపడుతుంటారు.

బెల్లం, కర్పూరం, నూనె, బీన్స్, పాలకూర, గుమ్మడి కాయ, నెయ్యి, పూలు, ఇలా ఒకటేమిటి అన్నీ భక్తులు తెచ్చి ఇస్తున్నారు. ఇలా ఇచ్చే వాటిలో ఏదైనా ఎక్కువ అయి, ఆ రోజు వినియోగించక పోతే చెడిపోతుందనే వాటిని దర్శనానికి వచ్చే భక్తులకే ప్రసాదంలాగా వంచిపెడ్తారు.

## నిత్యసేవలు.........

ఈ ఆలయంలో ఉదయం సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు అన్నీ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో జరుగుతున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం కొనసాగుతూనే వుంటుంది. ఉదయం, సాయంత్రం రెండు వేళల అర్చన జరుగుతుంది. శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30వరకు అభిషేకం జరుగుతుంది.

సుప్రభాతం, అర్చన, ఏకాంతసేవ, అభిషేకం తదితర సేవలతోపాటు సర్వదర్శనం కూడా జరుగుతుంటుంది. ఆ సమయానికి ఎవరికి ప్రాప్తం వుంటే వారు శ్రీవారి సేవలను చూస్తారు. నైవేద్యం, అలంకరణ తదితర సమయాల్లో కొద్ది సమయం మాత్రమే తెర వేస్తారు. అప్పుడు క్యూ కాసేపు నిలుస్తుంది. తిరిగి యథావిధిగా దర్శనం కొనసాగుతుంది.

విఐపిలకు ప్రత్యేకమైన ఏర్పాటు ఎందుకు జరగాలి, విఐపిలు కూడా ఇక్కడ అందరితో పాటు క్యూలో రావాల్సిందే, భక్తికే విలువ వున్న చోట అహంకారానికి

తావెక్కడ? దీంతో తమను తాము వివిపిలుగా అనుకుంటున్న వారుసైతం దేవుడి ముందు అందరూ సమాన మనే దారికి మరలి రాకతప్పలేదు. అందరూ క్యూలోనే రావటం ప్రారంభమైంది.

వలుకుబడి కాదు. భక్తే ముఖ్యమనే విషయం చిలుకూరు ఆలయానికి వచ్చే ప్రతివారు ముందుగానే మానసికంగా సిద్ధపడిపోతున్నారు. భక్తి, క్రమశిక్షణ ఆలయానికి మరింత వన్నె తెస్తోంది.....

*"ఆశ్చర్యంగా ఉంది, ఇర్ఫాన్....." ఎంత ఓపికగా ఈ మొత్తాన్ని చదివావు" అన్నారు 'గురు'.*

*"సార్, అసలు ఒక చిన్న దేవాలయం ప్రభుత్వం చేసిన దారుణమైన చట్టాన్ని ఎదిరించి ఎలా పోరాడగలిగిందో, అని మీరే ఇంతకు ముందు ఆశ్చర్య పడేవారు కదా?' అడిగింది వల్లవి.*

*"అవును వల్లవి, పత్రికలలో వెలువడే కథనాలను బట్టి చూస్తే ఇది అద్భుతమే!" ఆశ్చర్యంతో అన్నారు 'గురు'.*

## 3

## ఆది నుండీ ఇంతే...

*"గురు, ముందునుంచే ఆగమ రీతిలో స్వామి సేవయే పరమార్థంగా భావించే వంశం ఇక్కడి అర్చక వంశం." తాను కూడా ఈ విశ్లేషణలో భాగస్వామిని అన్నట్లుగా తనవంతు అభిప్రాయాన్ని ఇచ్చాడు మహేందర్.*

*"ఎలా చెబుతున్నావు?!" అడిగారు 'గురు'.*

*"గురు, మీకు 1976లో జరిగిన ఈ సంఘటన వింటే అర్థమవుతుంది...."*

"రామానుజాచార్య దివ్యాజ్ఞా వర్ధతాం అభివర్ధతాం..." అనే మంత్రోచ్చారణతో, రంగారెడ్డి జిల్లాలోగల చిల్కూరు గ్రామంలోని బాలాజీ దేవాలయంలో, సాయంకాల శాత్తుమురై పూజాకార్యక్రమం యధావిధిగా ఆరంభమైయింది.

రాత్రి 7.50 గం॥లకు ఆలయ అర్చకుడు భగవంతుని పవళింపు సేవకు (పర్యంకాసనకు) ఏర్పాటు చేయసాగాడు. అర్చకుడు ఒక పాత్రలో పంచదార కలిపిన పాలను భగవంతునిక నైవేద్యం చేసి, ఆ మధురమైన పాలను భక్తులందరికి ఒక

ఉద్ధరిణితో ఇవ్వసాగాడు. భక్తులంతా ఆ కొద్ది పాలను స్వీకరించి సంతృప్తిచెందారు.

"ప్రసాదం పరిమాణం మనకు ముఖ్యం కాదు. ఎంతో కొద్దిగా ఇచ్చినా కూడా దానికి అంతే పవిత్రత, విశిష్టత ఉంటుంది కదండీ!" అంటూ హైదరాబాదు నుండి వచ్చిన భక్తుడు తోటివారితో తన అభిప్రాయాన్ని చిన్న గొంతుతో తెలిపాడు. ప్రసాద వినియోగానంతరం ఆలయ అర్చకుడు గుడిలోని ఒక్కొక్క తలుపును మూసి గడియవేయసాగాడు, అప్పుడే ఒక పోలీసు జవాను గుడిలోపలికి పరిగెత్తుతూ వచ్చాడు. "స్వామి! గుడి తలుపులు మూయకండి. కార్మికశాఖామంత్రి శ్రీ అంజయ్యగారు గుడికి వస్తున్నట్టు మాకు ఇప్పుడే వార్త అందింది, ఆయన ఏ క్షణంలోనైనా ఇక్కడికి రావచ్చు." అని ఒగరుస్తు చెప్పాడు జవాను. అర్చకుడు సమాధానం ఇచ్చేలోగానే, మంత్రిగారి కారు ఆలయం ముందు ఆగడం, ఆయన తన అనుచరులతో ఆలయ ప్రవేశం చేయడం జరిగిపోయింది.

మూసి ఉన్న ఆలయ ద్వారాలను చూసిన అనుచరగణం చెప్పలేనంతగా చిరాకు పడ్డారు. వారిలో ఒకడు వెంటనే "పంతులు! ఇదేంటి? మా ఎదుటే ఎందుకు తలుపులు మూసారు? తలుపులు తెరిచి మంత్రిగారి కొరకు పూజలు చెయ్యండి" అని పెద్దగా అరవడం మొదలు పెట్టాడు. "అయ్యా! మేమింతవరకే పూజావిధులు నిర్వర్తించి భగవంతునికి పవళింపు సేవను ముగించినాము. ఇటుపైన, ఈ రాత్రి భగవంతుడు నిద్రిస్తాడు. కాబట్టి రేపటి ఉదయం వరకు తలుపులు తెరవకూడదని మా ఆగమాల శాసనం" అని అర్చకుడు వివరించాడు. "అంటే ఆలయం తలుపులు ఈ రాత్రికి ఇక తెరవబడవనా మీ అర్థం". అని అనుచరుడు తిరిగి వాదించసాగాడు. "అవును!, రాత్రి చాలా పొద్దుపోయింది. స్వామివారు ఈ పాటికి నిద్రిస్తూంటారు. ఆయనకు మనం నిద్రాభంగం కలిగించవచ్చా, మీరే చెప్పండి"? అని అర్చకుడు సర్దిచెప్పబోయాడు. "పంతులు! ఇటువంటి వివరణలు, సమాధానాలు మాకు అనవసరం. మొదలు మీరు..." అంటూ, ఆ అనుచరుడు గద్దిస్తూండగా, అంజయ్య గారు అతనిని ఆగమన్నట్టుగా సైగ చేసారు. ఆ అనుచరుడు వెంటనే తగ్గిపోయాడు.

"స్వామి! ఈ రోజు దేవుని దర్శనం నా అదృష్టములో లేనట్టుంది. ఈ రోజు కాకపోతే ఇంకొకరోజైనా వచ్చి తప్పక దర్శించుకుంటాను" అంటూ, మంత్రిగారు ఎంతో భక్తిపూర్వకంగా, మూసిన తలుపుల ముందే సాష్టాంగ ప్రణామంచేసి బయటకు వెళ్ళారు. గుడి అర్చకుడు మరియు పార్టీ కార్యకర్తలు మారు మాట్లాడకుండా ఆయనను అనుసరించారు. మరలిపోతూ ఆ మంత్రిగారు పొద్దున గుడి తలుపులు ఎన్నింటికి తెరుస్తారని అడిగారు, దానికి పూజారి 6 గం॥లకు అని సమాధానమిచ్చారు. అంజయ్యగారు ఆ రాత్రి నగరానికి తిరిగి వెళ్ళకుండా, అక్కడికి దగ్గరలోనే గండిపేటలో

ఉన్న ఒక విశ్రాంతి గృహంలో బసచేసి, మర్నాడు తెల తెలవారుతుండగానే, బాలాజీని దర్శించుకోవడానికి తిరిగి వచ్చారు.

"పూజారిగారు! వెంకటేశ్వరస్వామి నాకు ఇవ్వాళ దర్శనం ఇస్తాడా?" అంటు అర్థవంతంగా నవ్వారు. "తప్పకుండా ఇస్తారు. రాత్రి నుండి జరిగినది చూస్తూంటే నాకు విజయచొక్కలింగ నాయక రాజు జ్ఞాపకం వస్తున్నాడు. ఈ రాజు శ్రీరంగంలోని శ్రీ రంగనాథునికి జరిగే కర్పూరపడి సేవను దర్శించడానికి కొంత ఆలస్యంగా వచ్చాడట. అందువలన భగవంతుని సేవాభాగ్యం లభించలేదు. ఏటా ఒకసారి మాత్రమే జరిగే ఈ సేవను దర్శించడానికి ఆయన తన రాజ్యానికి తిరిగి వెళ్ళకుండా, మరుసటి సంవత్సరం వరకు ఆలయ పరిసరాల్లోనే బస చేశాడట" అని పూజారి చెప్పగా అంజయ్యగారు అర్థమైనట్టుగా చిన్నగా నవ్వారు. "అయ్యా! లోపలికి దయచేయండి, మీ క్షేమం కొరకు భగవంతునికి అర్చన చేస్తాను" అంటు మంత్రిగారిని లోనికి ఆహ్వానించాడు అర్చకుడు. "దయచేసి ఆ పూజలు నా కొరకే కాకుండా ప్రజల క్షేమ సౌఖ్యాల కొరకు కూడా చెయ్యండి" అని అంజయ్య అర్చకుని మాటలను సవరించారు.

ఆలయ మర్యాదలను, విధులను గౌరవించి నడుచుకునే ఇలాంటి మంత్రులు, రాజకీయనాయకులు ఎంతో అరుదుగా మనకు కనపడతారు. అంజయ్యగారు ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. జీవితంలో అత్యుత్తమ స్థానం పొందాక కూడా ఆయన ఆలయ సంప్రదాయాలను విధులను గౌరవించడం విడిచిపెట్టలేదు.

*"గురు, విన్నారు కదా?! సామాన్యుడిని, మంత్రిగారినీ, ఒకే విధంగా గౌరవించడం జరిగేది కాబట్టి చిలుకూరులో స్వామి సంతోషంగా భక్తులను అనుగ్రహిస్తున్నాడు." అన్నాడు ఇర్ఫాన్*

***"ఇర్ఫాన్, నీవు విన్నది చిలుకూరు దేవాలయంలో అర్చక వంశంలో పుట్టిన వెంకట రాఘవాచార్యుల (1900–1990) గురించి. ఆగమ పండితులుగా వీరు దేవాదాయ శాఖకు సలహాదారుగా ఎన్నో సంవత్సరాలు వ్యవహరించారు. అర్చక సేవలో ఉన్న ఒక వ్యక్తి గురించి మీరు విన్నారు. వారితో కలిసి ఈ దేవాలయంలో స్వామివారికి సేవనందిస్తున్న భార్య, పిల్లల అంకిత భావం గురించి ఇదిగో..." చెప్పసాగాడు మహేందర్.***

4

# ఈ జన్మ స్వామి సేవ కొరకే...

"ఇదేంటి ఈ రోజు ఆలయం మూసివేశారు ఆశ్చర్యంగా ఉందే?" అంటూ, అడిగాడు ఆ భక్తుడు. జగన్ అనే పేరుగల ఈ భక్తుడు రంగారెడ్డి జిల్లాలోని చిలుకూరు బాలాజి దేవాలయానికి ఒకానొక నాడు ప్రాతఃకాలాన దైవదర్శనార్థియై వచ్చాడు. హిందీ మాతృభాషగా కల ఈ భక్తుడు ఈ పురాతన ఆలయానికి తరచుగా వస్తుంటాడు. దర్శనార్థియై వచ్చాడు కావున భగవంతుని అలంకారానికై పూలమాలలతో, కొబ్బరికాయలతో ధూపం మొదలగు సకల సామాగ్రితో సంసిద్ధుడై వచ్చాడు.

ఆలయ ముఖద్వారం దగ్గర చిన్న గుంపు కూడుకుని ఉంది. అందరి ముఖాల్లో ఒకే ప్రశ్న. "సమయం 9 గంటలు దాటింది. రోజు 6 గంIIలకే తెరుచుకునే గుడి తలుపులు ఈ రోజు ఇంకా తెరుచుకోలేదేమిటి?" అంటు ఒక భక్తుడు తనతోటి అతనిని అడిగాడు.

"పూజారిగారి భార్య చనిపోయారు సార్, అందుకే గుడి మూసి ఉంది". అని ఆ గ్రామానికి చెందిన మనిషి గుడికి వచ్చిన భక్తులకు సందేహనివృత్తి చేసాడు. అతడు ఆనాడు ఈ పనికే నియమించబడ్డాడు.

ఈ మాటలు విన్న జగన్ ఉలిక్కిపడ్డాడు. "ఏమిటి? ఆ ముసలావిడా? మరణించిందా?" అంటూ ఆ మనిషి దగ్గరకు వెళ్ళి ప్రశ్నించాడు. "అవునండి, ఆవిడగారే, తన జీవితసర్వస్వాన్ని ఈ ఆలయంలోని దేవుని సేవకే సమర్పించిన పెద్ద ఇల్లాలు. ఆ మహాతల్లి ఈనాడు తెల్లవారుజామున ఆ స్వామి దగ్గరకు శాశ్వతంగా వెళ్ళిపోయింది." అని అందరి ప్రశ్నలకు ఒకే ఒక సమాధానం ఇచ్చాడు.

"అయ్యో! అలాగా! ఎలా జరిగింది?" అంటూ ఎంతో ఉత్సుకతతో అడుగగా, "ఆమె ప్రతి రోజులాగానే ఈనాడు కూడా 4.30 గంIIలు లేచిందట. లేవంగానే గుండెల్లో కొంచం నొప్పిగా ఉంది అనిందిట. క్రమంగా నెప్పి అధికం కాగా ఆమె అలాగే మంచంలోనే పడుకుంది. ఆమె కూతురు తల్లి అవస్థను గమనించి ఆమె ఛాతిని తన చేతులతో రుద్దసాగింది. ఆ దేవునికి సేవలు చేయడానికే కాని తనకు సేవలు చేయించుకోవడం అలవాటు లేని ఆమె పరిచర్యలు, సేవలు వగైరాలు అవసరం లేకుండానే తన కన్నకూతురు ఒడిలో తుదిశ్వాసను విడిచింది." అంటూ ఆ ఊరి మనిషి చెప్పడం ముగించాడు. "ఆహా! ఎంతటి అనాయాస మరణం. ఎంతటి పుణ్యం చేసుకుంటే గదా ఇలాంటి మరణం లభిస్తుంది." అని అందరు భక్తులు తమలో తామే గుసగుసగా

మాట్లాడుకోసాగారు.

"ఇంతకీ మృతదేహం ఎక్కడుంది?" అడిగాడు జగన్, "అర్చకుల వారి ఇంట్లో సామి, గుడి వెనకాల ఉన్నది వాళ్ళ ఇల్లు." అంటూ టక్కున సమాధానం ఇచ్చాడు ఆ గ్రామవాసి. అప్పటికే ఇంటి అవరణమంతా మనుషులతో నిండిపోయింది. వచ్చిన వారిలో చాలా మంది ఆ గ్రామప్రజలు మరియు అర్చకుని బంధువులు ఉన్నారు. భార్య మృత దేహం ప్రక్కన దీనవదనంతో అర్చకుడు కూర్చుని ఉన్నాడు. ఎనభై ఏళ్ళకు పైబడ్డ ఈ అర్చకుడు ఈ వియోగం ఎలా భరించగలడు? అనుకుంటూ, ఒకప్పుడు దైవీక వర్చస్సుతో భాసిల్లిన తన భార్య ముఖారవిందాన్ని, తన కళ్ళనిండుగా నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని అప్పటికే కళ్ళు నీళ్ళతో నిండి మరిదేనికి తావివ్వము అన్నట్టుగా తొణికిసలాడాయి. మృత్యువు కౌగిట్లోకి చిరునవ్వుతో చేరుకుంది అన్నట్టుగా ఆ పండుముత్తైదువ ముఖంలో సంతృప్తితో కూడిన చిరునవ్వును చూసిన వారంతా ఈమె తప్పక ఆ భగవంతుని సన్నిధానానికే చేరుకుంటుందని తలపోయసాగారు.

"తన 13వ ఏట ఇక్కడికి వచ్చింది. అప్పటినుండి ఈ ఊరు వదిలింది లేదు. మా కుటుంబంలో జరిగే శుభకార్యాలకి కాని తనకు కలిగిన చిన్న అస్వస్థతకోసం కాని ఆమె ఈ గ్రామం విడిచి రావడానికి నిరాకరించేది'' అంటూ, తన సోదరిగురించి చెప్పసాగాడు. అర్చకుని యొక్క బావమరిది.

"మా అమ్మ ఎల్లప్పుడు ఈ తొమ్మిది గజాల చీర (మడిసార్) లోనే మాకు కనిపించేది. భగవంతునికి పరిచర్యలు చేసే సమయంలో ఈ లాంటి చీరకట్టు పవిత్రతను ఆపాదిస్తుందని ఆవిడ విశ్వాసం. అసలు ఈనాడు ప్రొద్దున కూడా 4.30కు లేచి కాలకృత్యాలు తీర్చుకుని వెలుపలికి వచ్చింది. గుండెల్లో నెప్పికి విలవిల్లాడుతూనే కట్టు విడిపోయిన తన చీరను తిరిగి సరిచేసుకుని, ఆ తరువాతే తన ఛాతిలోని నెప్పిని గురించి మా అందరికి చెప్పింది." అంటూ మరణ సమయంలో తన తల్లి దగ్గర ఉన్న పూజారి కూతురు, తల్లిని ప్రేమగా నిమురుతూ, విలపిస్తూ చెప్పింది.

జగన్ చెవిలో అందరి మాటలు వినబడుతున్నాయి. కాని అతడు నిశ్చేష్టుడై, నిశ్శబ్దంగా మృతదేహాన్నే చూడసాగాడు. ఈ ఇల్లాలు గురించి తన తలిదండ్రులు చెప్పిన మాటలు ఒక్కసారిగా జ్ఞప్తికి వచ్చాయి. వందల మంది భక్తులకు సరిపోయే రీతిగా ప్రసాదాలను తయారు చేయగల సామర్థ్యం కలదట ఈమెకి. భగవంతుని పూజలకు ప్రసాదాలకు వీరు ఇంట్లోని నీరు కాక 2 ఫర్లాంగుల అవల గల చెరువుకి వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవాలి. నడు వేసవికాలంలో, ఎర్రటి ఎండను కూడా లెఖ్ఖచేయకుండా ఈ మహిళ భక్తుల దాహం తీర్చడానికి ముళ్ళు, రాళ్ళు వున్న రహదారిలో చెరువుకు వెళ్ళి నీళ్ళు తెచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బాట వెంబటి నడిచే సమయంలో పాదరక్షలు

ధరించి వెళ్ళే అలవాటు ఆమెకు లేదు. కాని తనకు జరిగే అసౌకర్యానికి కించిత్తు కూడా బాధపడక ఇది కూడా తను భగవంతుడికి చేసే సేవలో ఒక భాగమే అని తలచేది కాబోలు అందుకే ఆమె ముఖంలో ఎల్లప్పుడు చెక్కు చెదరని చిరునవ్వు, అతిథుల పట్ల ఆదరణ పుష్కలంగా మనకు కనిపించేవి.

ఇలాంటి ఒక సందర్భంలోనే ఒక మహిళా సబ్-కలెక్టర్‌గారు ఆలయానికి దర్శనార్థియై రావడం జరిగింది. పూజారి భార్య మంచినీళ్ళకై ఎర్రటి ఎండలో కాలినడకన వెళ్ళడం ఈ కలెక్టర్‌గారు చూసి అత్యంత ఆశ్చర్య చకితురాలైయ్యారు. ఆ కలెక్టర్‌గారు పూజారి భార్య కష్టం చూసి, మంచినీటి ఆవశ్యకతను గుర్తించి బోర్ వేసుకుంటే సమస్యకు పరిష్కారం అవుతుంది కదా అని సలహా ఇచ్చింది. బోర్‌నీళ్ళు భగవంతుని నైవేద్యానికి పనికిరావంటూ పూజారిగారు వివరించారు. కానీ ఆ వూరి ప్రజల క్షేమానికి, అవసరానికి గాను ఆ మహిళాకలెక్టర్ ఒక బోర్‌వెల్ కట్టడానికి ఉత్తర్వులు చేసి వెళ్ళిపోయింది.

ఇలా ఇప్పటికీ గ్రామం యొక్క మంచినీటి సమస్యను తీరుస్తున్న బోర్‌వెల్ కూడా పూజారిగారి భార్య యొక్క కృషి ఫలితం అని ఆ గ్రామ ప్రజల యొక్క ప్రగాఢ విశ్వాసం.

"నిన్న ఈవిడ చేసిన చక్కెర పొంగలి ఎంత రుచికరంగా వుందనుకున్నావు" అంటూ దైవదర్శనానికి ముందురోజు వచ్చి రాత్రి బసచేసిన ఒక భక్తుడు తన తోటి వారితో చెప్పసాగాడు.

అంతా వింటున్న జగన్ తన భావావేశాన్ని అణచుకోలేక, "తన సేవల నిమిత్తం భగవంతుడు ఈవిడకు జన్మను ప్రసాదించాడు కాబోలు. అంతటి పుణ్యవతి. లేకుంటే ఒక సాదారణ జీవిలో ఇంతటి అంకితభావం వుండటం కల్ల." అని భార్యతో చెప్పగా, ఆమె కూడా తన అంగీకారం తెలుపుతూ తలాడించింది. "భగవంతునికై తెచ్చిన, ఆ పూలదండలను తీసుకురా! ఈ పుణ్యజీవిపై ఉంచి ఈవిడకి కడసారి వీడ్కోలు చెబుదాం" అని అనగా, ఆవిడ తక్షణం వెళ్ళి ఆ దండలు తెచ్చి, ముకుళిత హస్తాలతో అర్చకుని భార్య మృతదేహంపై ఉంచింది. వచ్చిన పని పూర్తి చేసుకుని తిరుగు ముఖం పట్టసాగారు జగన్ దంపతులు. జగన్ తన వాహనం వైపు నడుస్తూ వుండగా ఎవరో ప్రశంసాపూర్వకంగా తన భుజం తట్టినట్టు అనిపించి, గిరుక్కున వెనుతిరిగి చూసాడు జగన్, కాని అక్కడ ఎవరూ కనబడక పోవడం అతనిని ఆశ్చర్యపరచింది. ఇది ఆ భగవంతుడు తను చేసిన పనిని అభినందిస్తూ తనకు కలిగించిన భావన అని గ్రహించడానికి అతనికి అట్టే సమయం పట్టలేదు.

తన 80 వసంతాల కాలాన్ని ఆ గుడి సేవలకే అంకితం చేసిన ఈ మహిళ పేరు కళ్యాణి. అర్చకులు శ్రీనివాస రాఘవాచారిగారి భార్య. శ్రీనివాస రాఘవాచార్యులు ఇంకా తమవంతు సేవను స్వామికి చేస్తూనే ఉన్నారు. సమీపంలో శ్రీనివాసరాఘవాచార్యుల 92వ జన్మదినాన్ని ఒక ఉత్సవ రీతిలో చిలుకూరు గ్రామ ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. కళ్యాణి శ్రీనివాసరాఘవాచార్యుల పుత్రుడైన గోపాలకృష్ణ ప్రస్తుతం అర్చకులుగా స్వామికి కైంకర్యం చేస్తున్నారు. కళ్యాణమ్మ అస్తమయం, ఆ గ్రామాన్ని మొత్తం అలవికాని విచారంలో ముంచివేసింది. కళ్యాణమ్మ అస్తమన సమయంలో గోపాలకృష్ణగారు బ్రూక్ బాండ్ కంపెనీలో ఒక ఉన్నతమైన పదవిలో ఉన్నారు. తల్లి చనిపోయిన కొద్ది నెలలోనే తమ ఉద్యోగమునుండి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. స్వామి సేవలో ప్రస్తుతం ఉన్నారు.

మన ఆంధ్ర రాష్ట్రంలో ఏ దేవాలయంలో వెళ్ళి చూసిన కూడా ఆయా ఆలయాల్లోని అర్చక కుటుంబాలు మొత్తం, స్వామి సేవలో భాగం పంచుకోవడం మనం చూడవచ్చు. ఇవన్నీ కూడా ధనాపేక్ష లేని సేవలు. దీనికి కారణం ఆ అర్చక కుటుంబ సభ్యులంతా ఆ భగవంతుని తమలో ఒకనిగా భావించి, గుడిని తమ గృహంగా తలచి, భక్తులను తమ ఇంటికి వచ్చే అతిథులుగా భావించడమే అని మనం గ్రహించాలి.

కరీంనగర్‌లోని ఒకానొక దేవాలయంలోని అర్చకుని భార్య, ఆలయానికి వచ్చే బిచ్చగాళ్ళను, అవాంఛనీయులను తరమడమే కాకుండా, లోపలకు వచ్చే పందులను వెళ్ళకొట్టడమనే ప్రత్యేక బాధ్యతను కూడా వహించవలసి వచ్చింది. ఈ ఆలయానికి రాబడిగాని, ఆస్తులు కాని లేవా అని మనకు అనుమానం కలగవచ్చు. ఈ ఆలయానికి అనేక ఆస్తులు ఉన్నాయి. కాని ఈ ఆలయ నిర్వాహణ అంతా దేవాదాయశాఖదే, ఆ యాజమాన్యం వారికి గుడి రక్షణకై ఒక వాచ్‌మెన్‌ను నియమించడం అనే ఆలోచన వైపుకు దృష్టి పోకపోవడం నిజంగా దురదృష్టకరం. ఈ పనిని ఆ ఆలయ పూజారి భార్య జీతభత్యాలు ఆశించకుండా ఎన్నో సంవత్సరాలుగా చేసుకుంటూవస్తోంది. పూజారి కొడుకు తన తండ్రినుండి అర్చకత్వాన్ని వారసత్వంగా తీసుకుంటే, అతనితోబాటు అతని భార్య పిల్లలు, తమ్ముళ్ళు, అందరు స్వామిని ఎంతో అంకితభావంతో సేవించడం అనే బాధ్యతను నిర్వహించేవారు. 1987 దేవాదాయ చట్టం ఇలాంటి అర్చక కుటుంబాల జీవితాలతో ఎంతో క్రూరంగా ఆడుకుంది. పైన వివరించిన రీతిలో అంకితభావంతో వున్న అర్చక కుటుంబాలే కాకుండా, తమ అర్చకత్వాన్ని దురుపయోగం చేసే అర్చకులు కూడా ఉండకపోరు. ఇటువంటి వారి సంఖ్య చాలా తక్కువ. కానీ ఇలాంటి అర్చకులను మాత్రమే దృష్టిలో ఉంచుకుని చల్లా కొండయ్య కమిషన్ ఎన్నో అర్చకకుటుంబాలకు అశనిపాతంలా ఒక సమిష్టి న్యాయంలాంటి నివేదికను ఇచ్చింది.

# చిలుకూరు బాలాజీ అర్చక వంశం

## స్వామివారి సేవలో

తరతరాలుగా

వెంకటాచారి

↓

వెంకటరాఘవాచారి
భార్య : లక్ష్మి

↓

శఠగోపాచారి
భార్యలు : రంగనాయకి, కళ్యాణి

↓

వెంకటరాఘవాచారి
భార్య : కోమళమ్మ

↓

సౌందరరాజన్
భార్య : వసుమతి

- ★ లక్ష్మీనరసింహన్
  (భార్య : ఉష)
- ★ రంగరాజన్
  (భార్య : సుధ)
- ★ మురళీధరన్
  (భార్య : మాలిని)

శ్రీనివాస రాఘవాచారి
భార్య : కళ్యాణమ్మ

↓

గోపాలకృష్ణ
భార్య : రమ

- ★ సుదర్శన్
  (భార్య : వాసవి)
- ★ గోవిందరాజన్

ఒక దేవాలయానికి అర్చకుడు ఎంత అవసరమో, అతనికి సహాయం చేసే ఒక వంటమనిషి, పరిచారకుడు కూడా అవసరం. ఇటువంటి వారందరిని రెలిజియస్ సిబ్బందిగా డిపార్ట్‌మెంటు పరిగణిస్తుంది. దేవాదాయశాఖ వారి 1987 చట్టం అమలులోకి వచ్చి ఆలయంలోని రెలిజియస్ సిబ్బంది సంఖ్యని గణనీయంగా తగ్గించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీని పరిణామంగా భగవంతునికి సరైన నైవేద్యాలు అందబడటం లేదు. ఇలా సిబ్బంది సంఖ్యను తగ్గించడంతో పూజలు మరియు ఉత్సవాలు జరగడం కూడా తగ్గిపోతున్నాయి. ఒక వేళ అర్చక కుటుంబ సభ్యులు ప్రసాదాల తయారీకి పూనుకున్నప్పటికి కూడా, వాటి తయారీకి అతి తక్కువ ధనాన్ని మంజూరు చేయడం జరుగుతున్నది. ఈ రకంగా అర్చకుని కాళ్ళు చేతులు కట్టివేయబడ్డాయి. దీని కారణంగా ఆలయంలో దైవం ఎన్నో సందర్భాలలో పస్తులు ఉండవలసి వస్తోంది. ఇలా రెలిజియస్ సిబ్బందిని తగ్గించిన దేవాదాయశాఖ వారు ఆలయంలో పనిచేసే సెక్యులర్ సిబ్బందిని తగ్గించే విషయం మాత్రం అసలు పట్టించుకోలేదు. 1997లో సుప్రీం కోర్టు ఆదేశం ఇచ్చినా, ఆలయంలో గుమాస్తాలు, టైపిస్టులు మరియు ఆఫీసు సిబ్బంది యొక్క సంఖ్యలో ఎటువంటి తగ్గింపు చేయలేదు. దేవాలయం సజావుగా నడవడానికి ఇటువంటి వారి అవసరం అతి తక్కువ అని దేవాదాయ శాఖవారు గుర్తించటంలేదు.

ఇటువంటి ఆలోచనారహితమైన చట్టాలను నిలిపివేయవలసిన సమయం ఆసన్నమైందని, మనం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

('వాక్' జులై 2001)

**"ఇదేంటి, కథనం తరువాత ఒక చట్టం గురించి, దాని ప్రభావం గురించే ఎక్కువ వివరిస్తున్నది ఈ 'వాక్' పత్రిక?" అడిగారు 'గురు'.**

**5**

# పోరాటం సాగిందిలా!

**"సార్" అసలు చిలుకూరు దేవాలయంలోని అర్చకుడైన సౌందరరాజన్ ఆదినుంచే ప్రభుత్వం 1987లో రూపొందించిన దారుణమైన చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు...." చెపుతున్న పల్లవిని 'గురు' అడ్డగించి "ఇక చెప్పొద్దు, నాకు తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాలను ఈ చట్టం నుంచి కాపాడడానికే మొదలెట్టారు. ఇంకా, 'చట్టం కోరల్లో దేవాలయాలు' అనే పుస్తకం కూడ వ్రాసారు. అవునా?" అన్నారు 'గురు'**

* * *

"అది అక్టోబరు 12/2001. హైదరాబాద్‌లో అర్చకులంతా ఒక ప్రభంజనంలా దేవాదాయ శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలలనుంచి వచ్చిన వీరు 30/87 చట్టంతో దేవాలయాలు వాటి ఆస్తులు మాయమైనాయని, అర్చకుల స్థితి దయనీయంగా మారిందని భీమసేనాచార్యులలాంటి అర్చకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నినాదాలు చేస్తున్నారు.

చిలుకూరు దేవాలయం అర్చకులు సౌందరరాజన్‌గారు కూడ అక్కడే ఉన్నారు. కాని చిలుకూరులో మాత్రం దేవాదాయ శాఖ కుయుక్తులు చేస్తున్నది.

యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉన్నతాధికారి చిలుకూరు దేవాలయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి వచ్చి ఉన్నారు.

"సౌందరరాజన్‌గారు ఇవాళ్ళ లేరండి. సిటీకి వెళ్ళారు. మీరెవరండి...?" అడిగింది పద్మజ. దేవాలయానికి భక్తులు ఎందరో స్వచ్ఛందంగా సేవ చేస్తూ ఉంటారు. అలాంటి వాళ్ళలో ఒకరే ఈ వాసుదేవరెడ్డి మరియు పద్మజ దంపతులు.

"ఆయన ఉండరని తెలిసే మేము వచ్చాం." అన్నాడా అధికారి నిర్లక్ష్యంగా.

"ఈ గోడలన్ని పాతగా లేవు?! వీటన్నిటినీ తొలగించి కొత్తగా కట్టాలి. సౌందరరాజన్ అజమాయిషీలో ఉంటే ఏ డెవలప్‌మెంట్ జరుగదు." అంటున్నాడా అధికారి తోటి వాళ్ళతో.

ఇదంతా పద్మ ఆశ్చర్యంగా వింటుంది. ఆవిడకి తెలియని నిజం ఒక్కటే. సౌందరరాజన్ లేనప్పుడే ఈ ఇన్స్పెక్షన్ చేయాలని ఈ బృందం ఎందుకు వచ్చిందని.

ఆరోజే హైదరాబాద్‌లో ఉన్న సౌందరరాజన్ గారికి ఈ విషయం తెలియజేయడం జరిగింది. దేవాదాయశాఖ అధికారులు నెమ్మదిగా పన్నుతున్న పన్నాగం అర్థం కావడానికి చాలా సేపు పట్టలేదు ఆయనకి.

ఇక తమ జాగ్రత్తలో తాముండాలని అర్చక సమాఖ్య సభ్యులందరికీ కూడ చెప్పేసారు.

ఇది జరిగిన కొన్ని రోజులకే యాదగిరిగుట్ట దేవాలయానికి దత్తత ఇచ్చే నిర్ణయం తీసుకోవడం జరిగింది.

* * *

"సార్, నిజంగా ఈ పోరాటం, దేవాలయాల పరిరక్షణ ఉద్యమం అంతా చిలుకూరు స్వామిలీలలే అని చెప్పాలి," చెప్పసాగింది పల్లవి.

"అనువంశిక అర్చకులు దేవాలయంపైన అంకిత భావంతో ఉంటారా?! అన్న ప్రశ్నకు సమాధానమే చిలుకూరు." అర్చకులుగా అంకితభావంతో సేవచేస్తున్నది చిలుకూరు అర్చక వంశం అని చెప్పాలి.

"నేను మొయినాబాద్‌లోనే చదువుకున్నాను సార్! అందుకే ఈ కుటుంబంగురించి చాలా బాగా తెలుసు--- యాదగిరిగుట్ట దేవస్థానం వారు దత్తత తీసుకోవడానికి వచ్చిన రోజు ఈ కుటుంబాలలో నలుగురే ఊరిలో ఉన్నారు. ఒకరు శ్రీనివాసరాఘవాచారి, ఆయన కుమార్తె సీత ఇంక సౌందరరాజన్ ఆయన భార్య వసుమతి. ఆసమయంలో సీత అడిగిన కొన్ని ప్రశ్నలకు దేవాదాయశాఖాధికారులు అవాక్కయ్యారు.

"ఈ దేవాలయంలో రాత్రిపూట కొన్ని సంవత్సరాలుగా, దశాబ్దాలుగా కరెంటు లేనప్పుడు, చేతిలో లాంతరు పట్టుకొని పాములను తేళ్ళను దాటుకుంటూ స్వామివారి సేవ మేముచేస్తూ ఉన్నప్పుడు మీరెవరూ కనిపించలేదే?! ---- వర్షాలు లేక పంటలు పండనప్పుడు స్వామికి జొన్నరొట్టెలే ఆరగింపు చేసి స్వామితోపాటు మేముకూడ అర్థాకలితో ఉన్నప్పుడు ఎక్కడ పోయింది మీ దేవాదాయశాఖ------" అడుగుతూ ఉన్న సీతను మెల్లిగా తట్టి ఆపారు సౌందరరాజన్.

"మేము మీకు పేస్కేల్సు ఫిక్స్ చేసి జీతం కూడా నెలనెలా ఇచ్చేస్తామండి..."

బృందంలో ఉన్న ఒక అధికారి చెప్పాడు.

"మీకింద జీతానికి పనిచేసే గతి మాకు లేదు. అర్చకులుగానే కాక ఈ సంస్థను ఇన్ని సంవత్సరాలుగా ఒక ధర్మాధికారిగా నడిపించాం. మీరా మాకు జీతం ఇచ్చేది?!" మళ్ళీ గద్దించింది సీత.

"లేదమ్మా!..." ఏదో చెప్పబోయాడా అధికారి.

"వెళ్ళాలంటే ఈ ఊరినుంచే వెళ్ళిపోతాం. కాని మీ క్రింద మాత్రం పనిచేయలేం," ఇంత కోపంగా సీత మాట్లాడి మేమెన్నడూ చూడలేదు.

మేమంతా ఆవిడని 'సీతక్క' అనే పిలిచేవారం. పెద్దగా చదువుకోకపోయినా మా అందరికి ఒక ఆత్మీయురాలిగా ఆ ఊరిలో ఉండేది సీత.

ఈ సంఘటనను కళ్ళకద్దినట్టుగా వివరించింది పల్లవి.

"అన్నీ బాగున్నాయి, నాకొకటి తెలవాలి. చిలుకూరుపై దేవాదాయశాఖ రెండు విధాలుగా దాడి చేసింది. అయితే..." ఏదో ముఖ్యమైన విషయం చెప్పబోతున్నారని వినడానికి నిశ్శబ్దమైయ్యారు మిగతా ముగ్గురు.

"యాదగిరి గుట్టకు దత్తతివ్వడం... దీనికి ముఖ్యమైన కారణాలేమి?!"

"సార్, 29/10/01 నాడు యాదగిరిగుట్ట దేవాలయానికి చెందిన అధికారులతో ఒక బృందం హుండీలో, టిక్కెట్లతో దేవాలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి రావడం జరిగింది..." ఏదో చెప్పబోయే పల్లవిని ఆపాడు ఇర్ఫాన్.

"ఇదంతా విన్నదే కదా?! నేను ఒక ముఖ్యమైన సంగతి చెబుతాను విను..." అన్నాడు ఇర్ఫాన్.

"నేనప్పుడు ఒక ఉర్దూ దినపత్రికలో పనిచేస్తున్నాను. ఆలయంలో 30.10.01 నాడు జరుగబోయే 'ఆత్మావలోకనం' కార్యక్రమానికి పాత్రికేయుల బృందంతో వెళ్లాను అప్పుడు..."

"ఏమిటి ఈ ఆత్మావలోకన దినం?"

"30/87 చట్టం అర్చకులపై, దేవాలయాలపై చేసిన దాడికి వ్యతిరేకంగా భక్తులు అర్చకులు కలిసి నిర్వహించిన నిరసన".

"ఏం జరిగింది?!" అందరూ ఉత్కంఠతతో వినసాగారు.

"సౌందరరాజన్‌గారు వందలాది భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్నారు. భక్తులందరు నిశ్శబ్దంగా ఆయనచెప్పే మాటలు వింటున్నారు. ఇంతలో..."


"మా చేతిలో ఒక కాగితం. అందులో ఒక పత్రికా ప్రకటన. ఒకప్రక్క తెలుగు, ఇంకొక ప్రక్క ఆంగ్లంలో చిలుకూరుపైన దాడి ఎందుకు అన్న ప్రశ్నకు అంకెలుగా, వరుసగా సమాధానాలు" చెప్పుకుపోతున్నాడు ఇర్ఫాన్.

"నాకు ఆశ్చర్యం. దాడి జరిగింది 29 అక్టోబరున. ఎప్పుడు ఈ ప్రకటన తయారు చేశారు? ఎప్పుడు తెలుగులో అనువదించారు? అడగాలనుకున్నాను..." ఇర్ఫాన్‌ను ఎవ్వరు ఆపలేదు చెప్పుకెళుతున్నాడు.

"నేను అక్కడ రంగరాజన్ అనే అర్చకుడిని పిలిచి అడిగాను. ఇది ఎలా అని?! ఆయన చెప్పిన బదులు నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. "ఇది మమ్మల్ని మా స్వామిని వేరుచేసే చర్య. ఔరంగాజేబ్ ఈ ప్రాంతంపై దాడి చేసినప్పుడు మా పూర్వీకులు స్వామి కైంకర్యాన్ని వదలలేదు. రజాకర్ల దౌర్జన్య సమయంలో కూడా మా వాళ్ళు స్వామి సేవను వదలలేదు. కొన్ని దశాబ్దాల క్రితం వచ్చిన భయంకరమైన మహమ్మారి ప్లేగ్‌తో మా కుటుంబంలో ఐదుగురు చనిపోయినప్పుడూ మేము స్వామిని వదలలేదు. ఇప్పుడు ఈ రాక్షసత్వమైన చట్టానికా మేము భయపడేది?! ముమ్మాటికీ కాదు, కూడదు. నిజంగా చెప్పాలంటే మాకు మా స్వామికి నడుమ ఏ శక్తి వచ్చినా మేము సహించేది లేదని" ఒక దృఢమైన సంకల్పంతో చెప్పి అట్నుంచి వెళ్ళిపోయారు. తరువాత తెలిసింది. రాత్రంతా తమ "లాప్ టాప్" కంప్యూటర్‌లో ఆంగ్లంలో ఈ ప్రకటనను తయారుచేసి విలేఖరులకు 10 గంటలకల్లా అందేటట్లు డిటిపి చేయించి తెచ్చారని. పెద్ద సాహసమే."

"ఆ ప్రకటన ఇక్కడ ఉందా?" అడిగారు 'గురు'.

"సార్, నేను ఆ ప్రకటనను, తరువాత వెలువడిన వార్తలను ఇప్పుడు చదువుతాను మీరు వినవచ్చు..."




Devotees Trying to Protect Balaji Temple Chilkur from the disastrous 30/87 Endowments Act.

చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని 30/87 చట్టం నుండి కాపాడటానికి ప్రయత్నిస్తున్న భక్తులు!

# పత్రికా ప్రకటన

# చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని రక్షించండి

ఆంధ్రప్రదేశ్‌లోని 34000 పై చిలుకు ఆలయాలను కాపాడే ఉద్యమంలో నడుం బిగించి ముందుకు నడిచిన ఈ 500 సంవత్సరాల కాలంనాటి ఆలయం, 30/87 ఎండోమెంట్సు చట్టం అనే రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది.

## దీనికి కారణాలు ఏమై ఉండవచ్చు?

1. మన దేశంలోని ఆలయాలను వినాశపరచడానికే పుట్టినటువంటి 30/87 ఎండోమెంట్సు యాక్టు అధికారాన్ని ఎదురించి నిరోధించినది ఈ చిలుకూరు దేవాలయమే; ముఖ్యంగా "వాక్" (ఆలయాల వాణి) అనే మాసపత్రిక ద్వారా తన భావాలను నలుగురికి పంచుతోంది.
2. ఆగమాలకు, రామానుజ సాంప్రదాయానికి, వల్లభ సాంప్రదాయానికి ఒక చక్కని వినూత్న సమన్వయం చేసి దానికి తగు రీతిలో పూజా విధులను ఆచరించడంలో ఈ చిలుకూరు దేవాలయం మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే ఒకే ఒక్క ఆలయం అని నొక్కి వక్కాణించవచ్చు
3. ఆలయాల్లో మనకు సాధారణంగా కనిపించే, టిక్కెట్ల అమ్మకం, ప్రసాదాల విక్రయం వంటి వ్యాపారీకరణ లేని ఒకే ఒక్క దేవాలయం ఈ చిలుకూర్ బాలాజీ ఆలయం.
4. భక్తుల యొక్క విరాళాల ద్వారా మాత్రమే ఈ ఆలయం పునరుద్ధరించబడి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. ఇక్కడ చేసినవన్నీ గుప్త దానాలే అన్నట్టుగా విరాళాలిచ్చిన భక్తుల పేర్లు వగైరా మీకు ఎక్కడ కూడా కనిపించవు. ఈ విరాళాలిచ్చిన వాళ్ళలో కొన్నివేల రూపాయలు ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు, వందలు ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు అలాగే కొన్ని రూపాయలు ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు. కాని వీరందరిలోని భక్తిభావం, పురాతన కట్టడాలను కాపాడాలనే వారి ఆరాటం మాత్రం అందరిలో సమానమే.
5. ఈ ఆలయంలో మాత్రమే సమాజ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబడటం దారిద్ర్యంతో అలమటిస్తున్న వారిని పైకి తీసుకువచ్చేలా పనిచేసే తోవలలో నడుస్తోంది. జనోద్ధరణ కార్యక్రమంలో ముఖ్యంగా రాజకీయ నాయకులందరు మరియు గ్రామ ప్రజల మన్ననలు పొందినది.
6. ఇక్కడ మాత్రమే ఆలయ భూములు ఒక్క అంగుళం కూడా భూకబ్జాదారులకు పోకుండా రక్షించబడుతున్నది. కంటికి రెప్పవలె కాపాడబడింది.
7. మొయినాబాద్ మండలంలోని ప్రజల సమైక్యతను కాపాడే విషయంలో తను ఒక నిష్పాక్షిక ధోరణిని అవలంభించి రజాకార్ ఉద్యమం మరియు అనేక ఇతర ఉద్యమాలలో ప్రజలకు రక్షణ యిచ్చింది ఈ చిలుకూర్ ఆలయం.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి,

తేది 27-11-2001 ప్రకారం "... ప్రస్తుత యాజమాన్యం దేవాలయంలో ఏ కైంకర్యం కూడా చేయడానికి, మరియు దేవాలయాన్ని డెవలప్ చేయడానికి వీలులేని పరిస్థితులలో ఉన్నందువలన దేవాదాయ కమీషనర్‌గారి ఉత్తర్వుల మేరకు ఈ దేవాలయాన్ని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం దత్తతు తీసుకోవడానికి నిర్ణయించడమైనది..." ఈ మేరకు అధికారులు 29-11-2001 నాడు బాలాజీ దేవాలయాన్ని తమ అధీనంలోకి తీసుకోవడానికి వచ్చారు.

ఈ దేవాలయాన్ని కూడా వ్యాపార సంస్థగా మార్చడమే ధ్యేయంగా పెట్టుకున్న ప్రస్తుత చట్టం ప్రకారం పై చెప్పబడిన యాదగిరిగుట్ట దేవాలయ అధికారులు హుండీతో, టిక్కెట్లతో, సెక్యులర్ సిబ్బందితో బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంపై 30/87 చట్టం యొక్క కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి రావడం జరిగింది.

*ఓ బాలాజీ! నీ దేవాలయాన్ని నీవే కాపాడుకోవాలి.*

ఇట్లు

డా॥ యం.వి. సౌందరరాజన్

సి.యస్. గోపాలక్రిష్ణ

తేది : 30-11-2001 వంశపారంపర్య అర్చకులు

శ్రీ బాలాజీ టెంపుల్, చిలుకూరు

"స్వామిని, ఆ బాలాజి స్వామినే తమ దేవాలయాన్ని కాపాడుకోడానికి అర్థిస్తూ, భక్తులను చైతన్యవంతులుగా చేసిన ఈ ప్రకటన ఆలయ వంశపారంపర్య అర్చకులైన సౌందరరాజన్, గోపాలకృష్ణల పేరుతో పత్రికలవారికి అందించారు." చెప్పాడు ఇర్ఫాన్.

"ఆత్మావలోకనం రోజుకు ముందు చిలుకూరుపై ఈ దాడి చూస్తుంటే ఇదేదో అర్చకుల, భక్తుల ఉద్యమానికి కేంద్ర బిందువైన చిలుకూరుపై అణచివేత చర్యగా లేదు?!" అడిగారు 'గురు'.

"అవును సార్! పత్రికల వారు కూడా అలాగే ప్రచురించారు! ఇదిగో ... " చెప్పింది పల్లవి.

సుందరయ్య గ్రంథాలయ
C No. 93119
హైదరాబాద్-500

| నాడు | నేడు |
|---|---|
| "చిలుకూరులోని దేవాలయం అర్చక మరియు ట్రస్టీచే చాలా బాగా నిర్వహించబడుచున్నది. స్వామివారి అలంకారం, దేవాలయ ప్రాంగణంలోని శుభ్రత తృప్తికరంగానున్నది. అర్చకుని కుటుంబమంతా స్వామివారి కైంకర్యముపై భక్తితో అంకితభావంతో నున్నారు...."<br>*–4th Oct 1996, Pay Scales Committee Report which has been approved by the Government of Andhra Pradesh & Supreme Court.*<br>పేస్కేళ్ళ కమిటీ ప్రభుత్వ ఆమోదంతో సుప్రీంకోర్టుకు 4-10-96 నాడు ఇచ్చిన నివేదికలో | "... ప్రస్తుత యాజమాన్యం దేవాలయంలో ఏ కైంకర్యం కూడా చేయడానికి, మరియు దేవాలయాన్ని డెవలప్ చేయడానికి వీలులేని పరిస్థితులలో ఉన్నందువలన దేవాదాయ కమీషనర్‌గారి ఉత్తర్వుల మేరకు ఈ దేవాలయాన్ని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం దత్తతు తీసుకోవడానికి నిర్ణయించడమైనది..."<br>యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారి<br>29-11-2001 |

అధికారులారా?! ఎవరిని మోసం చేస్తున్నారండీ?!!

6

# అర్చకులపై వేధింపు చర్యలు

ఆంధ్రభూమి బ్యూరో : హైదరాబాద్, నవంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం అర్చక సమాఖ్య ప్రతినిధులపై వేధింపుచర్యలు ప్రారంభించింది. అర్చకుల సమస్యలు సానుకూలంగానే పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, కొంత మంది తాము అర్చక ప్రతినిధుల మంటూ అనవసరపు రాద్ధాంతం సృష్టిస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు ఎం.వి. సౌందర రాజన్ అనువంశిక అర్చకునిగా ఉన్న చిల్కూర్ శ్రీ బాలాజీ ఆలయాన్ని యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి దత్తత ఇస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీచేశారు. పైగా ఇంకో అడుగు ముందుకు వెళ్ళి కోర్టులో కేవియట్ దాఖలు చేశారు. ఈ ఉత్తర్వుల్లో, ఎటువంటి వేధింపుచర్యలు లేవని, కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ఉన్న చిల్కూరు దేవాలయానికి చెందిన ఆదాయం దేవాదాయ శాఖకు చెందే విధంగా మాత్రమే ఈ నిర్ణయం తీసుకున్నామని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులు తమ సమస్యల కోసం పోరాటం సాగిస్తున్న సమయంలో, అర్చక ఆందోళనను నడిపిస్తున్న సౌందరరాజన్ అర్చకునిగా ఉన్న దేవాలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ నిర్ణయాన్ని చిల్కూరు గ్రామస్తులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. ఆలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు గురువారం చిల్కూరు వచ్చిన యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులకు స్థానికులకు కొంత సేపు వాగ్వివాదం జరిగింది. దేవస్థానం అధికారులు హుండీ, టిక్కెట్లను తీసుకు వచ్చి దేవాలయాన్ని స్వాధీనం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఆలయ అర్చకుడు సౌందరరాజన్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు ఆలయస్వాధీనం విషయమై అడిగిన పలు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చెప్పలేక అధికారులు వెనుతిరిగి వెళ్ళాల్సి వచ్చింది. అయితే ఏక్షణాన్నైనా ఆలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

## ఆలయాన్ని స్వాధీనం చేయం

చిల్కూరు శ్రీ బాలాజీ ఆలయం స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని భక్తులు నిరసిస్తున్నారు. ఏ పరిస్థితుల్లోను ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించబోమని, అవసరమైతే ఎటువంటి త్యాగానికైనా తాము సిద్ధంగా ఉన్నామని

గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులతో సహా పలువురు పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు గుడిని స్వాధీనం చేసుకుంటున్నారన్న వార్త తెలియగానే నిరాశకు లోనయ్యారు. కొంత మంది స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా ఆలయ స్వాధీనాన్ని అంగీకరించబోమని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తాము ఎందుకు ఆత్మావలోకనం కార్యక్రమాన్ని చేపట్టాల్సి వచ్చిందో సౌందర రాజన్ వివరిస్తూ, చిల్కూరు ఆలయాన్ని యాదగిరిగుట్ట దేవస్థానానికి దత్తత ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని తెలియజేశారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయ అభివృద్ధితో పాటు, గ్రామాభివృద్ధికి కూడా దేవాలయం ద్వారా వచ్చిన ఆదాయాన్ని అన్ని విధాలుగా వినియోగిస్తూ మంచి కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ భద్రప్ప తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇంటింటికి, వాడ వాడకు తిరిగి చందాలు వసూలు చేసి దేవాలయాన్ని అభివృద్ధి చేసిన తర్వాత ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకోడం సమంజసం కాదని చిల్కూరు ఎంపిటిసి సభ్యుడు గోపాల్ పేర్కొన్నారు. దేవాలయాన్ని పరిరక్షించుకునేందుకు తాము ఎటువంటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. పలువురు మహిళలు దేవాదాయ శాఖ అధికారులను ఆలయంలోకి అడుగుపెట్ట నిచ్చేది లేదని పేర్కొన్నారు. ఏ డబ్బులేనప్పుడు ఆలయం ఎవరికీ కనబడ లేదని, కాస్త ఆదాయం చూడగానే గుడిని ఇచ్చేయ మంటున్నారని చంద్రమ్మ అనే మహిళ పేర్కొంది. ఏ పరిస్థితిలోను ఆలయాన్ని ఇచ్చేది లేదని, తాము ఏ ఒక్కరినీ లోపలికి రానిచ్చేది లేదని రామక్క అనే మహిళ పేర్కొంది.

## ఆలయ పరిరక్షణకు ఆత్మాహుతికైనా సిద్ధమే

శ్రీ బాలజీ ఆలయంతో పాటు రాష్ట్రంలో దేవాలయాలను పరిరక్షించేందుకు తాను ఆత్మాహుతికైనా సిద్ధమేనని అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు సౌందరరాజన్ పేర్కొన్నారు. దేవాదాయ చట్టం వల్ల హిందూ దేవాలయాలు మూత పడుతున్నాయని ఈ విషయాన్ని తెలియజేసేందుకే ఆందోళన చేపట్టామని అన్నారు. దీనితో పాటు అర్చకుల పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి చేసేందుకే ఆత్మావలోకనం ద్వారా నిరసనను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించామన్నారు. దురదృష్టం కొద్దీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలను తీసుకుంటున్నదని అన్నారు. చిల్కూరు ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలనుకోవడం వేధించే ప్రయత్నమేనని అన్నారు. అయితే ఆలయాన్ని స్వాధీనం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందుగానే తమ సమస్యలు సానుకూలంగా పరశీలించి ఉంటే ఆందోళన చేపట్టేవారమే కాదని ఆయన అన్నారు. (ఆంధ్రభూమి 1-12-2001)

"ఇర్ఫాన్, పల్లవి, మహేందర్, మీరు ముగ్గురూ ఇప్పటి వరకూ చేసిన పని చాలా అద్భుతం, కాని...." అసహనంగా చెప్పారు 'గురు'.

"ఏమిసార్, ఏదో ఆలోచిస్తున్నారు....." ముగ్గురు ముక్త కంఠంతో అడిగారు.

"చిలుకూరులో జరిగిన పరిణామాలు చూస్తే కొన్ని నాకు అర్థం కావటంలేదు."

"ఏమి సార్?"

"డిసెంబర్ 8, 2001 నాడు హుండీని తొలగించారు, కదా?"

"అవును."

"భక్తుల స్పందన ఎలా ఉండింది?! మీరెవరినైనా అడిగారా? వారి మనోభావాలు ఎలా ఉండినాయి?"

"సార్, మీ ప్రశ్నకు సమాధానం ఆంధ్రభూమి కథనమే. రమణాగారు తానే భక్తులను మనకోసం ప్రశ్నించినట్లు ఇదిగో...." చెప్పసాగాడు మహేందర్

ఆంధ్రభూమి బ్యూరో హైదరాబాద్ మే 21, 2002 : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ వెంకటేశ్వరస్వామి ఆలయం (దేవల్‌వెంకటాపూర్) కొంత కాలం నుండి చర్చనీయాంశంగా మారింది. ఈ ఆలయానికి ట్రస్ట్‌బోర్డును నియమించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారిచేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఆలయ వంశపారంపర్య అర్చకులు ఎం.వి. సౌందరరాజన్, సి.ఎస్. గోపాలకృష్ణ వ్యతిరేకిస్తున్నారు. దాంతో ప్రభుత్వ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. హైదరాబాద్‌కు కేవలం పాతిక కిలోమీటర్ల దూరంలో ఉండడమే కాక, ప్రచారం కూడా ఎక్కువగా కావడం వల్ల వెంకటేశ్వరుడి (వెంకన్న) దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. శని, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో వస్తున్న భక్తుల సంఖ్య ముప్పై, నలబై వేలకు పైగానే ఉంటోంది. తెలంగాణాలోని యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర, తదితర పుణ్యక్షేత్రాల సరసన చిల్కూర్ వెంకన్న కూడ చేరినట్టుగానే భావించవచ్చు. ఈ ఆలయానికి వచ్చే భక్తులు పదకొండు పర్యాయాలు ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేస్తే వారి కోరికలు నెరవేరుతాయని, ఆ తర్వాత వారు 108 పర్యాయాలు ప్రదిక్షణలు చేయాల్సి ఉంటుందని ప్రచారం జరిగింది. దాంతో ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ ఉంటారు. దేవుడి దర్శనానికి ప్రత్యేక టిక్కెట్లు లేకపోవడం, పూజలు, కొబ్బరికాయలు కొట్టేందుకు చార్జీ ఏమి లేకపోవడం ఇక్కడి ప్రత్యేకత. కనీసం హుండీ కూడా లేదు. అంటే ఏ రూపంలో కూడా భక్తులు దేవాలయంలో డబ్బులు ఖర్చు చేయడానికి అవకాశం లేదు. ఈ కారణాలవల్ల రద్దీ పెరిగిందని

తెలుస్తోంది. ఏడాది క్రితం వరకు భక్తుల రాక చాలా తక్కువగా ఉండేది. అప్పట్లో గర్భగుడి వరకు వెళ్లి నింపాదిగా అర్చన చేయించేందుకు, అక్కడే ఎంతసేపయినా కూచునేందుకు సమయం ఉండేది. అయితే ఏడాది నుండి మరీ ఆరునెలల నుండి భక్తుల రాక పెరిగింది. ఆలయం రెండో ద్వారానికి కొద్ది దూరం నుండే దేవుడి దర్శనం చేసుకుని వెళ్లిపోవలసి వస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే తిరుపతిలో ఉన్న విధంగానే ఇక్కడ కూడా దర్శనం చేసుకుని వెళ్ళిపోవలసి వస్తోంది. ఆలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న విధానంపై భక్తుల అభిప్రాయాలను ఆంధ్రభూమి సేకరించింది.

చట్టంపై గౌరవం - భక్తులపై అభిమానం : చిల్కూరు వెంకటేశ్వర ఆలయాన్ని రాష్ట్రంలో ఆదర్శ ఆలయంగా మార్చాలన్నదే నా ఉద్దేశం. ఆలయాల నిర్వహణకు సంబంధించినంత వరకు చట్టాన్ని గౌరవిస్తాను. అదే సమయంలో భక్తుల మనోభావాలను అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇదివరకే ఒక మేనేజింగ్ కమిటీని నియమించింది. మేనేజింగ్ కమిటీలో మాతో (వంశపారంపర్య అర్చకులు - సౌందరరాజన్, గోపాలకృష్ణ) పాటు దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్లు, ఒక అసిస్టెంట్ కమిషనర్ సభ్యులుగా ఉన్నారు. రెండు కమిటీల నేతృత్వంతో ఆలయ నిర్వహణ సక్రమంగా సాగుతోంది. ఇటీవల బ్రహ్మోత్సవాలు కూడా విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ పరిస్థితిలో రాజకీయ నాయకులతో 'ట్రస్టుబోర్డు'ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటన్నదే అర్థం కాని విషయం. ప్రభుత్వం అనవసరంగా ప్రతిష్ఠకు పోవలసిన అవసరం లేదు. తాడ్‌బంద్ (సికింద్రాబాద్) ఆలయానికి అటానమస్ స్టేటస్ ఉంది. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయాలకు స్వయంప్రతిపత్తి ఉంది. అదే తరహాలో చిల్కూర్ దేవాలయానికి స్వయంప్రతిపత్తి ఉండడంలో తప్పేమిటి? భక్తులు కూడా ఇందుకు అనుకూలంగానే ఉన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించాలి కదా! భక్తుల విశ్వాసానికి వ్యతిరేకంగా ట్రస్టుబోర్డును నియమించడం సరికాదు. మేనేజింగ్ కమిటీ, డెవలప్‌మెంట్ కమిటీలను సంప్రదించకుండా నేరుగా ట్రస్టుబోర్డును నియమించాలని ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. ఇప్పుడు భక్తులందరికీ సమాన ప్రాతినిధ్యం లభిస్తోంది. ట్రస్టుబోర్డు ఏర్పాటయితే రాజకీయాలు చోటు చేసుకోవడమే కాకుండా ఆలయ నిర్వహణ వ్యాపారంగా మారుతుంది. ఎండోమెంట్స్ రెగ్యులేషన్ ఉండటంలో తప్పులేదు కాని ఈ చట్టంలో సమూల మార్పులు చేసి అమలు చేయాలి. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినా సరైన స్పందన రాలేదు.

*-ఎం.వి. సౌందరరాజన్, వంశపారంపర్య అర్చకులు, శ్రీబాలాజీ ఆలయం*

ఆలయ నిర్వహణ బాగుంది : ప్రస్తుత విధానంలోనే ఆలయ నిర్వహణ బాగుంది. పేదలు, ధనికులు అనే తేడా లేకుండా దర్శనం అవుతోంది. భక్తులతో పాటు అర్చకులకు

భక్తిపైనే దృష్టి ఉంటుంది. పూజారులు కూడా డబ్బు తీసుకోవడంలేదు. దాంతో భక్తులు కేవలం భక్తితో వచ్చి వెళ్ళేందుకు వీలవుతోంది.

*-పి. రవికుమార్(విజయవాడ), ప్రస్తుతం హైదరాబాద్*

దేవుడికే ప్రాధాన్యత : చిల్కూరు ఆలయంలో దేవుడికే ప్రాధాన్యత ఉంది. మానసికంగా కూడా ఆనందంగా ఉంది. ఏ దశలోనూ ఆలయంలో భక్తుల నుండి డబ్బు రాబట్టుకోవాలన్న దృక్పథం లేకపోవడం హర్షిస్తున్నాను. అన్ని ఆలయాల్లోనూ ఇదే విధంగా భక్తికే ప్రాధాన్యత ఉంటే బాగుండేది.

*-జి. లక్ష్మి, నేరెడ్‌మెట్*

అవినీతి లేదు : ఆలయంలో అవినీతికి అవకాశం లేదు. పూజారుల పెత్తనం లేదు. హుండీ లేదు. చాలా నీట్‌గా ఉంది. అందరి మనస్సులో కేవలం భక్తి భావం మాత్రమే చోటు చేసుకునే పరిస్థితి ఉంది. టిటిడితో సహా అన్ని దేవాలయాలు ఇలాగే ఉంటే బాగుంటుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించి ప్రోత్సహించాలి.

*-డాక్టర్ జయచంద్రనాయుడు, సంజీవరెడ్డినగర్*

ట్రస్టుబోర్డు ఏర్పాటయితే వ్యాపారమే : డబ్బు వ్యయం చేయడం వల్ల భక్తిపెంపొందదు. ఈ ఆలయంలో డబ్బు ప్రస్తావన ఏ దశలోనూ లేదు. ట్రస్టుబోర్డును ప్రభుత్వం నియమిస్తే ఆలయ నిర్వహణ వ్యాపారంగా మారే అవకాశం ఉంటుంది. ప్రస్తుతమున్న ఖ్యాతి గూడా తగ్గిపోతుంది. అందువల్ల ప్రభుత్వం ట్రస్టుబోర్డును నియమించవద్దు. టికెట్ల వ్యవస్థ లేని ఈ విధానమే కొనసాగాలి. విఐపిల స్పెషల్ దర్శనాలు లేకపోవడమే మేలు. హుండీ అస్సలు ఏర్పాటు చేయవద్దు.

-ఎం. వసంత, హైదరాబాద్

కోరిక నెరవేరింది : హుండీలు లేవు, దక్షిణలు అంతకన్నా లేవు. అందరూ క్యూలో నిలుచుని స్వామిని దర్శించుకోవడం చూస్తుంటే ఇది కలా నిజమా అనిపిస్తోంది. కోరికలు నెరవేరతాయని ఈ ఆలయానికి వస్తున్నాను. ఇప్పటికి మూడుపర్యాయాలు వచ్చాను. ఎంసెట్‌లో సీట్‌రావాలన్న నాకోరిక నెరవేరింది.

-హెచ్. ఉమేష్, ఇసిఐఎల్.

అందరూ సమానమే : సాధారణంగా చాలా దేవాలయాలలో డబ్బున్న వారికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ప్రత్యేక దర్శనం తదితర రకాలుగా ఇక్కడ దర్శనం లేదు. దేవుడి వద్ద అంతా సమానమేనన్న విషయాన్ని ఆచరణలో చూపుతున్నారు.

-కె. రాంరెడ్డి, మౌలాలి

"అద్భుతం! మనం చేయాలనుకున్నదే ఆంధ్రభూమి చేస్తున్నది. ఇంకొక విషయం, ఈ ప్రచారమంతా భక్తుల మనస్సుకు తగిన రీతిలో దేవాలయం ఉండడమే కదా?!" 'గురు' ఒక చిరునవ్వుతో అభినందించాడు.

"సార్, ఆంధ్రభూమి పత్రికే కాదు. ప్రజాపక్షాన ఉన్న అన్ని వార్తా పత్రికలు, వారపత్రికలు చిలుకూరు దేవాలయంపై ఏదో ఒక అంశాన్ని పాఠకులకు విన్నవిస్తూనే ఉన్నాయి." పూర్తి చేశాడు ఇర్ఫాన్.

## 7

# చిలుకూరు తిరుగుబాటు

మీరు దేశంలో పేరుమోసిన పెద్ద గుడికి వెళతారు. దర్శనాల్లో సేవల్లో అడుగడుగునా అవినీతిని చూస్తారు. తన దేవస్థానంలో తన కళ్లముందే అన్ని అక్రమాలు, భక్తులకు వేధింపులు జరుగుతూంటే దేవుడు చూస్తూ ఎలా ఊరుకుంటున్నాడని మీకు ఆశ్చర్యం వేస్తుంది.

ఓ గొప్ప గుడిలో దొంగలు పడతారు. అమ్మవారి కిరీటాన్ని, స్వామివారి నగలన్నిటినీ దర్జాగా ఎత్తుకుని పోతారు. ఆ వైనాన్ని మీరు పత్రికల్లో చదువుతారు. లోకాలను రక్షిస్తాడనే దేవుడు తన సొత్తును తాను రక్షించుకోలేక పోవడమేమిటి, దొంగల దురాగతాన్ని చూస్తూ ఊరుకోవడమేమిటి అని నిర్ఘాంతపోతారు.

మీరు చరిత్ర పుస్తకాలు చదువుతారు. ఘజనీలు, ఘోరీలు దండెత్తి వచ్చి సోమనాథ్ లాంటి ప్రాచీన దేవాలయాలను ధ్వంసంచేసి, పవిత్ర విగ్రహాలను విరగ్గొట్టి, మలినపరచి, నగలు దోచుకోవడమే గాక వద్దని వేడుకున్న భక్తులను కసితీరా చంపారని తమ దారికి అడ్డుగా పడుకున్న వేలాది భక్తులను పరపర.తలలు నరికి గుడి ప్రాంగణంలో రక్తపు టేరులు పారించారని తెలుసుకొని మహా క్షోభపడతారు. తన ఆలయ ఆవరణలోనే తనను నమ్ముకున్న వారిని మతోన్మాద పిశాచి మూకలు క్రూరంగా ఊచకోత కోస్తూంటే భగవంతుడు ఎలా సహించాడు, ఎందుకు మిన్నకుండిపోయాడు అన్న శంక మిమ్మల్ని విడవకుండా వేధిస్తుంది.

దేవుడి మీద నమ్మకం ఉన్నవారిలో కూడా చాలామందికి వారి ఆలోచనా స్థాయిని బట్టి, మానసిక పరిణతిని బట్టి, సంస్కారాన్నిబట్టి ఇలాంటి సందేహాలు అనేకం వస్తుంటాయి. దేవుడనేవాడు ఉన్నాడా? ఎలా ఉంటాడు? ఏమిచేస్తాడు? ఎందుకు చేస్తాడు? ఏమి చేయడు? ఎందుకు చేయడు? దైవలీలను అర్థం చేసుకోవడం ఎలా? ఇవి బుద్ధి తెలిసిన నాటి నుంచీ మనిషి బుర్రను తొలుస్తున్న ప్రశ్నలు. వీటికి తలా

ఒక రకంగా సమాధానాలు చెబుతారు. చెబుతూనే ఉంటారు. అయినా ప్రశ్నలు ఆగకుండా మొలుస్తూనే ఉంటాయి.

కొంతమంది పెద్దలు అనేదేమిటంటే...

దేవుడి బొమ్మ మనిషి ఆకారంలో ఉంది కాబట్టి దేవుడు కూడా ప్రతి దానికీ మనిషి లాగే రియాక్ట్ అవుతాడని, కావాలనీ అనుకోవడం పొరపాటు. మనకు కొందరంటే ఇష్టం. కొందరిని చూస్తే అసహ్యం. వీరు మన వారు: వారు పరాయి వారు అనే భేదభావం ఉంటుంది. ఇది మనది అనుకున్నప్పుడు దానిని కాపాడుకోవాలన్న ఆరాటం దానికదే పుడుతుంది. మన కళ్లముందు మన పేరుతో ఎవరైనా మోసాలు చేస్తే ఊరుకోం. మన సొత్తును ఎవరైననా ఎత్తుకుపోతుంటే... మనల్ని నమ్ముకున్న వారికి హాని జరుగుతూంటే శాయశక్తులా అడ్డుకుంటాం. మన జోలికి వచ్చిన వారిని వెంటాడి, దెబ్బకు దెబ్బ తీసి తీరతాం. ఆ సందర్భాల్లో మనం అలా స్పందిస్తాం కాబట్టి అవే సందర్భాల్లో దేవుడూ అలాగే కదలాలనుకోవడం మన అవివేకం. విశ్వంలో ఉన్నదంతా తానే అయినప్పుడు, ప్రతి వస్తువూ, ప్రతి అణువూ తనదే అయినప్పుడు... ప్రతి మనిషీ, ప్రతి ప్రాణీ తన ప్రతిరూపమే అయినప్పుడు భగవంతుడు ఎవరి నుంచి దేనిని కాపాడాలి? దేనిని రక్షించుకునేందుకు కత్తి దూసి ఎవరితో తలపడాలి?...

ఇది వేదాంతం. మన బుర్రకెక్కదు. విన్న కొద్దీ అయోమయం ఎక్కువవుతుంది. వదిలెయ్యండి.

మోడరన్ పరిభాషలో ఇంకొందరు చెప్పేదేమంటే... దేవుడనేవాడు సూపర్ కంప్యూటర్ అనుకో. కంప్యూటర్ అన్ని పనులూ చక్కబెడుతుంది. ఎంతటి చిక్కునైనా విడగొడుతుంది. ఏమడిగినా చెబుతుంది. చెప్పటానికి, ఆలోచించటానికి అందులో మనిషెవరూ ఉండరు. అది ప్రాణంలేని పెట్టె. అయినా మీరు అనుసరించే సాఫ్ట్‌వేర్ పద్ధతిని బట్టి ఎంచుకునే ప్రోగ్రామ్‌నుబట్టి మీరు ఏమి 'ఎంటర్' చేస్తే దానికి స్పందిస్తుంది. ఏదీ 'ఎంటర్' చేయకుండా, అసలు కీబోర్డునే ఉపయోగించకుండా మనం ఊరకుంటే కంప్యూటరూ ఊరుకుంటుంది. అన్ని ఎం.బి.ల ఇంత 'రాము'ల బ్రెయినుకదా? ప్రపంచంలో నీకు తెలియనిది, నువ్వు చేయలేనిది ఏమీ లేదు గదా? నీ మీద ఇన్ని వేలు పోసి, ఇంత శ్రద్ధగా మెయింటైన్ చేస్తున్నాను కదా? కాబట్టి నాకేమి కావాలో నువ్వే పోల్చుకుని, దానికి ఏమి చేయాలో నువ్వే చేసెయ్యి అని చేతులు ముడుచుకుని కూచుంటే ఎంత గొప్ప కంప్యూటరు మాత్రం ఏమి చేస్తుంది? అలాగే దేవుడు కూడా మన వంతు ప్రయత్నం మనం చేసి, చిత్తశుద్ధితో, దృఢ సంకల్పంతో శాయశక్తులా కష్టపడితేనే ఆశీర్వదించి కోరిన ఫలం ఇస్తాడు. ఎంతటి మహిమనైనా చూపుతాడు. మన పని మనం చేయకుండా అంతా నీదే భారం, అన్నీ నువ్వే చూసుకో, నీ గుడిని నువ్వే కాచుకో, నీ ఆస్తులు నువ్వే

రక్షించుకో అని చేతులు దులిపేసుకుంటే దేవుడికి మాత్రం ఏమి పట్టింది?

ఈ వాదం కొంచెం రీజనబుల్‌గానే ఉంది. కానీ - నమ్మదగ్గదేనా? మన ప్రయత్నం మనం చేస్తే దేవుడు మహిమ చూపుతాడా? ఈ కాలంలో కూడా మహిమలూ, అద్భుతాలూ జరుగుతాయంటే నమ్మగలమా?

నమ్మాల్సిందేనంటున్నాడు మన రాష్ట్రంలోనే ఓ పెద్దాయన. పట్టిగా తీరి కూర్చుని వాదులాడటం కాదు. పట్టుబట్టి రంగంలోకి దిగి ఆయన దేవుడి పక్షాన హోరాహోరీగా పోరాడుతున్నారు. అదీ ఒకరిద్దరు వ్యక్తులతో కాదు. కొద్దిమంది పెత్తందారులతో కాదు. మొత్తం రాష్ట్రం మీద పెత్తనం చేసే ప్రభుత్వంతో. అడ్డగోలు చట్టాల అండతో మదించిన నిరంకుశ వ్యవస్థతో.

కేవలం తెగించి పోరాడటమే కాదు. అందులో ఇప్పటికే నమ్మశక్యం కాని ఫలితాలను సాధించారు కూడా.

ఘనత వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని సంవత్సరాలుగా కాలిలో ముల్లులా తయారై కంటికి కునుకు లేకుండా చేస్తున్న ఆ మనిషి విప్లవకారుడు కాదు. నెత్తురు మండే యువకుడు కాదు. వయసు మళ్లిన వృద్ధుడు. పేరు : ఎం.వి. సౌందరరాజన్. ఆయన కార్యస్థానం హైదరాబాద్‌కు 30 కిలోమీటర్ల దూరంలో చేవెళ్ల రోడ్డులోని చిలుకూరు వెంకటేశ్వరాలయం. దానికి ఆయన అనువంశిక అర్చకుడు.

అర్చకుడు అనగానే మనకు దక్షిణ కోసం చెయ్యి చాచే మామూలు గుడి పూజారి గుర్తుకొస్తాడు. సౌందరరాజన్ పూజారి మాత్రమే కాదు. యూనివర్సిటీ ప్రొఫెసర్ కూడా. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రారుగా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, సికింద్రాబాద్ పి.జి. కాలేజ ప్రిన్సిపాలుగా పనిచేసి కొన్నేళ్ల కిందట పదవీ విరమణ చేశారు. ఉన్నత విద్యారంగంలో కులమతాల దుష్ప్రభావాలు లేకపోతే ఏనాడో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కావాల్సిన వాడాయన. పెన్షను పుచ్చుకుంటూ, ఆరోగ్యం గురించి బెంగపడుతూ, శేష జీవితాన్ని మనవల మధ్య గడపవలసిన వయసులో సర్వానర్థాలకు కారణమైన ఎండోమెంట్సు చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం మీదే కత్తులు దూసి దేవాదాయ పద్మవ్యూహంలో ఆయన అభిమన్యుడిలా పోరాడుతున్నాడు. కురుక్షేత్రంలో అభిమన్యుడు దైవ సహాయానికి నోచుకోలేదు. కాబట్టి నేలకొరిగాడు. దేవుడి పక్షాన పోరాడుతున్న సౌందరరాజన్‌కు దేవుడి సాయం లభించింది. కాబట్టి ఇప్పటిదాకా గెలుస్తూనే ఉన్నాడు.

అసలు విషయం ఏమిటంటే...

గండిపేట చెరువు ఆవలి ఒడ్డున ఉన్న చిలుకూరు గుడి శతాబ్దాలుగా వంశపారంపర్య అర్చకుల, స్థానిక పెద్దల అజమాయిషీలో ఉంది. భక్తుల, గుప్తదాతల కానుకలతో ఆలయ మందిరాలను నిర్మించి, టిక్కెట్ల, ప్రసాదం అమ్మకాల బిజినెసు చేయకుండా

ఆగమ సాంప్రదాయబద్ధంగా గుడిని నడుపుతున్నారు. ఈ ప్రాచీన దేవాలయం ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ ఏదైనా కోరికతో 11 ప్రదక్షిణాలు చేసిన వారికి అనుకున్నది అవుతుందట. కోరిక తీరినవారు మళ్లీ వచ్చి 108 ప్రదక్షిణాలు చేసి వెళ్లాలట. ఇంతకు మించి ఏ మొక్కూ మొక్కక్కర్లేదు. ఎవరికీ ఏ మొత్తమూ చెల్లించనక్కర్లేదు. నమ్మకం ఉన్న భక్తులు జంటనగరాలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రావడం తరతరాలుగా ఉన్నదే అయినా ఈ దేవాలయ ప్రశస్తి ఇటీవలి సంవత్సరాల్లో దూరప్రాంతాలకు కూడా పాకి భక్తులు రావడం ఎక్కువైంది. యాత్రికుల సందడి కనిపించగానే ఎండోమెంట్సు డిపార్టుమెంటు కన్ను దీనిమీద పడింది.

ఇక చెప్పేదేముంది? ఏలినాటి శని అయినా ఏడున్నర ఏళ్లకు వదులుతుంది గానీ ఎండోమెంట్సు శాఖ బారిన పడితే ఏ గుడీ ఏనాటికీ బయటపడదు. బాగుపడదు. దేవాలయ నిర్వహణ అంటే హుండీ కలెక్షన్ల, టిక్కెట్ల అమ్మకాల పక్కా వ్యాపారమనీ... భగవంతుడికి భక్తులిచ్చే కానుకలను దేవస్థానం సిబ్బందిని మేపడానికి, ఆఫీసర్ల ఇంటి అవసరాలకూ, గవర్నమెంటు అక్కరలకూ, రాజకీయ నాయకుల మెహర్బానీలకు వినియోగపరచడానికే తమ శాఖ అవతారమెత్తిందనీ దృఢంగా విశ్వసించే గుళ్ల పెత్తందారులు తమ ప్రమేయం లేకుండా ఒక గుడి పచ్చగా ఉన్నదంటే చూస్తూ ఎలా ఊరుకుంటారు?

అందుకే - తక్షణం ఏదో ఒకటి చేయాలని తలచి చిలుకూరు వెంకటేశ్వరుడిని తీసుకుపోయి యాదగిరిగుట్టలో తమ కబ్జాలోని నరసింహస్వామికి 2001 నవంబరులో బలవంతంగా దత్తు ఇవ్వబోయారు.

గుడిని ఎండోమెంటు శాఖ కబళించటానికి అది మొదటి మెట్టు. వ్యవహారం అంత దాకా వచ్చాక ఇష్టమున్నా లేకున్నా తాము చేయగలిగింది లేదనే సాధారణంగా బాధిత గుడి భక్తులు అనుకుంటారు. లోకానికి దేవుడు ప్రభువు అయితే కావొచ్చుగాని ఈ రాష్ట్రంలో మాత్రం గవర్నమెంటే దేవుళ్లకు ప్రభువు కాబట్టి సర్కారు వారు నంది అంటే నందే; పంది అంటే పందే అయి తీరుతుందన్న నిస్పృహతో ఇలాంటి పరిస్థితుల్లో చాలామంది చేతులెత్తేస్తారు. కాని డాక్టర్ సౌందరరాజన్ అంత తేలికగా ఓటమిని అంగీకరించే ఘటం కాదు. ఇంతకాలం తాము ఏ వ్యాపార సంస్కృతినైతే నిరోధిస్తూ వచ్చారో దాన్నే ప్రభుత్వం దొడ్డిదారిన ప్రవేశపెట్టడాన్ని సకాలంలో ఎదుర్కోకపోతే ఏమవుతుందో ఆయన విడమర్చి చెప్పి పార్టీలు రాజకీయాలకు అతీతంగా స్థానికులందరినీ గుడి రక్షణకు సమీకరించగలిగారు. ఎక్కడో వేరే జిల్లాలోని ఎండోమెంట్సు గుడి సంరక్షణ ఉంటే తప్ప బతకలేని అర్భకపు స్థితిలో తమ దేవస్థానం ఏమీ లేదని, తమ వ్యవహారాలు తాము చూసుకోగలమని, అడ్డగోలుగా దత్తత ఇచ్చెయ్యటానికి మీరెవరని చిలుకూరు వారు గట్టిగా ప్రతిఘటించడంతో కథ అడ్డం తిరిగింది.

ఊహకందని ఈ వ్యతిరేకతతో ప్రభుత్వం బిత్తరపోయింది. సర్కారీ ఫర్మానా చేతపుచ్చుకుని ఆలయ స్వాధీనానికి యాదగిరిగుట్ట అధికారులు రివ్వున వచ్చి టిక్కెట్లు ఎలా పెట్టాలో, ప్రసాదాల కౌంటరు ఎక్కడ ఉంచాలో ఆలోచించుకుని వెళ్లడం కూడా అయ్యాక ప్రధానార్చకుడు సౌందరరాజన్ ఎవరూ ఊహించని రీతిలో ఇంకో అస్త్రం ప్రయోగించారు. ఎండోమెంట్సు శాఖ యావ అంతా హుండీ వసూళ్ల మీద కాబట్టి, సహచరులను సంప్రదించి తమ గుళ్లో ఉన్న హుండీనే తీసేశారు. ఇక ముందు భక్తులెవరూ ఎక్కడా ఏ కానుక వేయొద్దని కిందటి డిసెంబర్ 8న అర్చకులు ప్రకటించడంతో 'హుండీభక్తుల' గుండెల్లో రాయి పడింది. హుండీ లేని గుడి దేవాదాయ శాఖవారు కలనైనా ఊహించలేనిది. ప్రపంచంలోకెల్లా సంపన్నమైన హిందూ దేవాలయమనుకునే తిరుమల దేవస్థానంలోనే ఇవాళ రోజువారి హుండీ వసూళ్లను చూసుకుని గాని చెల్లింపులు చేయలేని పరిస్థితి. ఏ కారణం చేతయినా ఒక వారం రోజులు సామాన్య భక్తులు హుండీల్లో సొమ్ము వేయకపోతే మొత్తం రాష్ట్రంలోనే దేవాదాయ శాఖ గుడ్లు తేలవేయక తప్పదు. గుడి లార్డుల మనుగడకు ఆక్సిజన్ సిలిండరు లాంటి హుండీనే ఈ సత్తెకాలపు పూజారయ్య అవతలికి నెట్టారు. పైగా తమ ఆలయంలో ఎండోమెంట్సు ఆఫీసర్లయినా, ఎంతటి వి.ఐ.పిలైనా ఎవరికీ ప్రత్యేక మర్యాదలు ఉండవనీ, భక్తులందరికీ ఒకటే ఏర్పాటనీ, ఎవరయినా క్యూలో వెళ్లి దర్శనం చేసుకోవలసిందేనని ఇంకో రూలు పెట్టారు. గుడి గొడవలకు సంబంధించినంతవరకూ ఇది ప్రపంచంలో ఎనిమిదో వింత. దేవుడికి అందరూ సమానులే కావొచ్చు గాని దేవాలయాధికారుల దృష్టిలో కొంతమంది ఎక్కువ సమానులు. వి.వి.ఐ.పి. దొరలు వేంచేస్తే చాలు ఎక్కడి క్యూ అక్కడ ఆగిపోవలసిందే. వారికి సకల రాచమర్యాదలు జరిగి తీరవలసిందే. వారు ఎప్పుడు వచ్చినా వేళాపాళా చూడకుండా దేవుడు దర్శనం ఇవ్వాల్సిందే. ఇది సర్కారీ ఆలయ పాలనా వ్యవస్థలో అప్రకటిత రెండో సూత్రం. హుండీలు, టిక్కెట్లు, వి.ఐ.పి. దర్శనాలు లేని దేవాలయాన్ని ఊహించడమే కష్టమైన స్థితిగతుల్లో దేవాదాయ సంస్కృతికి ఏవైతే విరుద్ధమో వాటినే ఆయుధాలుగా ధరించి దేవాదాయ శాఖ పెత్తనంపై పోరాటానికి ఒక సాధారణ అర్చకుడు పెద్ద ఉద్యమమే లేవదీయడం బహుశా రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగనిది. గతంలో ఎండోమెంట్సు డిపార్టుమెంటు నోటపడ్డ ఇతర దేవాలయాల నిర్వాహకుల్లా ప్రభుత్వంతో తలపడేందుకు శక్తి చాలదని వెరచో, పర్యవసానాలకు భయపడో, దేవుడి మీదే భారమంతా వేసో సౌందరరాజన్ కూడా నిట్టూర్చి కూలబడి ఉంటే చిలుకూరు కథ మిగతా గుళ్లలాగే సాగేది. దేవస్థానం సమస్య ఆ దేవస్థానంలోని వారు తేల్చుకోవలసిందే తప్ప దేవుడి మీద వదిలేసి ఊరుకోవలసిన విషయం కాదనీ... ముందుగా మనం కదిలితే ఆ వెంట దేవుడు కూడా కదిలి అండగా నిలుస్తాడనీ నమ్మి సౌందరరాజన్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగడంతో చరిత్ర గతి మారింది.

అద్భుతమే జరిగింది.

అంతకు ముందు వరకూ చిలుకూరు గుడికి రోజూ వందల సంఖ్యలోనే జనం వెళ్లేవారు. ఆదివారాలు, సెలవుదినాల్లో మాత్రమే కాస్త రద్దీ కనిపించేది. మామూలు రోజుల్లో భక్తుల రాక పలచగా ఉండేది. అలాంటిది కాస్తా - డిసెంబర్ 8న హుండీ ఎత్తివేత నిర్ణయం ప్రకటించిన మర్నాటి నుంచే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. వందల సంఖ్య కాస్తా హఠాత్తుగా వేలల్లోకి వెళ్లింది. మామూలు రోజుల్లో పది పదిహేను వేలకు, సెలవు రోజుల్లోనైతే పాతిక ముప్పైవేలకు తగ్గకుండా ఎక్కడెక్కడి నుంచో జనం ప్రవాహంలా వస్తున్నారు. వచ్చిన వారంతా గుడికి వచ్చిన ముప్పు గురించి అర్చకులు సవిస్తారంగా చెప్పేది వింటూ, ఆలయ రక్షణ ఉద్యమానికి నైతిక మద్దతు ప్రకటిస్తూ వెళుతున్నారు. రోజురోజుకూ రద్దీ పెరిగి ఆలయ స్వాధీనాన్ని సామాన్య జనం బాహాటంగా నిరసించే కొద్దీ ప్రభుత్వానికి దూకుడు తగ్గింది. యాదగిరి గుట్టకు దత్తత నిర్ణయాన్ని విధిలేక రద్దు చేసుకుంది. రాష్ట్రంలో మరే ఆలయం విషయంలోనూ చేయని రీతిలో గుడి నిర్వహణలో అర్చకులకు అధికారులతో సమాన ప్రతిపత్తినిచ్చి ఇద్దరు ఎండోమెంట్సు అధికారులతో, (సౌందరరాజన్‌తో సహా) ఇద్దరు అర్చకులతో చిలుకూరు ఆలయ నిర్వహణ, అభివృద్ధికి ఈ ఫిబ్రవరిలో ప్రత్యేక కమిటీ ఏర్పరచింది. ఆ కమిటీ అధ్వర్యంలో ఇప్పటివరకూ వ్యవహారాలన్నీ సజావుగానే నడుస్తున్నాయి.

ఇక్కడ గమనించాల్సిన పాయింటొక్కటే. రాష్ట్రంలో 32వేల దేవాలయాలను ఒక్క కలంపోటుతో అవలీలగా తన కబ్జాలోకి తెచ్చేసుకుని ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వం చిలుకూరు గుడి విషయంలో వేసిన అడుగు ఎందుకు వెనక్కి తీసుకుంది? ఒక సౌందరరాజన్‌కు భయపడా? ఆ ఊరి పెద్దల వ్యతిరేకతకు జంకా? కాదు. ప్రతికూల ప్రజాభిప్రాయ తీవ్రతకు వెరచి! ఆ తీవ్రత ఎలా వచ్చింది? గతంలో వచ్చిన సంఖ్యలోనే ఇప్పుడు భక్తులొచ్చి, ఎప్పుడో తప్ప రద్దీలేక ఆలయం మునుపటిలా పలచగానే ఉన్నట్టయితే ఆ భక్తులు ఎన్ని తీర్మానాలు, ఎన్ని నినాదాలు చేసి, ఎంతగా మొత్తుకున్నా ప్రభుత్వం బేఖాతరు చేసేదే. ఉన్నట్టుండి ఊహాతీతంగా రద్దీ పెరిగి, నానాటికీ భక్తుల ప్రతికూలత ఎక్కువ కాసాగటంవల్లే అంత గొప్ప పాలక వ్యవస్థ పునరాలోచనలో పడింది. అసలు కీలకమైన ఈ ఆకస్మిక రద్దీకి కారణమేమిటి? హుండీ తీసేశారని విని వి.ఐ.పి. దర్శనాలు లేవని తెలిసే ఇన్ని వేల మంది కొత్తగా వస్తున్నారని చెప్పలేము. ఎందుకంటే అంతకు ముందు హుండీ ఉన్నా అందులో కానుకలు వేయాలన్న నిర్బంధం ఎప్పుడూ లేదు. గుడిలో రద్దీయే తగుమాత్రంగా ఉండేది కనుక విఐపిల తాకిడి గతంలో చాలా తక్కువ. కేవలం ఆలయాన్ని రక్షించుకోవాలన్న ధ్యేయంతోటే సొంత పనులు మానుకుని చిలుకూరు చేరేంత విశాల హృదయం సామాన్య భక్తులకు ఉందంటేనూ నమ్మలేము.

TRUST BOARD FOR CHILKUR TEMPLE

చిలుకూరు దేవాలయానికి ట్రస్టు బోర్డు



Sir these people also want to become Trustees for Chilkur Temple!

చిలుకూరు దేవాలయానికి వీళ్ళు కూడా ట్రస్టీలు కావాలట సార్!

మరి ఈ ఐదారు నెలల్లో భక్తుల తాకిడి నిర్ణయాత్మకంగా పెరిగి అరమైలు దూరం క్యూలు కడుతున్నారంటే.. ఏ ఆకర్షణలూ లేకపోయినా వేల సంఖ్యలో జనం విరగబడుతున్నారంటే కారణం ఒక్కటేనని సౌందరరాజన్ బల్లగుద్ది చెబుతారు. దేవుడి మహిమ! సామాన్య భక్తులకు ముఖ్యంగా కావలసింది గుడి బాగు కాదు. తమ కోరికలు తీరడం. ఈ దేవుడికి మొక్కితే చాలు ఏ కోరికయినా తీరుతుందన్న నమ్మకం ఈ కొద్ది నెలల్లో విపరీతంగా పెరిగింది. ప్రథమంగా పదకొండు ప్రదక్షిణలు కూడా చేయకుండా ఈ గుడికి రావాలని అనుకోగానే ఎక్కడెక్కడి వారికీ కోరికలు తీరుతున్నాయట. ఆ సంగతి వేనోళ్ల వ్యాపించి భక్తుల సంఖ్య ఊహాతీతంగా పెరుగుతున్నదట. ఇదంతా ఒకరు కావాలని చేయగలిగింది కాదు. మా ప్రార్థన విని, ఆలయాన్ని కాపాడు కోవాలన్న మా దృఢ దీక్షను మెచ్చి దేవుడు కదిలాడు కనకే, మా వెన్నంటి నిలిచాడు కనకే ఈ మాత్రం సాధించామని సౌందరరాజన్ అంటారు.

ఈ విషయం ఆలోచించాల్సిందే.

ఒక కల కనగానే తెలవారనట్టు ఒక ప్రభుత్వ నిర్ణయం రద్దుతోటే చిలుకూరు గుడికి గవర్నమెంటు బెడద సమసిపోలేదు. ఏడాది కోసమని చెప్పి డెవలప్‌మెంట్ కమిటీని వేసి మూణ్నెల్లు తిరక్కుండా రాష్ట్ర ప్రభుత్వం చిలుకూరు గుడి మీద ట్రస్టు బోర్డును తెచ్చి రుద్దబూనింది. ట్రస్టు బోర్డు అనగా రూలింగ్ పార్టీ అసాములు, పార్టీ రాజకీయాలు, అవాంఛనీయ ప్రభావాలు వచ్చి ఆలయ పవిత్రతను కలుషితం చేయడమేనన్నది అనుభవంలో నిగ్గుతేలిన నిజం. కాబట్టి ఈ రూటులో వచ్చిన సర్కారీ కుయత్నాన్నీ పడనివ్వరాదని సౌందరరాజన్ బృందం ఇప్పుడు శాయశక్తులా పోరాడుతున్నది.

దీని ఫలితం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

(ఆంధ్రభూమి, ఆదివారం 9-6-2002)

## 8

# ఇదే ఆఖరి పోరు!!

# విజయం లభించే వరకు ఆగని పోరాటం!!!

"మే 1న చిలుకూరు దేవాలయానికి ట్రస్టు బోర్డుకు దరఖాస్తులు చేసుకోవడానికి ఒక ప్రకటన విడుదల చెయ్యడం జరిగింది......" చెప్పడం ప్రారంభించాడు మహేందర్.

"చిలుకూరు అర్చకులకు మళ్ళీ ప్రజలను ఆశ్రయించి దేవాదాయ శాఖ కుట్రను బహిర్గతం చేయక తప్పలేదు అందుకే...." పెద్దగా ఏదో చెప్పబోయేటట్టు ఊపిరి పీల్చుకున్నాడు మహేందర్.

"..... సౌందరరాజన్‌గారు, వారి తమ్ముడు గోపాలకృష్ణ గారు కలిసి విడుదల చేసిన పత్రికా ప్రకటన ఇంక పత్రికల స్పందన నేను చదువుతానిప్పుడు...." కొనసాగించాడు మహేందర్.

ఆ గదిలో ఉన్న మిగతా ముగ్గురు దీన్ని ఆసక్తిగా వింటున్నారు.

## పత్రికా ప్రకటన

*చిలుకూరు బాలాజీ దేవాలయం ఎన్నో సంవత్సరాలుగా వంశపారంపర్య అర్చకులచే నిర్వహించబడుతున్నది. వ్యాపారీకరణకు విరుద్ధంగా ఆలయం నిర్వహించాలనే ఆశయసాధనకై ఈ అర్చకుల యొక్క అంకితభావం, కృషి వేలాది భక్తుల మరియు ప్రభుత్వం యొక్క ప్రశంసలను పొందేలా చేసింది. ఇటువంటి కృషికి భగవంతుడు కూడా ప్రసన్నుడైనాడనుటకు నిదర్శనంగా, ఇక్కడ భక్తులపై అపరిమితమై ఆశీస్సుల వర్షం కురిపిస్తున్నాడు.*

*ఈ ఆలయానికి ఫిబ్రవరి మాసం 2002లో ఒక మానేజ్‌మెంటు కమిటి మరియు డెవలప్‌మెంటు కమిటి నియమించబడింది. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు మరియు చిలుకూరు ఆలయ అర్చకులు కలిసి ఒక సంవత్సరంపాటు ఆలయం నిర్వహించాలని ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం. 1987 దేవాదాయ చట్టం అమలు తరుపాత, అర్చకులను ఒక కమిటిలో నియమించడం ఇదే మొట్టమొదటిసారి. ఇటువంటి నిర్ణయం ఎందరో భక్తుల ప్రశంసలు పొందింది. సరైన మార్గంలో ప్రయాణించడానికి ఇది మొట్టమొదటి అడుగుగా భక్తులు దీనిని పరిగణించారు. ఈ సంవత్సర బ్రహ్మోత్సవాలు కూడా అత్యంత సమర్థవంతంగా నిర్వహించబడ్డాయి.*

*మే మాసం 1వ తారీఖున, ఆశ్చర్యకర చర్యగా ఈ ఆలయానికి ఒక ట్రస్ట్‌బోర్డును నియమించవలసిందంటూ ప్రభుత్వం ఒక నోటిఫికేషను జారీ చేసింది.*

*అధికారికంగా చూస్తే ట్రస్ట్‌బోర్డు కంటే, మ్యానేజమెంటు కమిటి అత్యంత సమర్థవంతమైనది. ఈ మానేజమెంటు కమిటీలో దేవాదాయ శాఖకు చెందిన అనేక అధికారులు పాల్గొంటారు. ఆలయం యొక్క ప్రత్యేకతను దృష్టిలోనికి తీసుకొని ఏర్పాటు చేయబడ్డ కమిటి ఉండగానే, ట్రస్ట్‌బోర్డు నియామకం గురించి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అత్యంత ఆశ్చర్యదాయకం. ప్రభుత్వం యొక్క నిర్ణయంలోని ఈ మార్పుకు కారణం ఏమిటి?*

*వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ఈ ఆలయం నిర్వహించబడుతున్నది. ఇందులో భాగంగా దర్శనానికి టిక్కెట్లు లేకపోవడం, హుండి నిలిపివేత మరియు దైవం ముందు అందరు సమానులే అన్నట్టుగా భక్తులందరిని సమభావంతో చూడడం. మొదలగు విజయవంతమైన పై నిర్ణయాలు దేవాదాయ శాఖకు బాధింపు చర్యగా ఉన్నాయనడానికి*

నిదర్శనమే పై ట్రస్ట్ బోర్డు నియమించాలనే ఉత్తర్వుకు కారణంగా తోస్తున్నది. భక్తులలో సమానభావం చూపడం మరియు వ్యాపారీకరణకు విరుద్ధంగా ఉండటం వేరే ఆలయాలపై కూడా ప్రభావం చూపగలదని ప్రభుత్వం యొక్క భయం కాబోలు.

**మరి దీనికై తీసుకోవలసిన చర్య ఏమిటి?**

ఈ ఆలయానికై ప్రత్యేకంగా నియమించబడ్డ మానేజిమెంటు కమిటీని కొనసాగించుటలో ప్రభుత్వం వెనుకంజ వేసింది. ఇందుకు నిరసనగా, ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాన్ని గుర్తించక పోవడం తప్ప వేరే గత్యంతరం లేదు. ఆలయం పూర్వంలాగానే నిర్వహించవలసినదిగా నిర్ణయం తీసుకోవడమైనది. క్షణ చిత్తంగా మారే ప్రభుత్వ నిర్ణయాలకు తలవంచితే, మన రాష్ట్రంలోని వేల దేవాలయాల లాగా మన ఈ చిలుకూరు దేవాలయం కూడా మూసివేతకు గురి అవుతుంది. మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకై, ఆలయ వ్యవస్థ పునరుద్ధరణకై పాటుపడుతున్న చిలుకూరు దేవాలయం ప్రభుత్వం చేతిలో బలిపశువుగా నిలబడింది. ప్రభుత్వం యొక్క ఇటువంటి చర్యను కొనసాగించనిస్తే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆలయ వ్యవస్థకు ఇక భవిష్యత్తు వుండదు, వర్తమానం మిగలదు.

భక్తులందరికి ఈ సందర్భంగా చేసే విజ్ఞప్తి ఏమంటే, 2002 మే మాసం 8వ తారీఖునాడు (ఏకాదశి) భగవంతుడిని ఆలయాలలో ధర్మదర్శనంలో మాత్రమే దర్శించుకోవాలని, టిక్కెట్లు కొని చేసుకునే ఎటువంటి (అర్జిత సేవలతో సహా) పూజలకై ఈ ఒక్కరోజు దూరంగా ఉండాలని కోరుతున్నాము.

భక్తుల నుండి వచ్చే ఇటువంటి స్పందన, భవిష్యత్తులో తీసుకోవలసిన నిర్ణయాలకు పునాది కాగలదని మా విశ్వాసం. భక్తులు ఇచ్చే ఇటువంటి చేయూత, ఆలయ వ్యవస్థను పునరుజ్జీవింప చేసి గత వైభవం తిరిగి తీసుకురావడానికి దోహదపడుతుందని మా గట్టి నమ్మకం.

ఇట్లు

**డా॥ యం.వి. సౌందరరాజన్**

**సి.యస్. గోపాలక్రిష్ణ**

తేది : 6-5-2002 వంశపారంపర్య అర్చకులు శ్రీ బాలాజీ టెంపుల్,

చిలుకూరు

**నోటు :** ఈ పత్రికా ప్రకటన 6-5-2002 నాడు NSS లో జరిగిన విలేఖరుల సమావేశంలో అందించబడినది.

## చిల్కూరు ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

ఆంధ్రభూమి హైదరాబాద్, మే 6: దేవాలయాలను వ్యాపార దృక్పథంతో నిర్వహించే విధానాన్ని విడనాడాలని చిల్కూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు ఎం.వి. సౌందర్‌రాజన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రంగారెడ్డి జిల్లా చిల్కూర్ బాలాజీ దేవాలయానికి ట్రస్టు బోర్డును ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మే 1వ తేదీన ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 17వ తేదీన దేవాదాయ శాఖ దేవాలయం వ్యవహారాలను పర్యవేక్షించడానికి తనతోపాటు మరో వంశపారంపర్య ధర్మకర్త సి.ఎస్.గోపాలకృష్ణన్, ఇద్దరు అదనపు కమీషనర్లు, ఒక అసిస్టెంట్ కమీషనర్‌తో ఒక మేనేజిమెంట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ దేవాలయ అభివృద్ధి కోసం తగిన చర్యలు చేపట్టిందన్నారు. గత నాలుగు నెలల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రథోత్సవం, ఇతర కార్యక్రమాలను కమిటీ నిర్వహించిందన్నారు. చిల్కూరు బాలాజీ దేవాలయం వ్యాపారాత్మకంగా నిర్వహించడం లేదనే పేరు రాకుండా ఉండేందుకు హుండిని తొలగించడం, దర్శనానికి టిక్కెట్ పద్ధతిని రద్దుచేయడం లాంటి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ విధానాల పట్ల భక్తులు కూడా హర్షం వ్యక్తం చేసారన్నారు. కమిటీ నిర్వహణ సజావుగా సాగుతున్న తరుణంలో ట్రస్టుబోర్డును ఏర్పాటు చేసి దేవాలయ వ్యవహారాలను రాజకీయం చేయాలని దేవాదాయ శాఖ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. దేవాలయ వ్యవహారాలను పర్యవేక్షించడానికి మేనేజిమెంట్ కమిటీ ఉండగా, కొత్తగా ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయడమెందుకని ఆయన ప్రభుత్వాన్ని నిలదీసారు. దేవాలయంలో హుండీని తొలగించడం, దర్శనానికి టిక్కెట్ పద్ధతిని రద్దు చేసిన తర్వాత ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. ఈ విధానాల ప్రభావం ఇతర దేవాలయాలపై పడుతుందనే భయంతోనే ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న కమిటీని రద్దు చేసేందుకు నోటీసు జారీ చేసి ఉండవచ్చునని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన ఏకాదశి సందర్భంగా భక్తులు దేవాలయాల్లో దర్శనం టిక్కెట్లను, ప్రత్యేక పూజ టిక్కెట్లను కొనకుండా దేవాలయాలను వ్యాపారాత్మకంగా నిర్వహించే పద్ధతిని వ్యతిరేకించాలని సౌందర్‌రాజన్ కోరారు. చిల్కూరు బాలాజీ దేవాలయానికి ట్రస్టు బోర్డును ఏర్పాటు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసారు.

(ఆంధ్రభూమి 7.5.2002)

**'చిలుకూరు బాలాజీ మందిరానికి ట్రస్ట్ బోర్డు వద్దు'**

నింబోలిఅడ్డ, మే 6 (న్యూస్‌టుడే) : ప్రశాంత వాతావరణంలో భక్తుల పూజలు పొందుతున్న చిలుకూరు బాలాజీ మందిరానికి వ్యాపారీకరణ లక్ష్యంతో ట్రస్ట్ బోర్డును నియమించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆలయ అర్చకులు ప్రొఫెసర్ యం.వి. సౌందరరాజన్ సూచించారు. ట్రస్ట్‌బోర్డు నియామకానికి కారణమౌతున్న 30/87 దేవాదాయ చట్టాన్ని పూర్తిగా తొలగించడం ద్వారా రాష్ట్రంలో ఉన్న దేవాలయాలన్నీ అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. నగరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆలయ అర్చకులు సి.ఎస్. గోపాలకృష్ణ, లక్ష్మీనరసింహన్ తదితరులతో కలిసి మాట్లాడుతూ బాలాజీ మందిరానికి 2002 ఫిబ్రవరిలో పలువురు అధికారులు, అర్చకులతో మేనేజ్‌మెంట్ కమిటీ వేశారని, కాగా మే 1వ తేదీన ఆలయానికి ట్రస్ట్ బోర్డు నియమించాలని దేవాదాయ శాఖ నోటీసు జారీ చేసినదని వివరించారు. (ఈనాడు 7.5.2002)

"ఇంకా ఇండియా టుడేలో ఏ. రామమోహన్ గారు పరిణామాలను '**కోవెల కోసం పోరాటం**' అనే వ్యాసంలో క్రోడీకరించారు..." చదవడం మొదలు పెట్టాడు ఇర్ఫాన్.

....... ఈ ఆలయానికి చెందిన విలువైన మూడు వందల ఎకరాల భూములను ఇప్పటికే ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. ప్రస్తుతం ప్రాచీన మందిరం, మరో పాతకాలం నాటి నాలుగైదు కట్టడాలు, వాటి చుట్టూ పది ఎకరాల స్థలం మాత్రం మిగిలి ఉన్నాయి. అర్భాటాలు అడుగడుగునా టిక్కెట్లూ, దేవుడికి సేవల పేరిట వసూళ్ళు సాగే మందిరాలకు భిన్నంగా ఏరకమైన ఆర్థిక లావాదేవీలకూ ఆస్కారం లేని విధంగా పనిచేస్తున్న చిలుకూరు దేవాలయం పట్ల భక్తుల్లో గట్టినమ్మకం ఉంది. ఈ మందిర ప్రత్యేకతను పరిరక్షించేందుకు స్థానికులు, భక్తులు, వంశపారంపర్య అర్చకులు సమైక్యంగా ప్రభుత్వ చర్యలను అడ్డుకొంటున్నారు. ఇరువర్గాలు పట్టుదలగా వ్యవహరిస్తుండడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారుతోంది.

రాష్ట్రంలోని 34,000 ఆలయాలలో 32,000 ఆలయాలు పూజా పునస్కారాలకు డబ్బు లేక మూతపడి ఉన్నాయి. రాష్ట్ర దేవాదాయ చట్టానికి 1987లో మార్పులు చేసి రూపొందించిన చట్టం (30/87) ఇందుకు ప్రధాన కారణం అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈచట్టం ఆలయాలను సక్రమంగా నిర్వహించేందుకు తోడ్పడక పోగా, ఆ ఆలయాలకు వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని కూడా రకరకాల పేర్లతో ప్రభుత్వం తీసుకొనేందుకు, అధికారులు అరగించేందుకు కారణం అవుతోందన్నది ఆరోపణ. ఈ విధంగా దేవాలయాల ఆస్తులపైనే తప్ప వాటిలో ఆరాధనల పైన దృష్టిలేని ప్రభుత్వ విధానాల వల్ల హైదరాబాద్‌లో, చుట్టు పక్కల ఉన్న సీతారాం బాగ్, జాంబాగ్,

కిషన్‌బాగ్, అల్వాల్ వంటి ప్రదేశాల్లోని చారిత్రక మందిరాలు పోషణ లేక మసిబారిపోతున్నాయి. రాష్ట్రం మొత్తం మీద కేవలం 2,000 ఆలయాలలో మాత్రమే ప్రస్తుతం నిత్య పూజలు జరుగుతున్నాయి. వీటి ద్వారా లభించే ఆదాయమే దేవాదాయ శాఖకు ఆధారం. ఈ కన్సాలిడేటెడ్ ఫండ్‌ను, ఆపైన దేవాదాయ, ధర్మాదాయ నిధులకు తరలిస్తున్నారు.

కాస్త ఆదాయం పెరిగిన ప్రతి ఆలయాన్నీ స్థానిక ధర్మకర్తల నిర్వహణ నుంచి దేవాదాయ శాఖ అధికారుల అజమాయిషీలోకి మారుస్తున్నారు. ఆదాయం చూసి దేవాలయాల నిర్వాహణను తీసుకొనే విధానం, వాటి వర్గీకరణ అవకతవకలకు దారి తీస్తోంది. ఆ చట్టంలో కార్యనిర్వాహక అధికారి (ఇ.ఓ.) కి అపార అధికారులు కట్టబెట్టడం భారీయెత్తున అవినీతికి కారణం అవుతోంది.తాజాగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ ఒకరి ఇంట్లో రూ. 2.5 కోట్లు లెక్కకు రాని సంపాదన బయటపడి ఆ శాఖ పరువును మరింత దిగజార్చింది.

అనేక ప్రత్యేకతలు కలిగిన చిలుకూరు మందిరం రెండు మూడేళ్ళుగా భారీ సంఖ్యలో భక్తులను ఆకర్షిస్తోంది. దీన్ని స్వాధీనం చేసుకోవడానికి తొలిచర్యగా గత ఏడాది నవంబర్ 29న ఈ గుడిని యాదగిరి గుట్ట నరసింహస్వామి ఆలయానికి దత్తతనిస్తునట్లు ప్రకటించారు. ఇద్దరేసి చొప్పున అధికారులు, అర్చకులతో మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆపైన అధికారులసంఖ్యను మూడుకు పెంచి ఇద్దరు అర్చకులతో కలిపి అభివృద్ధి కోసం అంటూ ఓ డెవలప్‌మెంట్ కమిటీని నియమించారు తాజాగా మే మొదటి తేదీన ట్రస్ట్‌బోర్డ్ ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు.

దీనిపట్ల భక్తులు, స్థానికులు, అర్చకుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆలయాన్ని కాపాడుకోవడానికి చిలుకూరు ప్రాంత ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర అర్చక సమాఖ్య కలిసి ప్రయత్నిస్తున్నాయి. "ఈ నోటిఫికేషన్ జారీ ప్రశాంతమైన ఆలయంలో రాజకీయాలను ప్రవేశపెట్టే చర్య. చక్కగా పని చేస్తున్న మేనేజ్‌మెంట్ కమిటి ఉండగా ట్రస్ట్‌బోర్డ్ ఎందుకు? పాలక పక్షం పదవులు పంచిపెట్టడం తప్ప దీనివల్ల దేవాలయానికి జరిగే మేలు ఏముంటుంది? "అని రాష్ట్ర అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు,చిలుకూరు ఆలయ అనువంశిక అర్చకుల ప్రతినిధి అయిన ప్రొఫెసర్ ఎం.వి. సౌందరరాజన్ ప్రశ్నించారు. తమిళనాడులోని మధురాంతకానికి చెందిన ఈయన వంశీకులు గడచిన 300 ఏళ్ళుగా ఇక్కడ అర్చకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

అర్చక సమాఖ్య వాదనకు స్థానిక నాయకులు గట్టిగా మద్దతునిస్తున్నారు. "ఈ గుడి నిర్వహణను దేవాదాయ శాఖకు అప్పగించడానిక ఇక్కడి ప్రజలు పూర్తిగా వ్యతిరేకులు. అధికారులు ప్రవేశిస్తే అంతా వ్యాపారమే" అని ఎం.పి.టి.సి (హిమాయత్‌నగర్)

సభ్యుడు గుండు గోపాల్ చెప్పారు.భక్తులు ఇచ్చే కానుకల ద్వారా లభిస్తున్న ఆదాయం కోసమే తాము చిలుకూరు ఆలయంలో దేవాదాయ శాఖ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్నామన్న అధికారుల ఆరోపణలోని డొల్లతనాన్ని వెల్లడి చేసేందుకు గత డిసెంబర్‌లో నుంచి హుండీని తీసేశారు. గుడిలో ఎవరికీ, ఎటువంటి కానుకలూ ఇవ్వవద్దని. స్వామికి ముడుపులు సమర్పించవద్దని ప్రకటించి కచ్చితంగా అమలుచేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేసిన చిలుకూరు గ్రామ మహిళా సర్పంచ్ నక్షత్రం గత నెలాఖరున బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు దేవుడి రథం పైన కూర్చున్న సందర్భంలో గతంలో ఎన్నడూలేని విధంగా పదివేలకు పైగా స్థానికులు ఆ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వివాదానికి సంబంధించి కోర్టుకు వెళ్ళే అవకాశం గురించి ప్రశ్నించినప్పుడు, "తప్పు చేసింది దేవాదాయ శాఖ. అందుకే మేం ఆ ఆదేశాన్నే గుర్తించడం లేదు. వారు కోర్టుకు వెళితే వెళ్ళనీయండి. న్యాయమూర్తి సమక్షంలో సమాధానం చెబుతాం" అని సౌందరరాజన్ అన్నారు.

భక్తుల్లో కూడా ఆలయ నిర్వహణను దేవాదాయ శాఖకు అప్పగించే విషయంలో వ్యతిరేకతే ఉంది. " ఆదాయం పెరిగింది కదాని ఆలయాల్ని స్వాధీనం చేసుకోవడం కాదు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఆలయ నిర్వాహకులు అభివృద్ధికి చర్యలు తీసుకొనేట్లు చూడాలి" అని సింగరేణి కాలరీస్‌లో వర్క్ ఇన్‌స్పెక్టరుగా పని చేస్తున్న యుగావర్త మూర్తి అన్నారు. "ప్రభుత్వ నిర్వాహణ అంటే రాజకీయ నాయకుల దర్ప ప్రదర్శన. అధికారుల అహంభావ పూరిత అజమాయిషీ, సామాన్య భక్తుల పట్ల నిర్లక్ష్యం ప్రధాన దేవాలయాలు అన్నిట్లో దీనిని చూస్తూనే ఉన్నాం. కనీసం దీన్నయినా ఆ కాలుష్యానికి దూరంగా ఉండనీయండి" అని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎస్. చైతన్య కోరారు. వి.ఐ.పిల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు లేని చిలుకూరును ప్రజాస్వామ్యబద్ధమైన ఆలయంగా ఆయన అభివర్ణించారు. " ఆలయాల నిర్వహణలో ప్రభుత్వ అధికారుల కంటే ప్రైవేట్ నిర్వాహకులే మేలు. పాపభీతితో వ్యవహరిస్తారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటారు." అని హిందుస్థాన్ కేబుల్స్ (హెచ్.సి.ఎల్) ఉద్యోగి కె.ఎస్.వి. రామకృష్ణ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. కృష్ణవేణి ఇలా అన్నారు "గుళ్ళ యాజమాన్యంలో భక్తి భావన, నిజాయతీ ముఖ్యం. కనీసం దేవుడి మందిర ఆవరణలో నీతి నిజాయతీలతో వ్యవహరించకపోవడం అంటేప్రజల విశ్వాసాల్ని చిన్నబుచ్చడమే అవుతుంది." దేవాదాయ శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచకుండా అధికారబలంతో బలవంతంగా మందిరాల నిర్వహణను స్వాధీనం చేసుకొన్నా, ప్రజల నుంచి మరింత వ్యతిరేకతను ఎదుర్కోవడం తప్పించి ప్రభుత్వం సాధించగలిగిందేమీ ఉండదనడంలో సందేహం లేదు.

(జూన్ 2002, ఇండియాటుడే)

"అసలు చెప్పాలంటే, మే 2002 తరువాతనే చిలుకూరు ఉద్యమం ఒక దిశగా పయనించసాగింది. అవునా?----- "ప్రశ్నించారు 'గురు'. "సార్, ఈ పరిణామాలను చూస్తుంటే, 30/87 ఎండోమెంట్ చట్టం ఎటువంటి అవకతవకలు లేకుండా నడిచే చిలుకూరు లాంటి దేవాలయంలో ఎంతటి ప్రళయాన్ని సృష్టించిందో చూడవచ్చు." మహెందర్.

"గురు" అందుకే 30/87 చట్టాన్ని కొట్టేయడానికి ఒక దేవాలయాల పరిరక్షణ ఉద్యమమే మొదలెట్టబడింది, చిలుకూరు నుంచి." పల్లవి చెప్పసాగింది.

"దాని గురించి ఎక్కడా వెలువడలేదుకదా?! ఇదేదో కొత్తగా ఉందే?!" ఆశ్చర్యపడ్డారు 'గురు'.

"సార్, మీరడుగుతారని తెలుసు, అందుకే సౌందరరాజన్ గారు ఇచ్చే ప్రవచనాన్ని ఈ క్యాసెట్‌లో రికార్డ్ చేసాను. వినండి." ఒక చిన్న టేప్ రికార్డర్‌లో ఆ క్యాసెట్‌ను ప్లే చేయసాగింది పల్లవి.

"భక్తులకు మనవి ---" సౌందరరాజన్ గొంతు వినబడసాగింది. అప్పటి వరకు వారు కూర్చున్న గదిలో ఒక ఫ్యాన్ తిరుగుతున్న చప్పుడు వినిపించేది. ఇప్పుడు ఫ్యాన్‌ని కూడా కట్టేయ్యమన్నారు 'గురు'. గదిలో నిశ్శబ్దం.

"---- మన ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 34,000 దేవాలయాలున్నాయి. అందులో దాదాపు 32,000 దేవాలయాలు క్షీణించి పోయి దీపంకూడా లేకుండా మూతబడే స్థాయిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న దేవాలయాలు అన్నీ మూతబడ్డాయి. దీనికి కారణం ఆ చట్టం. రాక్షసత్వమైన ఆ చట్టాన్ని మార్చండి అని ఎన్నిసార్లు చెప్పినా ఈ రాజకీయనాయకులు వినలేదు. అందుకే ఈ సారి ఎన్నికల మ్యానిఫేస్టోలో ఖచ్చితంగా దేవాలయాల గురించి మీ ధోరణి ఎంటో స్పష్టం చేయండని అన్ని రాజకీయ పార్టీలకు విన్నవించాం----" టేప్‌ని ఆఫ్ చేసారు 'గురు'.

"పల్లవి, నీవు ఈ అర్చకులకు చాలా సన్నిహితం కదా? ------"

"అవును సార్. ఎందుకు? ---"

"సౌందరరాజన్‌గారు అన్ని రాజకీయ పార్టీలగురించి చెబుతున్నారు కదా, అది ఎలా?-----"

" సార్, **Temples Protection Movement** (దేవాలయ పరిరక్షణ ఉద్యమం) లో భాగంగా భక్తులు, 'వాక్' పత్రిక కలిసి ఒక సంతకాలసేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 30/87 చట్టం పోవాలని 10 లక్షలకు పైన సంతకాలు పోస్టు కార్డులు వచ్చాయి. ప్రజాభిప్రాయం ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉందని ఈ అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలలో

చేర్పండి అని అన్ని రాజకీయ పార్టీలకు సౌందరరాజన్ వ్యక్తిగతంగా లేఖ వ్రాసి ఆయా పార్టీల నేతలను కలిసి వివరించడం కూడా చేశారు. --" 'గురు' ఆపమని సైగ చేస్తే పల్లవి చెప్పడం ఆపింది.

"పల్లవి, నా కర్థమైంది. ఇక్కడ కూడా ఒక్కపార్టి తప్ప అన్ని ప్రధాన పార్టీలు ఈ చట్టాన్ని సవరించడానికి సుముఖత చూపాయి. కాంగ్రెస్, మరియు భాజపా ఏకంగా మ్యానిఫెస్టోలో చేర్పింది కూడా. అవునా?---"

"ఇంకొక విషయం సార్, వై.యస్. రాజశేఖర్ రెడ్డిగారు తమ జైత్ర యాత్ర చేవెళ్ళలో మొదలు పెట్టేముందు చిలుకూరు వచ్చారు. స్వామి దర్శనం చేసుకొనే సమయంలో ఈ చట్టాన్ని సవరించేలా చర్యతీసుకుంటానని స్వామి ముందు వాగ్దానం కూడా చేశారు. అదే రోజు మ్యానిఫెస్టో హైదరాబాద్‌లో పిసిసి అధ్యక్షుడైన డి. శ్రీనివాస్‌గారు విడుదల చేశారు. అందులో ఈ చట్టాన్ని సవరిస్తామనే అంశం కూడా పొందుపరచారు---"

"స్వామి అనుగ్రహంతోనే గెలిచామని పల్లెబాట మొదలు పెట్టడం కూడా ముఖ్యమంత్రి, YSR గారు చిలుకూరులో దర్శనం చేసుకొని మొదలుపెట్టారు. మహేందర్.

"చిలుకూరు దేవాలయంలో సౌందరరాజన్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతు ఈ విషయంలో ఎవరైనా అడ్డు వస్తే తనను కలువండి అని కూడా చెప్పారు. తాము ఈ చట్టసవరణను మరచిపోలేదని తప్పక చర్య తీసుకుంటామని మళ్ళీ వాగ్దానం చేశారు కూడ--" చెప్పింది పల్లవి.

"అప్పట్నుంచి పనులు చకచక జరిగి పోతూనే ఉన్నాయి. అసెంబ్లీలో దేవాదాయశాఖ మంత్రిగారు గౌరవనీయులు MSR- గారు అఖిలపక్షాన్ని పిలుస్తామనడం, అఖిలపక్ష సమావేశం అక్టోబరులో జరగడం, చట్టంలోని వివాదాంశాలను మార్చాలని నిర్ణయించడం అన్నీ జరుగుతున్నాయి..."

"ఆశ్చర్యమేమంటే.... అసెంబ్లీలో కాని, సచివాలయంలో కాని, ఈ చట్టానికి సంబంధించిన ఫైళ్ళను చిలుకూరు ఫైళ్ళనే పిలుస్తున్నారు." చెప్పింది పల్లవి.

"సార్ నేనప్పుడు శాసనసభను సమీక్షించే విలేఖరిగా ఉన్నాను...." చెప్పసాగాడు మహేందర్. ".... నేనొకటి గమనించాను. ప్రతి పార్టీలోని శాసనసభ్యుడు ఈ చట్టం వల్ల (30/87) ఏమాత్రం లాభం జరుగలేదనే భావనతో ఉండినారు. సభాధ్యక్షులు శ్రీ సురేష్ రెడ్డిగారు కూడా ఒక షార్ట్ నోటీస్ ప్రశ్నకు ఇంతటి స్పందన వస్తే చర్చను అడ్డగించకుండా కొనసాగనిచ్చారు. దేవాదాయ శాఖమంత్రి శ్రీ యం. సత్యనారాయణ రావు గారు కూడ అఖిల పక్ష సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేసి అవసరమైతే చట్టాన్ని సవరిస్తామని సభలో వాగ్దానం కూడ చేశారు."

"నీవు చెప్పేది చూస్తే ఈ తిరుగుబాటు, దేవాలయాలలో వ్యాపారీకరణకు వ్యతిరేకమైన ఉద్యమం, అసెంబ్లీలో చర్చ, చట్ట సవరణకు సంబంధించిన ప్రతిపాదనలు .... అన్నీ చిలుకూరు బాలాజి లీలలే....." అన్నారు 'గురు'.

"సార్ డ్రైవర్ రెడీ....!" అంటూ వాచ్‌మెన్ గదిలోపలికి వచ్చి 'గురు'కు నమస్కరించి నిలబడ్డాడు.

"చిలుకూరు వెళ్ళామని ప్రొద్దున్నే ఒక కార్‌ను రెడీ చేయండి అని చెప్పాను. నాతో మీరెవరైనా వస్తారా?!" అడిగారు 'గురు'.

"అందరం వస్తాం సార్" బృందం బయలుదేరింది.

"ఈ కవర్‌లో కొన్ని అనుభవాలు ఉన్నాయి, దారిలో వెళ్తూ చూద్దాం."

"సార్, ఇంకా కొంతమంది భక్తులు తమ అనుభవాలను కూడ చెప్పారు. ఆ అనుభవాలను కూడా నేను ఇక్కడ జతపరిచాను..." ఒక కవర్‌ను తెరుస్తూ చెప్పాడు మహేందర్.

౨

## స్వామి లీలల్లో కొన్ని....

ఆ కవర్‌లో కొన్ని అనుభవాలను మెల్లిగా తీసి చదవసాగాడు.

చిలుకూరు బాలాజీ అనుగ్రహం - 1

### మా అబ్బాయి నడువగలిగాడు...

ఒకనాటి తెల్లవారుఝాము సమయం, చిలుకూరు దేవాలయ ప్రాంగణంలో ఒక స్త్రీ సజల నయనాలతో పూజారి దగ్గరకు వచ్చి తనకు జరిగిన అనుభవాలను, ఆ భగవంతుడు తనను, తన కొడుకునెలా అనుగ్రహించాడో అందరికీ తెలియజేయాలని ప్రార్థించింది. ఏడేళ్ళ వయస్సు కూడా నిండని ఆమె కొడుకు తల్లిని అమాయకంగా అనుసరించాడు. పూజారిగారు ఆ స్త్రీ చెప్పినదంతా శ్రద్ధగా ఆలకించి "అమ్మా! నీకు జరిగిన ఈ అద్భుతాన్ని భక్తులందరికీ ఈ మైక్ ద్వారా వినిపిస్తావా?" అని అడిగారు "తప్పకుండా స్వామి" అని ఆ స్త్రీ చెప్పింది.

"ఒకరోజు మా అబ్బాయి అకస్మాత్తుగా తను కాళ్ళను కదపలేక పోతున్నానని, నడవడం కూడా తనకు సాధ్యపడటం లేదని చెప్పాడు" అంటూ ఆ తల్లి ప్రారంభించింది.

"మా అబ్బాయిని వెంటనే ఇంటి దగ్గరి డాక్టరుకి చూపించాము. ఆ డాక్టరు ఈ

కేసు న్యూరో-ఫిజిషియన్ (Neuro-Physician) కి చూపించవలసిందిగా చెప్పారు. ఆయన చెప్పిన విధంగానే మేము ఆ స్పెషలిస్టుకి చూపించగా, ఆయన అబ్బాయి ఇకపై పూర్వంలా నడవలేడు అని చెప్పాడు. దుఃఖంలో మునిగిన మాకు మా శ్రేయోభిలాషులు ఆయుర్వేద వైద్యుని కలువమని చెప్పారు. చేసేదేమీలేక మేము అయుర్వేద వైద్యుని కూడా కలిసాము. ఆ వైద్యుడు అబ్బాయిని పరీక్షించి, జబ్బు నయం చేయవచ్చని కాని తగ్గడానికి చాలా సమయం పడుతుందని చెప్పారు. అలాగే మీరు చిలుకూరు బాలాజీని దర్శించండి అని చెప్పారు. వారి ఆలోచన మేరకు నేను ఇక్కడికి వచ్చి, బాలాజీ స్వామిని దర్శించి ప్రార్థించాను. అక్కడి నుండి మా ఇంటికి వెళ్ళి చూస్తే, ఇంటి దగ్గర నేను చూసిన దృశ్యం నన్ను ఆశ్చర్యపరచి, చకితురాలిని చేసింది, నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. ఆ మాతృమూర్తి తన కళ్లను తుడుచుకోవడానికి కొంచం సేపు ఆగింది. "నా కళ్ళు నన్ను మోసగిస్తున్నాయా...? అని ఒక్క క్షణం అనుకున్నాను. లేచి ఒక్క అడుగు కూడా వేయలేని నా చిన్నారి బాబు పరుగు పరుగున వచ్చి అమ్మా అని నన్ను కౌగలించుకున్నాడు. నోటమాట రాక నేను నిశ్చలంగా నిలుచుండి పోయాను. ఆహా! ఎంత కృప, ఎంత కరుణ, ఆ భగవంతుని దయకు నేను పాత్రురాలినయ్యాను అనే భావన. భవిష్యత్తు అంతా చీకటే అని భావించే తరుణంలో వెలుగు కాంతులు మా జీవితంలో పుష్కలంగా ప్రసరించాయి తీరిన కోరికతో పూర్ణ హృదయంతో నిండు మనసుతో ఈ బాలాజీకి 108 ప్రదక్షిణలు చేయడానికై వచ్చాను" అంటూ ఆ స్త్రీ కళ్లలో నీళ్ళు రాలుతుండగా తన కథను ముగించింది. వందలాది సంఖ్యలో భక్తులు ఈ ఉదంతాన్ని నిశ్చేష్టులై విన్నారు. ఆవిడ చెబుతున్నంత సేపు ఆవిడ అబ్బాయి, అక్కడే తల్లిచేయి పట్టుకుని నిలుచున్నాడు.

పూజారి ఈ ఉదంతం చాలాసార్లు భక్తులకు వివరించారు. భక్తులందరి కోరిక మేరకు ఇలాంటి అనుభవాలను ప్రచురించాలని నిర్ణయించుకున్నాము. అందుకు నాందిగా ఈ ఉదంతం.

చిలుకూరు బాలాజీ అనుగ్రహం - 2

**నాకు రావలసిన డబ్బు వచ్చేసింది...**

అది ఒకనాటి సాయంకాలం. సాయంకాల అర్చనకై, అర్చకస్వామి సంకల్పం తీసుకుంటున్నాడు. అక్కడికి చేరిన భక్తులంతా, అర్చన నిమిత్తం తమ పేర్లు,గోత్రాలు చెప్తున్నారు. కానీ ఇక్కడ జరుగుతున్నదంతా తనకు పట్టనట్టుగా ఆలయంలో ఒక మూలలోఒక మధ్యవయస్కుడు కూర్చున్నాడు. ఆయన తనలో తాను ఏదో గొణుక్కుంటూ అన్యమనస్కంగా, విచారంగా ఉన్నాడు. అందరిని అడిగినట్టుగానే అర్చకస్వామి, ఇతని పేరు, గోత్రము అర్చన చేయడానికి అడిగాడు. దానికి అతను పట్టనట్టుగా తన పేరు తన కుటుంబసభ్యుల పేర్లు చెప్పాడు.

జరిగినదంతా గమనిస్తున్న అర్చకుడు ఆ వ్యక్తి ఏదో కష్టంలో ఉన్నాడని గ్రహించాడు.

భక్తుల రద్దీ తగ్గాక తన పనులు ముగించుకుని మెల్లగా ఆ అపరిచిత వ్యక్తి దగ్గర వచ్చి కూర్చుని మెల్లమెల్లగా అతని కుశలం అడిగాడు. అర్చకుడు వేసిన ప్రశ్నలు విని ఆ అపరిచిత వ్యక్తి ఒక్క సారిగా విలపించసాగాడు. కొద్ది సేపు అలా ఏడ్చి తనను తాను స్వాంతన పరుచుకుని తన గురించి చెప్పసాగాడు. తాను దేశవిదేశాలకు సంబంధించే భవనాల కట్టడాల తాలూకు కాంట్రాక్టరు అని, తన డబ్బు సర్వస్వం వివిధ దేశాల ప్రభుత్వం చేతుల్లో చిక్కి ఉందని, తనకు తన డబ్బు ఎంత ప్రయత్నించినా తిరిగి రావట్లేదని, తనకు రావలసినది వెయ్యి రెండు వేలు కాదు 7 కోట్లుగా అతను చెప్పాడు.

అపరిచితవ్యక్తి చెప్పినదంతా శ్రద్ధగా విని అర్చకుడు సానుభూతితో , ఇలా అన్నాడు. “నాయనా ! చింతించకు ,నీ కష్టాలన్నీ గట్టెక్కుతాయి. నీవు ఎప్పుడైతే చిలుకూరుకు వచ్చి ఆ భగవంతుడిని శరణుకోరావో నీ సమస్యలన్నీ ఆయనే చూసుకొంటాడు. నీవు మాత్రం ఈ ఋణ విమోచన నృసింహ స్తోత్రం ప్రతి రోజు సాయంత్రం జపించు అంటూ ఒక చిన్న కాగితం మీద ఆ స్తోత్రం రాసి ఇచ్చాడు. ఆ వ్యక్తి కాగితం అందుకుని , జపిస్తాను అంటూ వెళ్ళి పోయాడు. అర్చకుడు ఈ పై సంఘటనను ఆనాడే మరిచి పోయాడు, కాని ఎనిమిది నెలల తరువాత ఆ భక్తుడు తిరిగి ఆలయానికి వచ్చి అర్చకునికి తన అనుభవాలు ఇలా చెప్పాడు. “స్వామీ! మీరు చెప్పినట్టుగానే ఆ స్తోత్రం రోజు సాయంత్రం జపించసాగాను. మొట్టమొదట నాకు ఢాకా నుండి 1.5 కోట్ల రూపాయలకు DD వచ్చి చేరింది. ఈ పైకం కొరకు నేను గత 15 నెలలనుండి ఎదురు చూస్తున్నాను. అలాగే క్రమంగా అన్ని దేశాలనుండి నాకు చెందవలసిన ధనం నాకు వచ్చేసింది” అంటూ తృప్తిగా మెరిసే కన్నులతో చెప్పాడు.

“స్వామి! చిలుకూరు బాలాజీ మహిమల గురించి చాలా విన్నాను. కాని ఇంతటి కరుణ నాపై ప్రసరింపబడుతుందని నేను ఎదురు చూడ లేదు. ఇక్కడకు రాకపోయి ఉంటే ,ఖచ్చితంగా నా సమస్యలు భరించలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండేవాడిని ఆ పాపం చేయకుండా బాలాజీ నన్ను కాపాడాడు '' అంటూ ఆ భక్తుడు రెండు చేతులు జోడించి స్వామికి నమస్కారం చేసాడు.

“నాలా సమస్యలతో బాధపడే వేలాది భక్తులకోసం ఈ స్తోత్రాన్ని మీ “వాక్” పత్రికలో ప్రచురించండి” అని స్వామిని ఆ భక్తుడు కోరుతూ తన కథను ముగించాడు.

ఈ భక్తుని కోరిక మేరకు ఈ స్తోత్రాన్ని వాక్ పత్రికలో ప్రచురిస్తున్నాము. అప్పులతో బాధ పడేవారు, అప్పిచ్చి తిరిగి ధనాన్ని పొందకోరే భక్తులు ఈ ఋణవిమోచన నృసింహ స్తోత్రం జపించి లాభం పొందగలరని మేము ఆశిస్తున్నాము.

**చిలుకూరు బాలాజీ అనుగ్రహం - 3**

**మాకు వీసా ఇచ్చాడు...**

ఆగష్టు 4 ,2004 నాడు చెన్నైలో అమెరికన్ కన్సొలేట్‌లో వీసా అపాయింట్‌మెంట్ ఉండింది. అదేరోజు ఉదయం వెంకటేశ్వరస్వామి దేవాలయం వెళ్ళి నాకు, మా ఆవిడకు 10 సంవత్సరాల మల్టిపుల్ వీసా వస్తే చిలుకూరులో దర్శించుకుంటానని మొక్కాను. అదేరోజు సాయంత్రం 4.30కి అమెరికన్ కన్సొలేట్ లో స్టాంపింగ్ జరిగింది. ఆగష్టు 9, నాడు పోస్ట్‌లో కవర్ వచ్చింది. దాంట్లో రెండు వీసాలు 10 సంవత్సరాలకి వచ్చాయి. మొక్కుతీర్చుకోవడానికి

అగస్ట్ 10,18 మధ్యలో చిలుకూరు వస్తానని స్వామితో మనసులోనే మనవి చేసుకున్నాను. 10 నుండి 18 వరకు హైదరాబాద్‌లోనే ఉన్నా పని వత్తిడి వల్ల దర్శనం చేసుకోలేకపోయాను. మొక్కు తీర్చుకోలేకపోయాను. అగస్ట్19నాడు అమెరికా వెళ్ళాము. 2 నెలలు అలా గడచినాయి. అక్టోబర్ 12నాడు హైదరాబాద్‌లో ల్యాండ్ అయ్యాను. జెట్‌లాగ్‌తో 2 రోజులు నిద్రే నిద్ర. 14 ఉదయం వచ్చి వినమ్రతతో మొక్కుతీర్చుకున్నాను. తదనంతరం స్వామి దర్శనమైంది.

చిలుకూరు బాలాజీ అనుగ్రహం - 4

భగవంతుని దయవలన నేను ఒక ఉద్యోగములో ఉండగా నాకు బంగారము వంటి మంచి ఉద్యోగము వచ్చింది. భగవంతుని దయవలన ఆ మంచి ఉద్యోగములో చేరి కొన్ని రోజులు మాత్రమే చేసుకోగలిగాను దురదృష్టవశాత్తు నేను నాకుగానే ఆ ఉద్యోగము నిలుపుకోలేక పోయాను. వెనక్కు రావలసి వచ్చింది. మరల వెనక్కు వచ్చి విపరీతముగా బాధపడ్డాను. ఆ సమయములో నాకు చిలుకూరు వెంకటేశ్వరస్వామిగారి గురించి మా అత్తగారు చెప్పి ఒక రోజు ఆవిడ వచ్చి మా ఇంట్లో ఉండి మమ్ములను ఇద్దరిని చిలుకూరు పంపించారు. మేము చిలుకూరు వచ్చి 11 ప్రదక్షిణములు చేసుకొని కోరిక కోరుకున్నాను. త్వరలో అంటే మూడు, నాలుగు నెలలో నేను పోగొట్టుకొన్న దానికంటె ఇంకా మంచిదైన బంగారంవంటి ఉద్యోగము మరొకటి చిలుకూరి వెంకటేశ్వరస్వామివారు నాకు అనుగ్రహించారు. నేను ఆ ఉద్యోగములో జాయిన్ అయి చక్కగా ఉద్యోగము చేసుకుంటున్నాను. స్వామివారు అక్కడ ఉద్యోగము మంచిగా చేసుకొనేటట్టుగ అనుగ్రహిస్తున్నారు. నేను ఈ ఊరు వచ్చినప్పుడు 108 ప్రదక్షిణములు చేసుకొని స్వామివారి దర్శనము మరల చేసుకొన్నాను. స్వామివారి దర్శనము మరల మరల చేసుకోవాలని దానికి స్వామివారి అనుగ్రహము ఉంటుందని ఆశిస్తున్నాను. ఇంకా చాలా చాలా పనులు అనుకుంటున్నాను. అన్నీ నెరవేరుతున్నాయి. మరల మరల స్వామివారి దర్శనము చేసుకుంటున్నాను. 108 ప్రదక్షిణములు చేసుకొంటున్నాను. చిలుకూరు వచ్చి ఇక్కడ వున్నప్పుడు నాకు చాలా మనఃశ్శాంతిగా ఉంటుంది. అంతా భగవంతుని అనుగ్రహము.

ప్రసాద్, బెల్గాం

చిలుకూరు బాలాజీ అనుగ్రహం - 5

**తిరిగి లభించిన చదువు**

ఇది ఒక కుటుంబం పొందిన అనుభవం. ఈ కుటుంబంలోని అబ్బాయికి పిలానీలో ఇంజనీరింగు చదవాలని కోరిక. కానీ, దురదృష్టవశాత్తు, రెండు మార్కులు తక్కువ కావడం వలన ఈ అబ్బాయికి పిలానీలో చదవ గలిగే అవకాశాన్ని కోల్పోయాడు. ఇందువలన ఆ అబ్బాయి, అతని తలిదండ్రులు ఎంతో నిరాశ పడ్డారు. పిల్లవాని భవిష్యత్తు తలుచుకుని ఆందోళన చెందసాగారు. అయితే జరిగిన దానికి నిరాశ చెందక అతను ఇతర కళాశాలల్లో కూడా దరఖాస్తులు (అప్లికేషన్లు) పెట్టుకున్నాడు. అందుకు ఫలితంగా ఆ అబ్బాయికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రోద్బలంతో అమెరికన్ల చేత స్థాపించబడిన ఒక నూతన కళాశాలలో సీటు దొరికినది.

ఇందులో చక్కని వసతులతో, ఐ.ఐ.టి. నుండి వచ్చిన ఉపాధ్యాయులతో ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతో అబ్బాయిని ఆ కళాశాలలో చేర్పించారు పెద్దలు. ఇక్కడ అప్పటికే 50 మంది విద్యార్థులు చేరారు. చదువు మరియు ఫీజు ఏటా 1,50,000/- ఐనా కూడా, తల్లిదండ్రులు వెనుకంజ వేయలేదు. కాని ఇక్కడ కూడా అబ్బాయి దురదృష్టం మళ్ళీ తలుపు తట్టింది. అకస్మాత్తుగా ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించని కారణంగా కళాశాలను మూసివేయబోతున్నామని కళాశాల మేనేజిమెంటు ఒక నోటీసును విడుదల చేసింది.

యాజమాన్యం విద్యార్థులనుండి తీసుకున్న రుసుము తిరిగి ఇచ్చేయడమే కాకుండా నష్టపరిహారంగా ఒక్కొక్క విద్యార్థికి 50,000 రూపాయలు చొప్పున ఇవ్వ బోతున్నట్లు ప్రకటించింది. తల్లిదండ్రులకు కర్తవ్యం తోచలేదు. 50 మంది విద్యార్థులలో 20 మందికి ఎమ్‌సెట్ మార్కుల ఆధారంగా స్థానిక కళాశాలల్లోనే ప్రవేశం లభించింది. మరి మిగతా 30 మంది సంగతి??? మన అబ్బాయి మిగిలిన ఆ 30 మందిలో ఉన్నాడు. అబ్బాయి చిలుకూరుకు వచ్చి ప్రార్థించాడు. అంతే! ఆ భగవంతుని కృప వలన సమస్యకు పరిష్కారం త్వరలోనే లభించింది.

నిస్సహాయులైన ఈ తల్లిదండ్రులు అందరూ సమావేశమై ఆలోచించి కలసికట్టుగా బయలుదేరి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని కలిసి తమ పరిస్థితిని వివరించారు. ఆయన అనిల్ అంబానీకి ఒక లేఖ వ్రాసి విద్యార్థులకు సహాయం చేయమని కోరారు. అంబానీ గారు ముఖ్యమంత్రిగారి కోరికకు సమాధానంగా మిగిలిన 30 మంది విద్యార్థులకు అహ్మదాబాదులోని వారి ఇనిస్టిట్యూట్‌లో సీటులను మంజూరు చేశారు. ఇప్పుడు ఆ విద్యార్థులు అక్కడ చక్కటి విద్యను పొందుతున్నారు. పిల్లవాడు, అతని తల్లిదండ్రులు అందరు 108 ప్రదక్షిణలు చిలుకూరు బాలాజీకి చేసారు.


చిలుకూరు చేరుకున్న వెంటనే కాళ్ళు కడుక్కొని గుడి లోపలకు వెళ్ళింది బృందం. స్వామి దర్శనానికి పెద్దగా లైన్ లేదు. అరవై నిమిషాలలోనే దర్శనం అయ్యింది. "స్వామి దర్శనం సమయంలో కళ్ళు మూసుకోవద్దు". చెబుతున్నారు అర్చకులు.

స్వామివారిని దీర్ఘంగా చూశాడు 'గురు'

"నీవు చేసే పని అభినందనీయం" అన్నట్టుగా ఒక చిన్న మందహాసం స్వామి వారి ముఖంలో 'గురు' అనబడే చట్టర్జీకి కనిపించింది. చేతులు జోడించాడు. ఒక్క క్షణంలో మెడపైన ఒక పూల హారం పడింది.

"మీరు తలపెట్టిన కార్యం తప్పక విజయవంతమౌతుంది." అంటూ దండవేసిన అర్చకులు ఒక చిరునవ్వుతో చెబుతూంటే, "స్వామి, ఇది నీ పనే...." అంటూ కళ్ళల్లో నీళ్ళు తిరిగిన దాన్ని తుడుచుకుంటూ అనుకున్నాడు 'గురు'.

ఇదంతా ఆ స్వామియే నడిపిస్తున్నాడని, తమకు పూర్తి అనుగ్రహం ఉందనే విశ్వాసంతో బృందం మెల్లిగా వెనుతిరిగింది.



A C. No 93119

# రచయిత గురించి

చిలుకూరు అర్చక వంశంలో పుట్టిన రంగరాజన్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1988లో బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమశ్రేణిలో పట్టభద్రుడైనారు. రంగరాజన్ తమ 14 సంవత్సరాల కాలాన్ని ఆస్పత్రులలో శస్త్ర చికిత్సలలో, ముఖ్యంగా హృద్రోగ చికిత్సలో వినియోగించబడే పరికరాలపై అనుపమాన పరిజ్ఞానంతో మెడ్‌ట్రానిక్‌లాంటి గుర్తింపు పొందిన ఎన్నో దేశీయ, విదేశీయ కీలకమైన సంస్థలలో ముఖ్యమైన పదవులను నిర్వహించారు.

2002వ సంవత్సరంలో 30/87 దేవాదాయ చట్టం క్రీనీడల్లో దేవాదాయ శాఖ చిలుకూరుపై చేసిన దాడిని ప్రతిఘటించడం తమ ముఖ్య కర్తవ్యమని భావించి, వంశపారంపర్య అర్చకత్వాన్ని ఆ చట్టం రద్దు చేసినా, స్వామి సేవనుండి తమను వేరు చేయగల శక్తి ఎవరికి లేదని వాదిస్తూ తమ ఉద్యోగాన్ని, వదిలి స్వామి కైంకర్యంలోనికి ప్రవేశించారు.

దేవాలయాల పరిరక్షణ ఉద్యమంలో తనవంతు కృషి చేస్తూ భక్తులను చైతన్యవంతులను చేస్తున్నారు. దేవాదాయశాఖ మరియు అహోబిలమఠం సంయుక్తంగా మార్చి 2004లో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పాంచరాత్రాగమంలో అర్చకులకు నిర్వహించిన పునశ్చరణ శిక్షణా శిబిరానికి కో - ఆర్డినేటర్‌గా వ్యవహరించి అటు దేవాదాయశాఖ మన్ననలను ఇటు శిక్షణకు వచ్చిన అర్చకుల అభినందనలను పొందగలిగారు.

తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో వెలువడే 'వాక్' పత్రికకు వ్యాస రచన చేయడం, కార్టూన్లు వేయడం వీరి అభిరుచి.

దేవాలయాల పరిరక్షణ ఉద్యమం